www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వినాయక చవితి శుభాకాంక్షలు

శనివారం | 7-9-2024 | పేజీలు: 14+ 32 పేజీల వినాయక వ్రతకల్పం | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 144 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 5.38 తదుపరి పంచమి; నక్షత్రం: చిత్ర మ. 12.34 తదుపరి స్వాతి; వర్జ్యం: రా. 6.51-8.39; దుర్ముహూర్తం: ఉ. 6.05-7.43; అమృతఘడియలు: తె. ఉ. 7.08, తె. 5.38 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ.5.5 లక్షల కోట్లు గల్లంతు

సెన్సెక్స్ 1,017 పాయింట్లు డౌన్.. 25,000 దిగువకు నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతం (శుక్ర వారం) ట్రేడింగ్‌లో భారీ నష్టాన్ని చవిచూశాయి. ఒక దశలో 1,219 పాయింట్లు క్షీణించి 81,000 దిగువకు పడిపోయిన సెన్సెక్స్. చివ రికి 1,017.23 పాయింట్ల (1.24 శాతం) నష్టంతో 81,183.93 వద్ద స్థిరపడింది. గత నెల 23 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ విషయానికొస్తే, 292.95 పాయింట్లు (1.17 శాతం) పతనమై 24,852.15 వద్ద క్లోజైంది. మార్కెట్లో అమ్మకాలు పోటెత్తడంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.49 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.460.18 లక్షల కోట్లకు (5.48 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. అంతర్జాతీయంగా ట్రేడింగ్ ట్రెండ్ ప్రతికూలంగా ఉండటంతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి. అమెరికా ప్రభుత్వం గత నెల ఉద్యోగాల కల్పన గణాంకాలు విడుదల చేసే నేపథ్యంలో అంత ర్జాతీయంగా ఈక్విటీ ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు. జాబ్స్ డేటా అంచనాల కన్నా మెరుగ్గా ఉంటే, ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలోనూ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చన్న ఆందోళనలతో ఈక్విటీల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. దీంతో దేశీయ మార్కెట్లోనూ ఇన్వెస్టర్లు ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంకింగ్ సహా అన్ని రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. మన మార్కెట్ రికార్డు గరిష్ఠాల వద్ద ట్రేడవుతుండటం, చాలా షేర్లు అధిక ధరల వద్ద కదలాడుతుండటం కూడా ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించేందుకు ప్రేరేపించాయి. మరిన్ని ముఖ్యాంశాలు..

బజార్ స్టైల్ రిటైల్ లిస్టింగ్ ఓకే

రేఖా ఝున్‌ఝున్‌వాలా పెట్టుబడులు కలిగిన ఫ్యాషన్ రిటైలింగ్ కంపెనీ బజార్ స్టైల్ రిటైల్ లిమిటెడ్ శుక్రవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఐపీఓ ధర రూ.389 వద్దే లిస్టయినప్పటికీ, ఇంట్రాడేలో 10.78 శాతం వరకు పెరిగి రూ.430.95 వద్దకు ఎగబాకింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి షేరు ధర 2.73 శాతం లాభంతో రూ.399.65 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,982.08 కోట్లుగా నమోదైంది.

ఏథర్ ఎనర్జీ రూ.4,500 కోట్ల ఐపీఓ!

మరో దేశీయ విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి సిద్ధమవుతోంది. ఇందుకోసం వచ్చే వారం మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హియరింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించనుంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.4,500 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. కొత్త షేర్ల జారీతో పాటు ఇప్పటికే కంపెనీ ఈక్విటీలో మదుపు చేసిన మదుపరుల్లో కొందరు తమ పెట్టుబడిలో కొంత మొత్తాన్ని ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయిస్తారని సమాచారం. మరో ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ విజవంతమైన నెల రోజులకే ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సిద్ధమవడం విశేషం.

ఇక ఈ-ఫార్మాట్‌లోనే బీమా పాలసీలు

15 రోజుల్లో డెత్ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్: ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ: బీమా పాలసీలపై పాలసీ హోల్డర్ల హక్కులకు సంబంధించి బీమా నియంత్రణ అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. బీమా కంపెనీలు తప్పనిసరిగా తమ పాలసీలను ఎలక్ట్రానిక్ ఫార్మాట్ (ఈ-ఫార్మాట్)లోనే జారీ చేయాలని స్పష్టం చేసింది. అయితే పాలసీదారులు కోరితే, కంపెనీలు ఫిజికల్ కాపీ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. జీవిత బీమా పాలసీలకు సంబంధించి ఐఆర్‌డీఏఐ కొత్త ఆదేశాలు జారీ చేసింది. పాలసీదారులు ప్రపోజల్ ఫారాన్ని ఆమోదించిన 15 రోజుల్లో కంపెనీలు పాలసీలు జారీ చేయాలని ఆదేశించింది. ప్రపోజల్ ఫారంతో పాటు ప్రీమియం వసూలు చేయడానికీ ఐఆర్‌డీఏఐ చెక్ పెట్టింది. మంచి ఆరోగ్యంతో ఉన్నట్టు పాలసీదారులు ప్రకటించిన వెంటనే జారీ చేసే పాలసీలపై మాత్రమే వెంటనే ప్రీమియం వసూలు చేసేందుకు అనుమతిస్తారు. బీమా కంపెనీలు ఇక పాలసీదారులకు పాలసీ డాక్యుమెంట్‌తో పాటు కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ (సీఐఎస్) కూడా తప్పనిసరిగా ఇవ్వాలి.

ఇతర ముఖ్య ఆదేశాలు

- జీవిత బీమా పాలసీలకు నెల రోజుల ఫ్రీ లుక్ పీరియడ్. పాలసీదారుడికి పాలసీ నచ్చక పోతే ఈ గడువులోగా పాలసీని రద్దు చేసుకునే స్వేచ్ఛ
- విజ్ఞప్తి అందిన 15 రోజుల్లో డెత్ క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్
- దర్యాప్తుతో ముడిపడిన డెత్ క్లెయిమ్స్ విజ్ఞప్తి అందిన 45 రోజుల్లో సెటిల్ చేయాలి
- సరెండర్ లేదా పాక్షిక ఉపసంహరణ విజ్ఞప్తులను వారం రోజుల్లో పరిష్కరించాలి.
- డ్యూ డేట్‌లోనే మెచ్యూరిటీ, ఇన్‌కమ్, సర్వైవల్ బెనిఫిట్స్, యాన్యుటీ చెల్లింపులు
- ప్రపోజల్ ఫారంలో పాలసీదారులు తప్పనిసరిగా ఒకరు లేదా ఇద్దరు నామినీల వివరాలు పేర్కొనాలి
- ఆరోగ్య బీమా పాలసీదారులకు జారీ చేసే సీఐఎస్‌లో తప్పనిసరిగా పాలసీ పేరు, ఎంత మొత్తానికి బీమా కవరేజీ తీసుకున్నారు? వంటి వివరాలు ఉండాలి
- క్యాష్‌లెస్ క్లెయిమ్స్ అనుమతిపై బీమా కంపెనీలు విజ్ఞప్తి అందిన గంట సేపట్లో నిర్ణయం తీసుకోవాలి
- క్యాష్‌లెస్ క్లెయిమ్‌లను మూడు గంటల్లో సెటిల్ చేయాలి
- హాస్పిటల్ నుంచి డిశ్చార్జి కోసం విజ్ఞప్తి అందిన మూడు గంటల్లోగా బీమా కంపెనీలు నిర్ణయం తీసుకోవాలి. ఆ లోగా నిర్ణయం తీసుకోకపోతే అయ్యే అదనపు ఖర్చులను బీమా కంపెనీలే భరించాలి.
- ట్రీట్‌మెంట్ సమయంలో పాలసీదారుడు చనిపోతే క్లెయిమ్ విజ్ఞప్తిని బీమా కంపెనీ వెంటనే ప్రాసెస్ చేసి సెటిల్ చేయాలి
- ట్రీట్‌మెంట్ సమయంలో పాలసీదారుడు చనిపోతే, హాస్పిటల్ అతని మృతదేహాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అప్పగించేలా చూడాలి.

ఎన్ఎస్ఈలో బుల్



బీఎస్ఈలో మాదిరిగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)లోనూ బుల్ బొమ్మను ఏర్పాటు చేశారు. బుల్‌తోపాటు భారత కుటుంబానికి ప్రాతినిధ్యం వహించే ఆరుగురు మనుషుల ప్రతిమలను సైతం ప్రతిష్ఠించారు. రెండు సెట్లుగా ఏర్పాటు చేసిన ఈ బొమ్మలను మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఆవిష్కరించారు. రెండు సెట్లలో ఒకటి ఎక్స్ఛేంజీ ఆవరణలో, మరొకటి బయట ఏర్పాటు చేసినట్లు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ తెలిపారు.

హ్యుండయ్ ఎక్స్‌టర్‌లో కొత్త వేరియెంట్లు



చెన్నై: హ్యుండయ్ మోటార్ ఇండియా ఎంట్రీ లెవెల్ ఎస్‌యూవీ ఎక్స్‌టర్‌లో రెండు కొత్త వేరియెంట్లను మార్కెట్లోకి తెచ్చింది. వీటిలో ఎస్ (ఓ)+ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వేరియెంట్ ధర రూ.7,86,300 కాగా ఎస్+ ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వేరియెంట్ ధర రూ.8,43,900. ఈ కొత్త వేరియెంట్లలో స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, కలర్ టీఎఫ్‌టీ మల్టీ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లేతో కూడిన డిజిటల్ క్లస్టర్, 8 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థ, ఆండ్రాయిడ్ ఆటో అండ్ యాపిల్ కార్‌ప్లే, వెనుక భాగంలో కూడా ఏసీ వెంట్లు ఈ వేరియెంట్ల ప్రత్యేకతలు. అలాగే వీటికి ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, అన్ని సీట్లకు 3 పాయింట్ సీట్‌బెల్ట్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ వ్యవస్థ కూడా ఉంటాయి.

కేరళకు కిమ్స్ హాస్పిటల్స్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కిమ్స్ హాస్పిటల్స్ తన కార్యకలాపాలను కేరళకు విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కన్నూర్‌లోని శ్రీచంద్ స్పెషాలిటీ హాస్పిటల్‌తో దీర్ఘకాలిక లీజు, ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. తన అనుబంధ సంస్థ కిమ్స్ స్వస్థ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఈ ఒప్పందం కుదుర్చుకుంది. కేరళలో తమ వైద్య సేవల విస్తరణకు ఇది తొలి అడుగని కిమ్స్ హాస్పిటల్స్ డైరెక్టర్, సీఈఓ డాక్టర్ బొల్లినేని అభినయ్ తెలిపారు. ప్రస్తుతం 180 పడకలు ఉన్న శ్రీచంద్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కిమ్స్ 350 పడకల ఆసుపత్రిగా విస్తరిస్తుంది.

సీఎం ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కు రూ.2 కోట్ల విరాళం

భారత్ బయోటెక్

వరదలు, భారీ వర్షాలతో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలను ఆదుకునేందుకు కార్పొరేట్ సంస్థలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నాయి. తాజాగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే భారత్ బయోటెక్ సంస్థ రెండు రాష్ట్రాల సీఎం ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కు రూ.కోటి చొప్పున విరాళం ప్రకటించింది. వరదలతో దెబ్బతిన్న ప్రజల పునరావాసం, ఉపశమనానికి సాయపడడం బాధ్యతగా భావించి ఈ విరాళం అందిస్తున్నట్టు తెలిపింది.

తెలంగాణ వరద సహాయ చర్యల కోసం రూ.2.5 కోట్లు

జీఎంఆర్ గ్రూప్

తెలంగాణ వరద బాధితుల సహాయ, పునరావాసం కోసం జీఎంఆర్ గ్రూప్ రూ.2.5 కోట్ల విరాళం ప్రకటించింది. దీనికి సంబంధించిన చెక్కును జీఎంఆర్ గ్రూప్ ప్రతినిధులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అందజేశారు.

నెల రోజుల్లో అప్రెంటిస్‌ల నియామకం

నెలకు రూ.5,000 స్టైఫండ్
ఐబీఏ సీఈఓ సునీల్ మెహతా

ముంబై: బ్యాంకులు పెద్దఎత్తున అప్రెంటిస్‌ల నియామకాలకు సిద్ధమవుతున్నాయి. నెల రోజుల్లోనే వీరి ఎంపిక పూర్తవుతుందని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) సీఈఓ సునీల్ మెహతా చెప్పారు. డిగ్రీ పూర్తి చేసి 21-25 సంవత్సరాల మధ్య వయసున్న యువతీ, యువకులు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన ప్రత్యేక నైపుణ్యాల్లో వీరికి శిక్షణ ఇచ్చి నెలకు రూ.5,000 చొప్పున స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. ఐఐటీలు, ఐఐఎం వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో డిగ్రీ పూర్తి చేసిన వారు ఇందుకు అనర్హులు. వీరి అప్రెంటిస్‌షిప్ ఏడాది పాటు ఉంటుంది. తర్వాత పనితీరు ఆధారంగా వీరిని బ్యాంకింగ్ కరస్పాండెంట్లుగా నియమించే అవకాశం ఉందని మెహతా చెప్పారు. అద్భుత పనితీరు కనబరిచే అప్రెంటిస్‌లను బ్యాంకులు రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకునే అవకాశం కూడా ఉందన్నారు.

హైదరాబాద్‌లో ఎజిలిసియం డెవలప్‌మెంట్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డేటా, అనలిటిక్స్ సొల్యూషన్స్ కంపెనీ 'ఎజిలిసియం' తన కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించింది. ఇందులో భాగంగా సైబర్‌సిటీలో కొత్తగా డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ద్వారా ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు వినూత్న డేటా, అనలిటిక్స్ సేవలు అందిస్తుంది. సైబర్‌సిటీలోని ఆర్ఎంజడ్ స్కైన్ క్యాంపస్‌లో ఈ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో 100 మంది నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,310 ▲	67,200 ▲	92,000 ▲
ముంబై	71,931 ▲	65,889 ▲	83,338 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	485
వరంగల్	472	గోదావరి	480
చిత్తూరు	518	విశాఖపట్నం	490
		దజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	99
కర్నూలు	99	నెల్లూరు	99
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		



భారత పతాకధారులు హర్విందర్, ప్రీతి

పారాలింపిక్స్ ముగింపోత్సవం

న్యూఢిల్లీ: ఆర్చరీ స్వర్ణ విజేత హర్విందర్ సింగ్, అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు సాధించిన ప్రీతి పాల్ ఆదివారం జరిగే పారాలింపిక్స్ ముగింపు ఉత్సవంలో భారత పతాకధారులుగా వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ సంఘం శుక్రవారం వెల్లడించింది. ప్రతిష్ఠాత్మక విశ్వ క్రీడల ముగింపు కార్యక్రమంలో త్రివర్ణ పతకాన్ని చేబూని ముందు నడవడం గర్వకారణంగా భావిస్తున్నామని హర్విందర్, ప్రీతిపాల్ వ్యాఖ్యానించారు.

డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా



న్యూఢిల్లీ: డిఫెండింగ్ చాంపియన్, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. గురువారం జ్యూరిచ్ డైమండ్ లీగ్ ముగియగా ఓవరాల్ స్టాండింగ్స్‌లో చోప్రా నాలుగో స్థానంలో నిలిచాడు. వాస్తవానికి తను జ్యూరిచ్ పోటీల్లో పాల్గొనకపోయినా అంతకుముందు దోహా, లాసాన్నే లీగ్‌ల్లో రెండో స్థానంలో నిలిచి 14 పాయింట్లు సాధించాడు. ఈనెల 13, 14 తేదీల్లో బ్రసెల్స్‌లో జరిగే ఫైనల్స్‌లో ఆరుగురు అథ్లెట్లు అమీతుమీ తేల్చుకోనున్నారు.

పారాలింపిక్స్‌లో భారత్ షెడ్యూల్ నేడు

రోడ్ సైక్లింగ్: పురుషుల రోడ్ రేస్ సీ1-3 (పతక రౌండ్)- అర్షద్ షేక్ (మ. 1.00), మహిళల రోడ్ రేస్ సీ1-3 (పతక రౌండ్)- జ్యోతి గడేరియా (మ. 1.05);
కనోయింగ్ స్ప్రింట్: పురుషుల కేఎల్1 200 మీ. సెమీఫైనల్- యష్ కుమార్ (మ. 1.30), మహిళల వీఎల్ 200 మీ. సెమీఫైనల్ - ప్రాచీ యాదవ్ (మ. 2.04);
స్విమ్మింగ్: పురుషుల 50 మీ. బటర్‌ఫ్లై ఎస్7 హీట్స్ - సుయాశ్ యాదవ్ (మ. 1.55);
అథ్లెటిక్స్: పురుషుల 400 మీటర్ల రేస్ టీ47 (పతక రౌండ్) - దిలీప్ గావిత్ (రాత్రి 12.29).

షూటర్ శౌర్యకు స్వర్ణం

న్యూఢిల్లీ: వినికిడి లోపం కలిగిన షూటర్ శౌర్య సైనీ వరల్డ్ డెఫ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. జర్మనీలోని హనోవర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో శౌర్య పురుషుల 50 మీ. రైఫిల్ 3 పొజిషన్‌లో 452.4 పాయింట్లతో వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఈ టోర్నీలో ఇప్పటికే అతను 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో రజతం నెగ్గాడు.



ప్రవీణ్ గోల్డెన్ జంప్

హైజంప్‌లో స్వర్ణం
పారాలింపిక్స్

పారాగేమ్స్‌లో హైజంపర్ ప్రవీణ్ కుమార్ పసిడి కలను నెరవేర్చుకున్నాడు. టోక్యో గేమ్స్‌లో రజతం మాత్రమే అందుకున్న తను ఈసారి మాత్రం అత్యుత్తమ ప్రదర్శనతో ఆసియా రికార్డును నెలకొల్పుతూ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాడు. అయితే జావెలిన్‌త్రో, పవర్‌లిఫ్టింగ్‌లో పతకాలను ఆశించినా దీపేశ్, రాజమణి నిరాశపరిచారు. మొత్తంగా భారత్ ఖాతాలో 6 స్వర్ణాలు, 9 రజతాలు, 11 కాంస్యాలతో 26 పతకాలు చేరాయి.

పారిస్: పారాలింపిక్స్‌లో టార్గెట్-25 మెడల్స్ లక్ష్యాన్ని అలవోకగా దాటేసిన భారత అథ్లెట్లు తమ జోరును కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా మన ఖాతాలో ఆరో స్వర్ణం చేరింది. శుక్రవారం జరిగిన పురుషుల హైజంప్ టీ64 ఫైనల్స్‌లో ప్రవీణ్ కుమార్ 2.08 మీటర్ల ఎత్తు దుమికి పసిడి పట్టాడు. ఈ సీజన్‌లో అతడికిదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. అంతేకాదు.. పారాలింపిక్స్‌లో ప్రవీణ్‌కిది వరుసగా రెండో పతకం. టోక్యో గేమ్స్‌లో అతను 2.07 మీటర్లతో రజతం అందుకున్నాడు. నొయిడాకు చెందిన ఈ 21 ఏళ్ల యువ అథ్లెట్‌కు పుట్టుకతోనే ఎడమ కాలు తక్కువ ఎత్తులో ఉంది. దీంతో ఆత్మనూన్యతా భావాన్ని పోగొట్టుకునేందుకు క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. మొదట వాలీబాల్ ఆడినా ఆ తర్వాత కోచ్ సత్యపాల్ సింగ్ ప్రోత్సాహంతో హైజంప్ వైపు దృష్టి సారించడంతో అతడి దశ మారింది. మరోవైపు పారాలింపిక్స్ హైజంప్‌లో స్వర్ణం గెలిచిన రెండో భారత అథ్లెట్‌గా ప్రవీణ్ నిలిచాడు. గతంలో మరియప్పన్ తంగవేలు ఈ ఫీట్ సాధించాడు. ఇక పారిస్ పారాగేమ్స్‌లో భారత్‌కిది మూడో హైజంప్ మెడల్. ఇప్పటికే టీ63 ఈవెంట్‌లో శరద్ రజతం, మరియప్పన్ కాంస్యం అందుకున్నాడు. పురుషుల 400 మీ. టీ47 హీట్1లో దిలీప్ 49.54సె. టైమింగ్‌తో మూడోస్థానంలో నిలిచి ఫైనల్ చేరాడు.

కనోయి స్ప్రింట్‌లో సెమీస్‌కు..

పురుషుల కనోయి స్ప్రింట్ కేఎల్1 200మీ. హీట్1లో యష్ కుమార్ ఆరో స్థానంలో, మహిళల వీఎల్2 200మీ. హీట్స్‌లో ప్రాచీ యాదవ్ నాలుగో స్థానంలో, మహిళల కేఎల్1 200మీ. పూజా ఓజా ఐదో స్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించారు.

దీపేశ్, రాజమణిలకు నిరాశ: జావెలిన్ త్రో, పవర్‌లిఫ్టింగ్‌లో భారత అథ్లెట్లు ఫైనల్‌కు వెళ్లినా పతకం అందుకోలేకపోయారు. పురుషుల జావెలిన్‌త్రో ఎఫ్54 ఫైనల్‌లో దీపేశ్ కుమార్ 26.11మీ. దూరం విసిరి చివరిదైన ఏడో స్థానంలో నిలిచాడు. అలాగే మహిళల 67కేజీ పవర్ లిఫ్టింగ్‌లో 40 ఏళ్ల రాజమణి తన మూడు ప్రయత్నాల్లో 106కేజీల బరువు మాత్రమే ఎత్తి ఎనిమిదో స్థానంతో నిరాశపరిచింది.

స్పోర్ట్స్

గాయం నుంచి కోలుకొని..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మూడు నెలల కిందట జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌కు గజ్జల్లో గాయమైంది. దాంతో ఆ పోటీలలో అతడు స్వర్ణంపై ఆశలు వదులుకున్నాడు. అసలు పతకమే లభించదేమోననే అనుమానాలు వ్యక్తమైనా..ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మూడో స్థానంలో నిలిచిన ప్రవీణ్ పారిస్ బెర్త్ పట్టేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్, పారాలింపిక్స్ మధ్య ఉన్న సమయం చాలా తక్కువ. గాయంనుంచి కోలుకొన్నాక పారిస్‌లో బరిలో దిగేందుకు కేవలం 15 రోజుల సమయమే మిగిలింది. ఇంత తక్కువ సమయంలో విశ్వక్రీడలకు సన్నద్ధమై ప్రవీణ్ అక్కడ ఎలాంటి ప్రదర్శన చేస్తాడోనన్న ఉత్కంఠ ఏర్పడింది. అయితే కుమార్ ఆశావహ దృక్పథం, ఓటమిని త్వరగా అంగీకరించని తత్వం కలిగిన కోచ్ సత్యపాల్ సింగ్ సహకారం వెరసి..పారిస్‌లో ఈ హైజంపర్ రికార్డు స్వర్ణాన్ని దక్కించుకొనేందుకు తోడ్పడింది. 'నేను ఈరోజు ఇంతగా విజయవంతం అయ్యానంటే అందుకు పూర్తి క్రెడిట్ సత్యపాల్ సర్‌దే. అలాగే స్పాన్సర్లు, ఫిజియో సహకారం కూడా మరువలేనిది. తక్కువ సమయంలోనే గాయంనుంచి కోలుకొని నేను రాణించడంలో కీలక భూమిక పోషించిన వారికి ఎంతో రుణపడి ఉన్నా' అని ప్రవీణ్ అన్నాడు.



పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి జీవాంజి శుక్రవారం హైదరాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం తాను శిక్షణ పొందిన గోపీచంద్ అకాడమీకి చేరుకున్న దీప్తి..తల్లిదండ్రులు, కోచ్ రమేశ్‌తో కలిసి ఫొటోలకు పోజిచ్చింది.



సబలెంక

2X6

ఫైనల్లో సబలెంక, పెగులా

యూఎస్ ఓపెన్



పెగులా

న్యూయార్క్: డిఫెండింగ్ చాంపియన్ కొకొ గాఫ్, వరల్డ్ నెంబర్‌వన్ స్వియటెక్ లాంటి ఫేవరెట్లంతా విఫలమైన వేళ.. అర్యానా సబలెంక మాత్రం యూఎస్ ఓపెన్‌లో దూకుడైన ఆటతీరుతో దూసుకెళ్తోంది. ఈ బెలారస్ స్టార్ ఇక్కడ నిరుడు చేజారిన కిరీటాన్ని అందుకునేందుకు అడుగు దూరంలో నిలుస్తూ వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. శనివారం జరిగే తుది పోరులో లోకల్ స్టార్, ప్రపంచ ఆరో ర్యాంకర్ జెస్సికా పెగులాతో రెండో ర్యాంకరైన 26 ఏళ్ల సబలెంక అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో గతేడాది రన్నరప్ సబలెంక 6-3, 7-3 (2)తో అమెరికాకు చెందిన 13వ సీడ్ ఎమ్మా నవారోను ఓడించింది. గంటన్నరపాటు సాగిన పోరులో సబలెంక మ్యాచ్ ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించింది. గతరౌండ్లో డిఫెండింగ్ చాంప్ కొకొ గాఫ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించిన నవారో.. ఇక్కడ మాత్రం సబలెంక బలమైన సర్వీసులకు ఏ దశలోనూ బదులివ్వలేకపోయింది. 8 ఏస్‌లు సంధించిన సబలెంక ఏకంగా 34 విన్నర్లతో విరుచుకుపడింది. మరోవైపు నవారో ఒక ఏస్, 13 విన్నర్లకు పరిమితమైంది. మరో సెమీఫైనల్లో 30 ఏళ్ల పెగులా 1-6, 6-4, 6-2తో అన్‌సీడెడ్, గతేడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరింది. ముచోవా 6 ఏస్‌లు, 34 విన్నర్లను సంధించినా ఫలితం లేకుండా పోయింది. ఏకంగా 40 అనవసర తప్పిదాలకు పాల్పడి మూల్యం చెల్లించుకుంది.

సిరియా బోణీ



హైదరాబాద్: అన్ని రంగాల్లో ఆధిపత్యం చెలాయించిన సిరియా..ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో తమ తొలి విజయం అందుకుంది. ఇక్కడి గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో సిరియా 2-0తో మారిషస్‌ను చిత్తు చేసింది. మ్యాచ్ 32వ నిమిషంలో మారిషస్ డిఫెండర్ సిటోరా సెల్ఫ్ గోల్‌తో ప్రత్యర్థికి ఆధిక్యం లభించింది. 70వ నిమిషంలో మహ్మద్ సిరియా తరపున గోల్ చేశాడు. ఈ ఓటమితో మారిషస్ జట్టు టోర్నీ నుంచి నాకౌట్ అయింది. టోర్నమెంట్‌లో మూడో, చివరి మ్యాచ్‌లో భారత్, సిరియా తలపడనున్నాయి. సోమవారం ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే భారత్ కప్ విజేతగా నిలుస్తుంది.

పడిక్కళ్, శ్రేయాస్ అర్ధ శతకాలు

ఇండియా 'డి'కి భారీ ఆధిక్యం

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): దేవదత్ పడిక్కళ్ (56), శ్రేయాస్ అయ్యర్ (54), అర్ధ శతకాలు సాధించడంతో ఇండియా 'సి'తో ఇక్కడ జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'డి'కి 202 పరుగుల ఆధిక్యం లభించింది. ఇండియా 'డి' రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆఖరికి 206/8 స్కోరు చేసింది. మానవ్ సుతార్ ఐదు వికెట్లు తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ 91/4తో రెండోరోజు..మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'సి' 168 పరుగులకు ఆలౌటైంది.

సచిన్‌ను వెనక్కునెట్టిన ముషీర్

బెంగళూరు: ఇండియా 'బి' ఆటగాడు ముషీర్ ఖాన్ (181) దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో మూడో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన టీనేజర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఈక్రమంలో సచిన్ (159)ను ముషీర్ వెనక్కు నెట్టాడు. ఇండియా 'ఎ'తో మ్యాచ్‌లో ఓవర్‌నైట్ 202/7తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'బి' 321 రన్స్‌కు ఆలౌటైంది. సైనీ (56) జతగా 8వ వికెట్‌కు 205 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని ముషీర్ నెలకొల్పాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా 'ఎ' రెండోరోజు ఆఖరికి 134/2 స్కోరు చేసింది.

'రాజస్థాన్'కు రాహుల్ ద్రవిడ్

ముంబై: ఐపీఎల్‌లో తమ జట్టు ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్‌ను నియమించినట్టు రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) ఫ్రాంచైజీ యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది. గతంలో రాజస్థాన్‌కు కెప్టెన్‌గా, ఆ తర్వాత కోచ్‌గా వ్యవహరించిన ద్రవిడ్.. దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ అదే జట్టుకు మార్గనిర్దేశనం చేయనున్నాడు.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వినాయక చవితి శుభాకాంక్షలు

శనివారం | 7-9-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్ బుర్రలో 'బురద'!



తెలంగాణతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో బురద రాజకీయం పరాకాష్ఠకు చేరుకుంది. అబద్ధాలే పునాదులుగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రస్తుత వరదలపై కూడా అబద్ధాలను ప్రచారం చేస్తూ ఆనందిస్తున్నారు. ఆయనకు చెందిన రోత మీడియా తన కడుపు మంటను దాచుకోకుండా బురద రాజకీయాలకు తన వంతు సహాయం చేస్తోంది.

చంద్రబాబుకు పనీపాటా లేదు, అందుకే వరద ప్రాంతాల్లో తిరుగుతున్నారని జగన్ రెడ్డి భావిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు తనలా ఎంచక్కా హెలికాప్టర్‌లో ఒక రౌండ్ తిరిగి సరిపెట్టకుండా బురదలో తిరగడం ఏమిటి? అని జగన్‌కు అనిపిస్తుండవచ్చు. పరిపాలన చేయడం తనకు తప్ప మరెవరికీ చేతకాదని జగన్ నమ్ముతుండవచ్చు గానీ ప్రజలు అలా అనుకోవడం లేదు. అందుకే తాజా ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. నిజానికి చంద్రబాబు సరిగ్గా ప్లానింగ్ చేసి ఉంటే జగన్ రెడ్డికి రెండు మూడు సీట్లకు మించి వచ్చి ఉండేవి కావు.

వరదలొస్తే రాజధాని అమరావతి మునిగిపోతుందని అధికారంలో ఉన్నప్పుడు తాను చేసిన ప్రచారం నిజమని మళ్లీ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాజధాని మునిగిపోయి ఉంటే హైకోర్టు, సచివాలయం ఎలా పనిచేస్తున్నాయనే ఇంగితం కూడా లేకుండా రోత మీడియా కథనాలను వండి వార్చింది. తాము చెప్పే అబద్ధాలను ఎంతో కొంత మంది నమ్మకపోతారా అన్నది జగన్ అండ్ కో భావన.

బుడమేరు కట్టలు తెగడానికి ఇబ్రహీంపట్నం వద్ద 24 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మినీ హైడల్ ప్లాంట్ కారణం అని సరికొత్త ప్రచారానికి తెర లేపారు. జగన్ రోత మీడియాలో చేస్తున్న ప్రచారం నిజమని రుజువు చేస్తే ఆ ప్లాంట్‌ను మా సొంత ఖర్చుతో తొలగించడానికి సిద్ధంగా ఉన్నాం. మా ప్లాంట్ వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగిందని రుజువు చేస్తే దాన్ని జగన్ అండ్ కోకు ఇచ్చేస్తాం.

వరదల విషయంలో బురద రాజకీయం చేస్తున్న జగన్ రెడ్డికి వరద బాధితులకు విరాళం ఇవ్వడానికి మాత్రం మనసు రాదు. సొంత సొమ్ము ఇవ్వడానికి మనసు రానప్పుడు తాను ఏర్పాటు చేసిన కంపెనీలు లాభాల్లో ఉన్నాయి కదా? ఆ కంపెనీలైనా విరాళాలు ప్రకటించవచ్చు కదా? అంతటి విశాల హృదయం ఆయనకు ఎక్కడిది? ఇంతవరకూ ఆయన ఒక్కరికైనా రూపాయి సహాయం చేసిన సందర్భాన్ని చూశామా?

రాజ్యసభలో బిల్లులు ఆమోదం పొందడానికి బీజేపీకి నలుగురు సభ్యుల బలం అదనంగా కావాలి. ఈ కారణంగా వైసీపీకి చెందిన నలుగురిని చేర్చుకోవడానికి బీజేపీ స్కెచ్ వేస్తోంది. వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్ మినహా మిగతా వారందరూ బీజేపీ, తెలుగుదేశం పార్టీలలో ఏదో ఒక దానితో చేతులు కలుపుతారని ప్రచారం జరుగుతోంది.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' వినాయక చవితి శుభాకాంక్షలు.

సెలవు

వినాయక చవితి సందర్భంగా మా కార్యాలయాలకు శనివారం సెలవు. కావున ఆదివారం (8-9-2024) 'ఆంధ్రజ్యోతి' సంచిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం.
-మేనేజింగ్ డైరెక్టర్

బుడమేరులో రంగంలోకి సైన్యం

120 మంది మద్రాస్ బెటాలియన్ జవాన్ల రాక 10

నేటి ఉదయానికి గండి పూడ్చివేత

బండ్లు, ఇళ్లలో సామాన్ల రిపేరుపై ప్రత్యేక దృష్టి

9

ఇతర ప్రాంతాల నుంచి మెకానిక్‌లకు పిలుపు

బెజవాడలో యుద్ధ ప్రాతిపదికన సాగుతున్న పారిశుద్ధ్య చర్యలు



'శ్రీ వినాయక పూజా విధానం'
ప్రత్యేక అనుబంధం
నేటి దినపత్రికతో ఉచితంగా అందుకోండి
- మేనేజింగ్ డైరెక్టర్




హీరోగా ఎంట్రీ

టాలీవుడ్ అగ్రకథానాయకుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులకు శుభవార్త. ఆయన తనయుడు మోక్షజ్ఞ సినీ అరంగేట్రం ఖరారైంది. శుక్రవారం మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా ఈ విషయాన్ని ప్రకటించారు. 'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలకృష్ణ తనయ ఎం తేజస్విని నందమూరి సమర్పణలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మోక్షజ్ఞ స్టైలిష్ లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'మోక్షజ్ఞను పరిచయం చేయడం గొప్ప గౌరవం. అలాగే పెద్ద బాధ్యత కూడా. బాలకృష్ణ గారు కథపై, నాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. మన ఇతిహాసాల నుంచి స్ఫూర్తి పొందిన కథతో తెరకెక్కిస్తున్నాం. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌ను మరో స్థాయికి తీసుకెళుతుంది' అన్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ 'మోక్షజ్ఞ సినిమాను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. ఆయన అరంగేట్రానికి సరిపోయే కథతో అద్భుతమైన స్క్రిప్ట్‌తో ప్రశాంత్ వర్మ ముందుకు వచ్చారు. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తాం' అన్నారు. ప్రేక్షకులను అలరించేందుకు మోక్షజ్ఞ డాన్స్, ఫైట్స్‌లో కఠోర శిక్షణ పొందారు. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ సోషల్‌మీడియా ద్వారా మోక్షజ్ఞకు అభినందనలు తెలిపారు.

'గేయ కిరీటి' వడ్డేపల్లి కృష్ణ ఇకలేరు

- లలితగీతాల రచయితగా ఖ్యాతి
- సినిమా పాటలతోనూ పేరు
- ఉమ్మడి ఏపీ సెన్సార్ బోర్డు సభ్యుడిగా, నంది అవార్డు కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు
- ఆదివారం అంత్యక్రియలు

ప్రముఖ లలితగీతాల రచయిత, సినిమా పాటల కవి, 'గేయ కిరీటి' బిరుదాంకితుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ (76) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. వడ్డేపల్లి కృష్ణ స్వస్థలం సిరిసిల్ల. వెయ్యికి పైగా గేయాలు రాసిన వడ్డేపల్లిని వేములవాడ రాజరాజేశ్వరి ఆలయ నిర్వాహకులు 'గేయ కిరీటి' బిరుదుతో సత్కరించారు. నిరుపేద చేనేత కుటుంబంలో పుట్టిన ఆయన సినారె స్ఫూర్తితో విద్యార్థి దశలోనే గేయ రచన ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి 'లలిత గీతాల' మీద ఆయన చేసిన పీహెచ్‌డీ పరిశోధన అత్యంత ప్రామాణికమైనదిగా విమర్శకులు చెబుతారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన "పిల్ల జమిందార్" సినిమాలో 'నీచూపులోన విరజాజివాన...' పాటతో సినీగేయ రచయితగా ఆయన ప్రస్థానం ప్రారంభించారు. "పెద్దరికం" సినిమాలో 'ముద్దుల జానకి పెళ్లికి మబ్బుల పల్లకి తేవలెనే', "భైరవద్వీపం" - 'అంబా శాంభవి...', "పిలిస్తే పలుకుతా" - 'సమతా మమతల సాకారం... పిలిచిన పలికే ఓంకారం' తదితర గీతాలు అయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. వడ్డేపల్లి కలం నుంచి జాలువారిన దేశ భక్తి గీతాలెన్నో ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. మరికొన్ని 60 ఆడియో ఆల్బమ్స్‌గానూ వచ్చాయి. ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటాన్ని కళ్లకు కట్టే 'జయజయహే తెలంగాణ', 'ఆమ్రపాలి', 'రమణీయ రామప్ప' తదితర నలభైకు పైగా సంగీత, నృత్యరూపకాలను రచించారు.



'బలగం' సినిమా నటుడిగా...

వడ్డేపల్లి రాసిన గేయం పూణె బాలభారతి తెలుగు వాచకాల్లో పాఠ్యాంశంగా చేర్చారు. సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు, బతుకమ్మ, గోభాగ్యం తదితర అంశాలపై డాక్యుమెంటరీలు రూపొందించారు. 'లావణ్య విత్ లవ్ బాయ్స్', 'ఎక్కడికెళ్తుందో మనసు' సినిమాలకు, 'భక్త పోతన' వంటి టెలివిజన్ ధారావాహికలకు దర్శకత్వం వహించారు. 'బలగం' సినిమాలో నటించారు. తెలుగు సినీ రచయితల సంఘం త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా వారం కిందట వడ్డేపల్లి కృష్ణను జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఉమ్మడి ఏపీలో నంది అవార్డుల కమిటీ ఛైర్మన్‌గా, సెన్సార్ బోర్డు సభ్యుడిగా, అంతర్జాతీయ బాలల చిత్రోత్సవం, బాలల నంది నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఆదివారం మధ్యాహ్నం వడ్డేపల్లి కృష్ణ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన అల్లుడు పత్తిపాక ఈశ్వర్ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా



'హుషారు' చిత్రంతో అందరినీ అలరించిన నటుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా' శనివారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజస్ మీడియాతో మాట్లాడుతూ "హుషారు' తర్వాత చాలా కథలు విన్నాను. ఏదైనా కొత్త ఉంటే సినిమా చేద్దామనుకుంటున్న నాకు దర్శకుడు వివేక్ చెప్పిన పాయింట్ బాగా నచ్చింది. ఆ తర్వాత ఇద్దరం కలసి కథ తయారు చేశాం. స్క్రిప్ట్ బాగా వచ్చింది. చాలా మంది నిర్మాతలను కలసి కథ వినిపించాం. అందరూ బాగుందని అన్నారు కానీ నా మీద అంత బడ్జెట్ పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరకు మా నాన్న (కంచర్ల బాలభాను) ఈ కథ విన్నారు. ఆయనకు నచ్చడంతో సినిమా తీయడానికి ముందుకు వచ్చారు" అని చెప్పారు. 'తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ కథ ఉంటుంది. అయినా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. లాక్ డౌన్‌లో మూఢ నమ్మకాల గురించి వార్తలు ఎక్కువగా చదివాను. అలాంటి కొన్ని సంఘటనల చుట్టూ కథ అల్లాను. థ్రిల్లర్, కామెడీ జానర్‌లో వినోదభరితంగా ఉంటుంది.' అని చెప్పారు తేజస్. దర్శకత్వం చేయాలనే కోరిక ఉందనీ, అలాగే పాత్ర నచ్చితే స్పెషల్ రోల్స్ కూడా చేస్తానని తెలిపారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 7-9-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**

కోలుకోలేని వరద దెబ్బ

రెక్కల కష్టమంతా నీటిపాలు

చిరు వ్యాపారులు, కూలీలు, మధ్యస్థ కుటుంబాలకు తీరని నష్టం

బురద, వరదనీటిలో ఇంటి సామగ్రి, పరికరాలు

వారంగా మోకాలిలోతు నీటిలోనే

9

85% జిల్లాల్లో అసాధారణ విపత్తులు

ఐదు దశాబ్దాల్లో నాలుగు రెట్లు పెరిగిన తీవ్రత

45 శాతం జిల్లాల్లో కరువు నేలల్లో వరదలు 2

వరద ముంపు ప్రాంతాల్లో కరువుకాటకాలు

ఏపీ, తమిళనాడు, కర్ణాటకలో పెరుగుతున్న కరువు

వరద నుంచి కరువుకాటకాలకు మారిన జిల్లాల్లో సిక్కోలు, గుంటూరు, కర్నూలు, పాలమూరు, నల్గొండ

ఈపీఐ-గ్లోబల్, ఈఎస్ఆర్ఐ ఇండియా అధ్యయనం

అందరికీ సాయం

వరద బాధితులకు సరుకుల పంపిణీ షురూ

రేషన్, ఆధార్ లేకున్నా ఓకే

ప్రతి కుటుంబానికీ ఉచితంగా బియ్యం సహా 6 రకాలు అందజేత

1,100 వాహనాల్లో తరలింపు

బియ్యం, చక్కెర, కంది పప్పు, ఉల్లి, ఆలూ, పామాయిల్‌తో ప్రత్యేక కిట్లు

సంతృప్తి వ్యక్తంచేసిన చంద్రబాబు

నేడు మరింత ముమ్మరంగా పంపిణీ



గన్నవరం మండలం కేసరపల్లిలో వరద ముంపుతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎంపీ పురందేశ్వరి, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

మోదీ, బాబు అండగా ఉంటారు

రైతులు ఎవరూ అధైర్య పడొద్దు

అన్ని విధాలుగా సాయం చేస్తాం

ఎరువులు, విత్తనాలు అందజేస్తాం

వైసీపీ సర్కారు 'ఫసల్ బీమా'కు ప్రీమియం కట్టకపోవడంతో రైతులకు నష్టం: శివరాజ్ సింగ్

పగ.. మేరు

తగ్గి.. అంతలోనే పెరిగిన బుడమేరు

కడుక్కున్న ఇళ్లలోకి తిరిగి వరదనీరు

ఇళ్లను వదిలిపోతున్న బాధితులు

అత్యవసర మందులకు ఇబ్బంది

కొన్నిచోట్ల బీపీ, షుగర్ తదితర మాత్రలు దొరక్క అవస్థలు

సమగ్ర కథనాలు 8, 9, 10లో..

కొత్త విజయవాడను చూపిస్తా



హుద్‌హుద్‌లో విశాఖను తీర్చిదిద్దినట్టే వరద తాకని నగరంగా మారుస్తా

నష్టపోయిన వారిని నిలబెట్టడం పెద్ద సవాల్

కేంద్రం ఉదారంగా ఆదుకుంటుందని ఆశిస్తున్నా

వేగంగా సాయం పంపిణీకి ఏర్పాట్లు

కేంద్ర సాయంపై వస్తున్న వార్తలు వదంతులే

మేం ఇంకా నివేదికే పంపలేదు: చంద్రబాబు 9

అప్పులు చేస్తారు..

అంతం చూస్తారు

సైనేడ్‌తో చిటికెలో చంపేస్తారు! 3

మద్యంలో, కూల్‌డ్రింక్‌లో సైనేడ్ కలిపి తాగిస్తారు

గుట్టుచప్పుడు కాకుండా నలుగురి దారుణ హత్య

ఒంటిపై బంగారం, అప్పులు ఎగ్గొట్టేందుకే ఘాతుకం

మరో ముగ్గురినీ అంతం చేయడానికి విఫలయత్నం

త్రుటిలో తప్పించుకొని బతికిపోయిన ఆ ముగ్గురూ

తల్లీకూతుళ్లు సహా ముగ్గురు మహిళల ఘాతుకం

గుంటూరు జిల్లాలో అరెస్టు

పాస్‌పోర్టు ఐదేళ్లకు ఇప్పించండి

హైకోర్టులో జగన్ పిటిషన్

బెజవాడ ప్రజాప్రతినిధుల కోర్టు పరిధి దాటింది

ఎన్‌వోసీ జారీకి కఠిన షరతులు పెట్టింది 3

మాజీ సీఎం తరపు సీనియర్ న్యాయవాది వాదనలు

ఎల్లుండి విచారణ

మనం దేవుళ్లమో.. కాదో ప్రజలే నిర్ణయిస్తారు

» ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

పుణె, సెప్టెంబరు 6: మనం దేవుళ్లమో.. కాదో ప్రజలే నిర్ణయిస్తారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. శంకర్ దినకర్ కానే(భయ్యాజీ)1971లో మణిపూర్‌లో చేసిన సేవలను స్మరించుకుంటూ పుణెలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేవుళ్లమని మనమే ప్రకటించుకోకూడదని అన్నారు. కొందరు మెరుపులా ప్రకాశించాలని అనుకొంటారని, కాని అది నేలను తాకిన తర్వాత అక్కడ మునుపటి కంటే చీకటిగా మారుతుందని పేర్కొన్నారు. పనిమంతులు దీపంలా ఉండాలని, అవసరమైనప్పుడు వెలుగును పంచాలని సూచించారు. శంకర్ దినకర్ 1971 వరకు మణిపూర్‌లో బాలల విద్య కోసం పని చేశారు. మణిపూర్ విద్యార్థులను మహారాష్ట్ర తీసుకువచ్చి వారి చదువుకు తోడ్పడ్డారు. ప్రస్తుతం మణిపూర్‌లో ఘర్షణలతో నెలకొన్న పరిస్థితులు అత్యంత సవాలుగా మారాయని భగవత్ వివరించారు. అక్కడ నెలకొన్న ఘర్షణల్లో 200 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులుగా మారారు. ఇంతటి కఠిన పరిస్థితుల్లో కూడా ఆర్ఎస్ఎస్ వలంటీర్లు అక్కడే ఉండి పనిచేస్తున్నారని ఆయన చెప్పారు.

రూ.20 లంచం తీసుకున్న మాజీ పోలీసును అరెస్టు చేయండి

» బెయిల్ తీసుకొని 25 ఏళ్లుగా పరార్

» 34 ఏళ్ల నాటి ఘటనలో విజిలెన్స్ కోర్టు తాజా ఆదేశం

పట్నా, సెప్టెంబరు 6: కూరగాయలు అమ్ముకొనే మహిళ నుంచి 34 ఏళ్ల క్రితం రూ.20 లంచం తీసుకున్న మాజీ పోలీసు కానిస్టేబుల్‌ను అరెస్టు చేయాలని బిహార్‌లోని స్పెషల్ విజిలెన్స్ కోర్టు గురువారం డీజీపీని ఆదేశించింది. ఈ కేసులో ఆయనకు ఇచ్చిన బెయిల్ రద్దయినా 25 ఏళ్లుగా పరారీలో ఉంటూ కోర్టుకు హాజరు కాకపోవడంతో మళ్లీ అరెస్టు చేయాలంటూ ఆదేశాలు ఇచ్చింది. సురేష్ ప్రసాద్ సింగ్ అనే కానిస్టేబుల్ గతంలో సహర్స రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వర్తించేవాడు. 1990 మే ఆరో తేదీన ఓ మహిళ నుంచి రూ.20 లంచం తీసుకున్నాడు. అతనిపై కేసు నమోదు కాగా, అనంతరం బెయిల్ మంజూరయింది. అయితే 1999 నుంచి అతను పరారీలో ఉండడంతో బెయిల్ రద్దయింది. ఆస్తులను జప్తు చేస్తున్నట్టు నోటీసు ఇచ్చినా స్పందించలేదు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేయగా సర్వీసు రికార్డులో నమోదుకు తప్పుడు చిరునామా ఇచ్చినట్టు తేలింది. పోలీసుల అవినీతిపై పెండింగ్ కేసులను ఇటీవల పరిశీలించిన స్పెషల్ విజిలెన్స్ జడ్జి సుదేశ్ శ్రీవాస్తవ ఈ కేసును గుర్తించారు. పరారీలో ఉన్న మాజీ కానిస్టేబుల్‌ను అరెస్టు చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు.

ఇండియా కూటమిలో విభేదాలు!

» కాంగ్రెస్‌లో చేరిన ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యే గౌతం

ఢిల్లీ, సెప్టెంబరు 6: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ఓ పక్క చర్చలు జరుగుతుండగానే ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తున్నారు. తాజాగా ఢిల్లీ సీమాపురి నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ క్యాబినెట్ మంత్రి, దళిత నేత రాజేంద్ర పాల్ గౌతం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, దేవేందర్ యాదవ్, పవన్ ఖేరా సమక్షంలో గౌతం హస్తం పార్టీలో చేరారు. వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో గౌతం చేరికకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆప్ నుంచి వలసలు పార్టీకి లాభించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు దళిత హక్కుల కోసం గట్టిగా పోరాడే నేతగా పేరున్న గౌతం పార్టీని వీడటం పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్లేనని ఆమ్ ఆద్మీ నేతలంటున్నారు.

'ఏఐ 2024 అత్యంత ప్రభావశీలుర' జాబితాలో కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్

» టైమ్ మేగజీన్ ప్రశంస

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ టైమ్ మేగజీన్ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'ఏఐ 2024లో అత్యంత ప్రభావశీల ప్రజలు' జాబితాలో చోటు దక్కించుకున్నారు. 100 మందితో రూపొందించిన ఈ జాబితాలో ఆయనతో పాటు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ తదితరులు కూడా ఉన్నారు. గురువారం విడుదల చేసిన ఈ జాబితాలో 15 మంది భారతీయులు/భారత సంతతి వ్యక్తులు ఉండడం విశేషం. వీరిలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల కూడా ఉన్నారు. కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నాయకత్వంలో సెమీకండక్టర్ తయారీ రంగంలో భారత్ టాప్ 5 దేశాల్లో ఒకటిగా నిలవనుందని మేగజీన్ కొనియాడింది. ఆధునిక ఏఐ సిస్టమ్‌లలో రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్లదే కీలక పాత్ర అని పేర్కొంది. అయితే ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో వైష్ణవ్ పలు సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది.

విజయవంతంగా అగ్ని-4 క్షిపణి ప్రయోగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) రూపొందించిన అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని శుక్రవారం ఒడిశాలోని చాందీపూర్ క్షేత్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. న్యూక్లియర్ కమాండ్ అథారిటీ పరిధిలోని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. 20 మీటర్ల పొడవు ఉన్న ఈ క్షిపణి 4,000 కి.మీ.దూరంలోని లక్ష్యాన్ని చేధించగలుగుతుంది. 1,000 కిలోల మందుగుండు సామగ్రిని తీసుకెళ్తుంది. నేల మీద తిరగగలిగే లాంచర్ ద్వారా దీన్ని ప్రయోగించవచ్చు. 2012లో తొలిసారిగా అగ్ని-4ను ప్రయోగించినప్పుడు అది 20 నిమిషాల్లో 3,000 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించింది. దాన్ని వృద్ధి చేసి ప్రస్తుతం ప్రయోగించారు. సాంకేతిక, నిర్వహణపర లక్ష్యాలను అందుకొందని అధికారులు తెలిపారు.



85% జిల్లాల్లో అసాధారణ విపత్తులు

ఐదు దశాబ్దాల్లో 4 రెట్లు పెరిగిన తీవ్రత.. 45% జిల్లాల్లో కరువు నేలల్లో వరదలు

» ఈపీఐ-గ్లోబల్, ఈఎస్ఆర్ఐ ఇండియా అధ్యయనం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: రోజులతరబడి ముసురేసి, వాగుల్ని, వంకల్ని ఏకం చేసి జనావాసాల్ని ముంచేసే వర్షాలు.. హో..రుమంటూ తీరాన్ని తాకి బీభత్సం సృష్టించే ప్రళయ భీకర తుపాన్లు.. మండుటెండలను మించి చుర్రున కాల్చేసే ఎండలు.. తీవ్రమైన కరువు కాటకాలు! ...దేశంలోని 85 శాతానికి పైగా జిల్లాలు ఇటీవలికాలంలో ఇలాంటి అసాధారణ ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటున్నాయని ఐపీఈ గ్లోబల్, ఈఎస్ఆర్ఐ-ఇండియా తాజా అధ్యయనం వెల్లడించింది! ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు నానాటికీ పెరుగుతున్నట్టు తెలిపింది. బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, అసోం రాష్ట్రాల్లోని 60 శాతానికిపైగా జిల్లాలు కనీసం ఏడాదికి ఒక్క అసాధారణ ప్రకృతి ఉత్పాతాన్నైనా చవిచూస్తున్నట్టు వెల్లడైంది. సాధారణంగా ప్రకృతి విపత్తులంటేనే భయంకరంగా ఉంటాయి. కానీ, పర్యావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఆ విపత్తులు ఇలా అసాధారణ స్థాయిలో ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని ఆ అధ్యయనం పేర్కొంది. గడిచిన ఐదు దశాబ్దాల్లో ఇలాంటి అసాధారణ ప్రకృతి విపత్తుల తరచుదనం(ఫ్రీక్వెన్సీ), తీవ్రత (ఇంటెన్సిటీ), అనూహ్యత(అన్‌ప్రెడిక్టబిలిటీ) నాలుగు రెట్లు పెరిగాయని వెల్లడించింది. గడిచిన దశాబ్దకాలంలో అయితే.. ఏకంగా ఐదురెట్ల పెరుగుదల ఉన్నట్టు తెలిపింది. అంతేకాదు.. 45% జిల్లాల్లో కరువునేలలను వరదలు ముంచేస్తుండగా, వరదలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో కరువుకాటకాలు విలయతాండవం చేస్తున్నాయని ఈ అధ్యయన నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. 1973 నుంచి 2023 నడుమ.. ఐదు దశాబ్దాల కాలంలో నమోదైన అసాధారణ ప్రకృతి విపత్తులను ఈ స్టడీలో భాగంగా విశ్లేషించారు. 'లీవరేజింగ్ జీఐఎస్ టెక్నాలజీ టు మిటిగేట్ క్లైమేట్ రిస్క్స్' పేరిట రూపొందించిన ఈ నివేదికను.. ఐపీఈ గ్లోబల్, ఈఎస్ఆర్ఐ ఇండియా కలిసి ఢిల్లీలో నిర్వహిస్తున్న క్లైమేట్ టెక్నాలజీ సదస్సు'లో ఆవిష్కరించారు. ఆ నివేదిక ప్రకారం..

- పెరిగిన కర్బన ఉద్గారాలు, ఒక పద్ధతి లేని ల్యాండ్‌స్కేప్ ప్లానింగ్, ప్రకృతిలోని మిగతా జీవులను ఏమాత్రం పట్టించుకోకుండా మనుషులే ప్రధానంగా భావించి చేపట్టే కార్యకలాపాలే ఈ అసాధారణ ప్రకృతి విపత్తులకు కారణం.
- దేశంలోని తూర్పు ప్రాంత జిల్లాలు అసాధారణ వరదల బారిన పడే ముప్పు ఎక్కువగా ఉంది.
- వరదప్రాంతాల నుంచి కరువు ప్రాంతాలుగా మారిన జిల్లాల జాబితాలో.. తెలుగు రాష్ట్రాలకు చెందిన మహబూబ్‌నగర్, నల్లగొండ, శ్రీకాకుళం, గుంటూరు, కర్నూలు ఉన్నాయి.

ఏం చేయాలి?

అసాధారణ ప్రకృతి విపత్తుల సంఖ్య పెరగడాన్ని నిరోధించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి కూడా నివేదిక పేర్కొంది. ఇందుకోసం.. నేషనల్ రిసైలెన్స్ ప్రోగ్రామ్ కింద.. క్లైమేట్ రిస్క్ అబ్జర్వేటరీ'ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. దాని ద్వారా భవిష్యత్తు ముప్పులను ముందే అంచనా వేసి, ఆ మేరకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, నగర స్థాయుల్లో నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. అలాగే.. 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్లైమేట్ ఫండ్ (ఐసీఎఫ్)'నొకదాన్ని ఏర్పాటు చేసి పర్యావరణమార్పులకు ఎక్కువగా ప్రభావితం కాని కీలక మౌలిక వసతులను కల్పించాలని పేర్కొంది. కాగా.. మనదేశంలో తలసరి కర్బన ఉద్గారాల విడుదల అంతర్జాతీయ సగటుతో పోలిస్తే మూడో వంతు. అమెరికా చైనా వంటి దేశాలతో పోలిస్తే పిసరంతే! అయినా, పర్యావరణ మార్పుల ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నది మనదేశమేనని ఐపీఈ గ్లోబల్ వ్యవస్థాపకుడు, ఎండీ అశ్వజిత్ సింగ్ ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికే మానవాళిని పట్టిపీడిస్తున్న సమస్యలను పర్యావరణమార్పు మరింత పెంచుతుందని ఆయన హెచ్చరించారు. పర్యావరణ మార్పును ఎదుర్కొందుకు భారతదేశం ఇప్పటికీ 'మిటిగేషన్' విధానాన్నే అనుసరిస్తోందని.. దానికి బదులు 'అడాప్టేషన్' విధానాన్ని ఎంచుకోవాలని సూచించారు ('మిటిగేషన్' అంటే.. కర్బన ఉద్గారాలను తగ్గించుకోవడం వంటివి. అడాప్టేషన్ అంటే.. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా నడుచుకోవడం. అంటే.. మొక్కలు నాటడం, చెట్లు నరకకుండా ఉండం, ఏసీల వాడకం అవసరం లేకుండా సహజంగానే ఇళ్లు, కార్యాలయాలను చల్లగా ఉంచే విధానాల్లో నిర్మాణాలు చేపట్టడం వంటివి. కేరళలో ఇటీవల కొండచరియలు విరిగిపడ్డ ఘటన, గుజరాత్‌లో వరదలు, క్యుములోనింబస్ మేఘాలు గర్జించి.. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా అతి తక్కువ వ్యవధిలో భారీ వర్షాలు కురవడం వంటి ఘటనలు పర్యావరణమార్పు ప్రభావమేనని ఐపీఈ-గ్లోబల్‌కు చెందిన అవినాశ్ మొహంతీ పేర్కొన్నారు. 2036 నాటికి 147 కోట్ల మంది భారతీయులు ఈ అసాధారణ ప్రకృతివిపత్తుల బారిన పడతారని తమ విశ్లేషణలో వెల్లడైనట్టు తెలిపారు.

లోకం తీరు



రూ.2వేలలోపు పేమెంట్స్‌కూ జీఎస్టీ?

» అగ్రిగేటర్ల ద్వారా జరిపే చెల్లింపులకు వర్తింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు రూ.2వేలలోపు లావాదేవీలపై జీఎస్టీ విధించమని చెప్పిన మోదీ సర్కారు ఇప్పుడు ఆ భారం మోపేలా ఉంది. రేజర్‌పే, పైన్‌లాబ్స్ వంటి పేమెంట్ అగ్రిగేటర్ల ద్వారా.. ప్రజలు జరిపే చెల్లింపులకు కూడా వస్తుసేవల పన్ను (జీఎస్టీ)ను విధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు వీటి ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డులతో జరిపే లావాదేవీల్లో రూ.2వేలకు పైబడిన వాటిపైనే జీఎస్టీ వసూలు చేస్తున్నారు. రూ.2వేలలోపు చెల్లింపులపైనా 18 శాతం జీఎస్టీ విధించే ప్రతిపాదనను జీఎస్టీ మండలి పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. సోమవారం (9వ తేదీన) ఢిల్లీలో జరగనున్న జీఎస్టీ సమావేశంలో దీనిపై చర్చించన్నారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు 2017 నుంచి రూ.2వేలలోపు చెల్లింపులపై పేమెంట్ అగ్రిగేటర్ల (పీఏ)కు జీఎస్టీ మినహాయింపు ఇస్తున్నారు. దీనివల్ల ప్రజలపై భారం పడటం లేదు. అయితే ఈ పేమెంట్ అగ్రిగేటర్లు బ్యాంకింగ్ కంపెనీలు, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు లేదా ఎన్‌బీఎఫ్‌సీల కిందకు రారని, ఈ అగ్రిగేటర్లు ఇంటర్‌మీడియటరీలుగా వ్యవహరిస్తున్నట్టు చట్టం చెబుతోంది. కాబట్టి వీరి సర్వీసులన్నిటికీ జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని చట్టం పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో రూ.2వేలలోపు అగ్రిగేటర్ల ద్వారా జరిపే చెల్లింపులపై జీఎస్టీ విధించాలని మండలి నామినేట్ చేసిన ఫిట్‌మెంట్ కమిటీ సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. జీఎస్టీ మండలి సందర్భంగా ఈ ప్రతిపాదనపై ఓ నిర్ణయం తీసుకోనుంది. రూ.2వేలలోపు చెల్లింపులపై జీఎస్టీ విధిస్తే ఆ భారం పీఏ లైసెన్స్‌లు ఉన్న పైన్‌లాబ్స్, రేజర్‌పే, పేయూ, ఇన్ఫీబీమ్ తదితర కంపెనీలపై పడుతుంది. ఒక్కో లావాదేవీపై ఈ పేమెంట్ అగ్రిగేటర్లు 0.5 శాతం నుంచి 2 శాతం పేమెంట్ గేట్‌వే ఫీజును వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అదనంగా పన్ను విధిస్తే అది కస్టమరుపైనే పడుతుంది.

డబ్బుపై కాంక్ష లేదమ్మా.. నా పేరు పక్కన డిగ్రీలుండాలి

» నా బిడ్డ నాతో ఎప్పుడూ ఇవే చెప్పేది

» జూనియర్ వైద్యురాలి తల్లి ఆవేదన

కోల్‌కతా, సెప్టెంబరు 6: తమ కూతురు దారుణ హత్యాచార ఘటన మిగిల్చిన విషాదం నుంచి జూనియర్ వైద్యురాలి తల్లిదండ్రులు ఇంకా తేరుకోవడం లేదు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హతురాలి తల్లి విడుదల చేసిన ఓ బహిరంగ లేఖ మానవతావాదులను కన్నీరు పెట్టిస్తోంది. తమ కుమార్తెకు డాక్టర్ కావాలనే కోరిక బలంగా ఉండేదని చెబుతూ.. 'అమ్మా.. నాకు డబ్బు మీద మోజు లేదు.. నా పేరు పక్కన వైద్యురాలిగా డిగ్రీలు ఉండాలి.. నేను ఎప్పుడూ రోగులకు వైద్యసేవలు చేస్తూ ఉండాలి' అని తనతో అనేదని ఆ తల్లి లేఖలో పేర్కొంది. ఆమె కన్న ఈ కలలన్నింటినీ చిదిమేశారని ఆవేదన వ్యక్తింది. చిన్నప్పటి నుంచి తమ కూతురు డాక్టర్ కావాలని కలలు కన్నదని.. ఆ దిశగా ఆమెను ఉపాధ్యాయులు వెన్నుతట్టి ప్రోత్సహించడంతోనే తన స్వప్నం నెరవేరిందని.. ఇందుకు ఆ టీచర్లందరికీ ధన్యావాదాలు తెలుపుకొంటున్నానని పేర్కొంది. ఆర్జీకర్ ఆస్పత్రిలోని ఘటనాస్థలిలో ఆధారాలను చెరిపేసేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆమె ఇప్పటికే ఆరోపించిన సంగతి తెలిసిందే. కాగా ఆర్జీకర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలకు సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ నివాసాలపై ఈడీ శుక్రవారం దాడులు చేసింది. ఘోష్ సహచరుల ఇళ్లలోనూ సోదాలు జరిగాయి. ఘోష్‌కు అత్యంత సన్నిహితుడు, తనకు తాను ఘోష్‌కు పీఏగా చెప్పుకొనే ఆస్పత్రి డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రసూన్ ఛటోపాధ్యాయ ఈడీ అదుపులోకి తీసుకుంది.

కాంగ్రెస్‌లోకి ఫొగట్, పునియా

» ఖర్గేతో భేటీ తర్వాత వేణుగోపాల్ సమక్షంలో పార్టీలో చేరిన రెజ్లర్లు


కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో ఫొగట్, బజరంగ్ పునియా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: రెజ్లర్లు వినేశ్ ఫొగట్, బజరంగ్ పునియా కాంగ్రెస్‌లో చేరారు. వీరిద్దరూ కాంగ్రెస్‌లో చేరతారంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల కిందట ఇద్దరూ వెళ్లి రాహుల్ గాంధీని కూడా కలిశారు. కొద్ది రోజుల్లో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఫొగట్, పునియా శుక్రవారం కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. తొలుత వీరిద్దరూ ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి, ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ హరియాణా ఇన్‌చార్జి దీపక్ బబారియా సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. అనంతరం విలేకరులతో వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఫొగట్, పునియాలు రాహుల్‌ను కలిసినందుకు రైల్వే అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారని చెప్పారు. రాజకీయ నేతలను కలవడం ద్వారా సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతను కలవడం నేరమా? అని ప్రశ్నించారు. కాగా, శుక్రవారం ఫొగట్ రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఫొగట్ మాట్లాడుతూ.. రెజ్లింగ్ క్రీడాకారిణిగా తనకు అండగా నిలిచిన దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని.. వారి ఆకాంక్షలకు అనుగుణంగానే తాను ఆడినట్లు భావిస్తున్నానని చెప్పారు. తాము క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం గర్వంగా ఉందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రెజ్లర్ వినేశ్ ఫొగట్ హరియాణాలోని జులానా నుంచి అసెంబ్లీకి పోటీ చేయనున్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ తొలి జాబితాలో ఆమె పేరు ఉంది. మరో రెజ్లర్ బజరంగ్ పూనియాను అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు.

భారత్ నుంచి రహస్యంగా ఎలక్ట్రానిక్స్ కొనుగోళ్లు!

» ఉక్రెయిన్‌పై యుద్ధంలో పైచేయికి రష్యా వ్యూహం

» పశ్చిమ దేశాలకు తెలియకుండా అమలు.. కథనం ఫైనాన్షియల్ టైమ్స్

లండన్, సెప్టెంబరు 6: ఉక్రెయిన్‌పై యుద్ధంలో పైచేయి సాధించటానికి రష్యా.. భారత్ నుంచి ఎలక్ట్రానిక్స్ తదితర కీలక సామగ్రిని, టెక్నాలజీలను రహస్యంగా కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడైంది. పశ్చిమ దేశాలకు తెలియని మార్గాల ద్వారా వీటి సేకరణ జరుగుతున్నట్లు తెలిసింది. బ్రిటన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక దీనికి సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం.. 2022 అక్టోబరులో రష్యా పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వశాఖ దాదాపు రూ.8,200 కోట్ల (ఆ సమయంలో వంద కోట్ల డాలర్లకు సమానం) మేర ఖర్చు చేసి భారత్ నుంచి కీలకమైన ఎలక్ట్రానిక్స్‌ను కొనాలని ప్రణాళిక రచించింది. భారత్‌కు చమురు విక్రయాల ద్వారా రష్యా బ్యాంకుల్లో నగదు రూపంలో పోగుపడిన రూపాయలను ఈ విధంగా ఖర్చు చేయవచ్చని రష్యా ప్రభుత్వం భావించింది. రష్యా-భారత్ సంయుక్తంగా ఉత్పత్తి చేసి అభివృద్ధి పరిచే ఎలక్ట్రానిక్స్ సంస్థలకు పెట్టుబడులను భారీ ఎత్తున తరలించాలని కూడా నిర్ణయించింది. ఈ మేరకు కొన్ని లీకైన ఉత్తర ప్రత్యుత్తరాలను ఫైనాన్షియల్ టైమ్స్ ప్రస్తావించింది. కొన్ని రకాల ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, యంత్రాలకు సంబంధించి 2022 సంవత్సరం మధ్యలో భారత్ నుంచి రష్యా పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరిపినట్లుగా ఆధారాలున్నాయని తెలిపింది. ఇన్నోవియో వెంచర్స్ అనే భారత కంపెనీ 49 లక్షల డాలర్ల విలువైన డ్రోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను రష్యాకు సరఫరా చేసిందని, కిర్గిస్థాన్‌కు 6 లక్షల డాలర్ల విలువైన సామగ్రిని పంపిందని వెల్లడించింది. 5.68 లక్షల డాలర్ల విలువైన రేడియో ఎలక్ట్రానిక్ సిస్టమ్స్‌ను రష్యా కంపెనీ టెస్ట్‌కాంప్లెక్ట్ భారత్ నుంచి దిగుమతి చేసుకుందని, రష్యా మిలిటరీ సామగ్రి సేకరణలో ఈ కంపెనీ ప్రధాన పాత్ర పోషిస్తున్నదని పేర్కొంది. సదరు కంపెనీపై అమెరికా, ఈయూ ఆంక్షలు ఉన్న విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో గుర్తు చేసింది.


విశాఖ విమానాశ్రయంలో డిజి యాత్ర సేవలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, బండారు సత్యనారాయణమూర్తి, అధికారులు

డిజి యాత్రతో విమానయానం సులువు

» మరో 9 విమానాశ్రయాల్లో డిజి యాత్ర సేవలు ప్రారంభం

» కేంద్ర పౌర విమానయానశాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు

గోపాలపట్నం (విశాఖపట్నం), భోగాపురం, సెప్టెంబరు 6: ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి పౌర విమానయాన శాఖ నిరంతరం కృషి చేస్తున్నదని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. దేశంలోని మరో తొమ్మిది విమానాశ్రయాల్లో 'డిజి యాత్ర' సేవలను శుక్రవారం ఆయన విశాఖ విమానాశ్రయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమానయానం సులభతరం చేసుకోవడానికి డిజి యాత్ర సేవలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 24 విమానాశ్రయాల్లో డిజి యాత్ర సేవలు అందుబాటులోకొచ్చినట్టు తెలిపారు. ఈ ఏడాది అక్టోబరులో ప్రకాశం బ్యారేజీ వద్ద సీ ప్లేన్ ఆపరేషన్‌కు సంబంధించి డెమో నిర్వహిస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా హెలీపోర్టులను కూడా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. అక్టోబరు 27 నుంచి విశాఖ-విజయవాడ మధ్య విమాన సర్వీస్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. విశాఖ విమానాశ్రయం నుంచి కార్గో విమాన సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే పి.గణబాబు చేసిన వినతిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ ఎం.సురేశ్‌ను ఆదేశించినట్టు చెప్పారు.కాగా, విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచంలోనే అత్యున్నతంగా తీర్చిదిద్దుతామని మంత్రి చెప్పారు. శుక్రవారం ఆయన విమానాశ్రయ పనులను పరిశీలించారు. 2026 జూన్ నాటికే విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి 40శాతం పనులు పూర్తయ్యాయన్నారు.

పగ..మేరు

నిన్న తేలి.. నేడు మునిగి..!

» తగ్గి.. అంతలోనే పెరిగిన బుడమేరు

» కడుక్కున్న ఇళ్లలోకి తిరిగి వరదనీరు

» ఇళ్లను వదిలిపోతున్న బాధితులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)



వరద ముంపు నుంచి బయటపడిన ప్రకాశ్‌నగర్.. మళ్లీ వర్షాలు కురవడంతో నీరు వచ్చిన దృశ్యం

బుడమేరుకు బెజవాడ దుఃఖదాయిని అని పేరు! ఇప్పుడు ఈ వాగును విజయవాడ శివారు ప్రాంతాల వారు పగమేరు అని కూడా పిలుస్తున్నారు! వరద తగ్గినట్టే తగ్గి.. ఇళ్లు బాగు చేసుకునేలోపే మళ్లీ బుడమేరు వారితో కన్నీరు పెట్టించింది. దీంతో ఇక ఉండలేం అంటూ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు, సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు. మూడో గండి పూడ్చే పని పూర్తి కాకపోవడంతో బుడమేరుకు వరద హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. గురువారం ఇళ్లలోకి వచ్చిన నీరు తొలగిపోవడంతో కింది అంతస్తుల్లో ఉన్నవారు గదులు శుభ్రం చేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ వరద చేరడంతో తల్లడిల్లిపోతున్నారు. వరద అడుగు మేర పెరిగినట్టు చెబుతున్నారు. అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్టు సెంటర్‌లో గురువారం రహదారి కనిపించింది. అలాంటిది శుక్రవారం ఈ రోడ్డుపైకి నీరు వచ్చింది. బుడమేరు వంతెన పిల్లర్ల దిగువ నుంచి ప్రవహించిన నీరు ఇప్పుడు వంతెన శ్లాబ్‌ను తాకుతూ ప్రవహిస్తోంది. తగ్గిందనుకున్న నీరు పెరగడంతో ఇక ఈ ముంపులో ఉండలేమనుకుని ఇళ్లలో ఎక్కడి వస్తువులు అక్కడ వదిలేసి బయటకు వచ్చేస్తున్నారు. బస్సు పట్టుకుని బంధువుల ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఉదాహరణకు ప్రవీణ్.. సొంతూరు కర్ణాటక రాష్ట్రం. కొన్నాళ్ల క్రితం ఉపాధి కోసం విజయవాడ వచ్చాడు. బేకరీ పెట్టుకుని స్థిరపడ్డాడు. ముంపు కారణంగా ఆయన కుటుంబం ఇప్పటివరకు అపార్టుమెంట్ పై అంతస్తులో తలదాచుకున్నారు. వరద నీరు తగ్గిందని ఇంటిని నిన్నటినుంచి శుభ్రం చేసుకుంటున్నారు. మళ్లీ వరద నీరు పెరిగి, ఇంట్లోకి వచ్చింది. ఇక ఇక్కడ ఉండలేమని నిర్ణయించుకున్న ప్రవీణ కుటుంబం సామాగ్రి వదిలేసి బ్యాగ్‌ల్లో బట్టలు సర్దుకుని సొంత రాష్ట్రానికి వెళ్లిపోయింది. షేక్ బాబుకు 60 సంవత్సరాలు. మాటలు రావు. పైగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయన ఉన్న ప్రాంతం నీటిలో ఉంది. రెండు రోజుల క్రితమే వైద్యులకు చూపించారు. బోటులో తీసుకొచ్చి డాబా కొట్టు సెంటర్‌లో దింపడానికి ఇద్దరు, ముగ్గురు సహాయకులు ఉండాలి. మళ్లీ అక్కడి నుంచి ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి. దీంతో ఆ కుటుంబం తాము ఉంటున్న ఇంటిని వదిలేసి సత్యనారాయణపురంలోని బంధువుల ఇంటికి చేరుకుంది.

మందుల కోసం తంటాలు

డాబాకొట్టు సెంటర్, ఆంధ్రప్రభకాలనీ, గంగాలమ్మ ఆలయం, పైపుల రోడ్డు, నున్న, రాజీవ్ నగర్, వాంబేకాలనీ ప్రాంతాల్లో వృద్ధులు, పక్షవాత రోగులు, బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారు. సమయానికి ఆహారం తీసుకోవడంతోపాటు క్రమంతప్పకుండా మందులు వేసుకోవాల్సి ఉంటుంది. వారికి ఈ మందులు తెప్పించుకోవడానికి కుటుంబ సభ్యులు నానాతంటాలు పడుతున్నారు. అజిత్‌సింగ్ నగర్ నుంచి నున్న, కండ్రిగ ప్రాంతాల్లో షాపులు తెరిచే పరిస్థితి లేదు. దీంతో ఆయా కుటుంబాలు వరద ప్రాంతాన్ని వీడి సొంతూళ్లకు వెళ్లిపోతున్నారు.

బీపీ, షుగర్ మాత్రలు అందించాలి

"నా భర్తకు బీపీ, షుగర్ ఉన్నాయి. ఇంట్లో ఉన్న ఇన్సులిన్, మందులు అయిపోయాయి. ఈ మందులు ఇంటికి తెచ్చి ఇచ్చే పరిస్థితి లేదు. మా ఇళ్ల వద్దకు వస్తున్న మెడికల్ టీం జ్వరం, జబులకు సంబంధించిన మందులు మాత్రమే ఇస్తోంది. ఈ మందులు వేసుకోకపోవడంతో బీపీ, షుగర్ లెవల్స్ పెరుగుతున్నాయి. మాకు తెలిసిన వాళ్లు నగరంలో ఉంటే వారికి ఫోన్ చేసి ఈ మందులను తెప్పించుకున్నాను. వాటిని తీసుకోవడానికి 73వ నంబరు బ్లాక్ నుంచి (అజిత్‌సింగ్ నగర్) డాబా కొట్టు సెంటర్ వరకు నీళ్లలో ఈదుకుంటూ పోవాల్సి వచ్చింది. బీపీ, షుగర్ మాత్రలను ఇంటికి తెచ్చి ఇచ్చే ఏర్పాటు ఉంటే బాగుంటుంది"

- కోటేశ్వరి, అజిత్‌సింగ్ నగర్



విశాఖలో మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో ఎంపీ ఎం.శ్రీభరత్, మెడికవర్ ఆస్పత్రి ఇండియన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.అనిల్‌కృష్ణ

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

» మెడికవర్ కేన్సర్ ఆస్పత్రి ప్రారంభంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం (ఆరిలోవ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. నగర పరిధిలోని ఆరిలోవ హెల్త్ సిటీలో 100 పడకలతో నిర్మించిన మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... పదేళ్లలో నాలుగు రాష్ట్రాల్లో 23 ఆస్పత్రులు ఏర్పాటు చేయడంతోపాటు 1,200 మంది వైద్యులు, 13 వేల మంది వైద్య సిబ్బందితో రోగులకు అత్యున్నత వైద్య సేవలందించడం గొప్ప విషయమన్నారు. గతంతో పోలిస్తే విశాఖలో కేన్సర్ వ్యాధికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మెడికవర్ ఆస్పత్రి ఇండియన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.అనిల్‌కృష్ణ, డైరెక్టర్లు ఎ.శరత్‌రెడ్డి, పి.హరికృష్ణ, డాక్టర్ కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అవివేకంతోనే జగన్ అర్థంపర్థం లేని అరోపణలు: మంత్రి ఫరూక్

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అవివేకంతో జగన్ అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ విమర్శించారు. విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఐదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి అరాచక పాలన సాగించిన జగన్.. విపత్తు సమయంలో కూడా తనలోని సైకోతత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. వైసీపీ నాయకులు బురదజల్లేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారు. బుడమేరు ఉగ్రరూపంతో ముంపునకు గురై తీవ్ర నష్టాన్ని చవిచూసిన బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుంది. ముంపు ప్రాంతాల్లో ఉన్న మసీదులకు కలిగిన వివిధ నష్టాలను వివరంగా అంచనా వేసి నివేదిక ఇవ్వాలని వక్ఫ్ బోర్డు సీఈవోను ఆదేశించాను. నివేదికను సీఎం దృష్టికి తీసుకెళ్తాం. తదుపరి చర్యలను మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా తీసుకుంటాం' అని మంత్రి తెలిపారు.

'పుంగనూరు' కేసుల్లో.. ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి పిటిషన్లు
- విచారణ 11వ తేదీకి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు శుక్రవారం విచారణకు వచ్చాయి. కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

మట్టి వినాయకుడిని పూజించాలి

- పర్యావరణ హితంగా చవితి: జనసేన వినతి

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండగను పర్యావరణ హితంగా చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రజలను కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేస్తున్న విగ్రహాలు కాలుష్యానికి కారణమవుతున్నాయని, అందుకే మట్టి గణపతిని పూజించాలని పవన్ పిలుపునిచ్చినట్లు గుర్తుచేశారు. కాగా, రెండు నెలల క్రితం పిఠాపురంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చినవారికి మట్టి విగ్రహాల తయారీలో శిక్షణకు సంబంధించి పైలెట్ ప్రాజెక్టును మొదలుపెట్టారు.

టెన్త్ తప్పిన విద్యార్థులకు పాత సిలబస్‌తోనే పరీక్షలు

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు స్పష్టతనిచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో సిలబస్ మారిన నేపథ్యంలో గతంలో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు, ఫెయిలైనవారికి పాత సిలబస్ ప్రకారమే పరీక్షలు ఉంటాయని తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కొత్త సిలబస్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని, సప్లిమెంటరీ పరీక్షలకు కూడా ఇదే విధానం వర్తిస్తుందని స్పష్టం చేశారు.

పాస్‌పోర్టు ఐదేళ్లకు ఇప్పించండి



- హైకోర్టులో జగన్ అత్యవసర పిటిషన్
- బెజవాడ ప్రజాప్రతినిధుల కోర్టు పరిధి దాటింది
- ఎన్‌వోసీ జారీకి కఠిన షరతులు పెట్టింది
- సీబీఐ కోర్టు ఐదేళ్లు రెన్యువల్ చేయాలంటే.. ఏడాదికే పాస్‌పోర్టు ఇవ్వాలని ఆదేశాలు
- మాజీ సీఎం తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు
- వివరాల కోసం సమయం కోరిన పీపీ
- ఎల్లుండి విచారణ జరుపుతామన్న న్యాయమూర్తి

అమరావతి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) ఇచ్చేందుకు విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు కఠిన షరతులు విధించడాన్ని సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన వెంటనే ఆయన తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. కుమార్తె పుట్టినరోజు వేడుకలకు ఈ నెల 3 నుంచి 25 వరకు లండన్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు జగన్‌కు అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా డిప్లమేటిక్ పాస్‌పోర్టు ఉండేదని, పదవి నుంచి దిగిపోయాక జనరల్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. పాస్‌పోర్టును ఐదేళ్లపాటు పునరుద్ధరించేందుకు (రెన్యువల్‌కు) సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. 'ఓ పరువునష్టం కేసు పెండింగ్ ఉన్నందున విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని పాస్‌పోర్ట్ అధికారులు జగన్‌కు సూచించారు. అందుకోసం ఆయన ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా.. ఎన్‌వోసీ జారీకి పలు కఠిన షరతులు విధించింది. ఏడాది పాటు మాత్రమే పాస్‌పోర్టు రెన్యువల్‌కు అనుమతిస్తామని.. అందుకు రూ.20 వేల బాండ్‌తో ష్యూరిటీ సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఈ నెల 6 నుంచి 27 మధ్య మాత్రమే లండన్‌కు వెళ్లాలని షరతులు విధించింది. సీబీఐ కోర్టు విధించిన షరతులకు అదనంగా విజయవాడ ప్రత్యేక కోర్టు షరతులు పెట్టింది. ఈ విషయంలో తన పరిధి దాటింది' అని పేర్కొన్నారు. సీబీఐ కోర్టు ఇచ్చిన గడువు తక్కువగా ఉన్నందున ప్రత్యేక కోర్టు విధించిన షరతులను సవాల్ చేస్తూ తాము వేసిన పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ... కేసు వివరాలు తన వద్ద అందుబాటులో లేవని, అవి తెప్పించుకునేందుకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్.. పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపి, అదేరోజు నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించారు.

వైసీపీ పరాజయంతో.. జగన్‌కు పాస్‌పోర్టు కష్టాలు

సీఎం పదవీ పోయింది.. డిప్లమేటిక్ పాస్‌పోర్టూ పోయింది

- సాధారణ పాస్‌పోర్టు రెన్యువల్‌కు సీబీఐ కోర్టు అనుమతి
- ఐదేళ్లకు ఇవ్వాలని ఆదేశించినా.. ఏడాదే ఇచ్చిన విజయవాడ ప్రత్యేక కోర్టు
- పైగా పలు షరతులు విధింపు.. దీంతో హైకోర్టుకు

అమరావతి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పరాజయంతో ముఖ్యమంత్రి పదవి కోల్పోయిన వైసీసీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు ఒక్కసారిగా కష్టాలు చుట్టుముట్టాయి. కుమార్తె పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు లండన్ వెళ్లేందుకు ప్రత్యేక విమానం కూడా సిద్ధం చేసుకున్నారు. ఈలోపు బుడమేరు వరదలకు విజయవాడ అతలాకుతలమైంది. బాధితులను పరామర్శించకుండా విమానమెక్కితే విమర్శలు వస్తాయన్న భయంతో రెండ్రోజులు కాసేపు అలా వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి.. యథాప్రకారం సీఎం చంద్రబాబుపై దుమ్మెత్తిపోశారు. కృష్ణా నది వరదల్లో ఉండవల్లిలోని తన నివాసం మునిగిపోకుండా ఉండేందుకు బెజవాడను ముంచారని.. బాధితులకు సాయం అందుతున్నా.. అందడం లేదని ఆరోపించి విమర్శల పాలయ్యారు. శనివారం లండన్ వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లూ చేసుకున్న ఆయనకు పాస్‌పోర్టు సమస్య ఎదురైంది. సీఎం పదవి పోయిన వెంటనే.. ఆయనకు గతంలో ఇచ్చిన డిప్లమేటిక్ పాస్‌పోర్టు రద్దయిపోయింది. అక్రమాస్తుల కేసులో ఆయనకు బెయిల్ ఇచ్చేటప్పుడు కోర్టు సాధారణ పాస్‌పోర్టు స్వాధీనానికి ఆదేశించింది. దీంతో.. కుమార్తె పుట్టినరోజుకు లండన్ వెళ్లడానికి ఆయనకు అనుమతిచ్చిన సీబీఐ కోర్టు.. సాధారణ పాస్‌పోర్టును ఐదేళ్ల పాటు రెన్యువల్ చేయాలని ఆదేశించింది. అయితే.. ఐదేళ్ల కాలపరిమితితో కూడిన పాస్‌పోర్టును పొందేందుకు విజయవాడ ప్రజా ప్రతినిధుల కోర్టులో నమోదైన కేసు ఆయనకు అడ్డంకిగా మారింది. ఆ కోర్టు జగన్‌కు ఏడాది కాలానికి మాత్రమే సాధారణ పాస్‌పోర్టు ఇవ్వాలని ఆదేశించింది. ఈ సందర్భంగా కఠిన షరతులు విధించడంతో ఆయన హైకోర్టును అత్యవసరంగా ఆశ్రయించారు. వాస్తవానికి జగన్ తన లండన్ పర్యటనపై సొంత పార్టీ ముఖ్యులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. కోర్టు అనుమతి తర్వాతే వారికా విషయం తెలిసింది. ఇప్పుడు ఆకస్మికంగా ఆయన లంచ్ మోషన్ వేయడంతో పాస్‌పోర్టు సమస్య వెలుగులోకి వచ్చింది. ఆయన లండన్ పర్యటన ఆలస్యం కానుంది.

అలిపిరి కాలినడక భక్తులకు త్వరలో దివ్యదర్శన టోకెన్లు

- ఆధార్ ప్రామాణికంగా టీటీడీ సేవలు: ఈవో

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అలిపిరి మార్గంలో కాలినడకన తిరుమలకు వచ్చే భక్తులకు దివ్యదర్శన టోకెన్లు త్వరలోనే జారీ చేస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అలిపిరి పాదాల మండపం వద్ద దివ్యదర్శన టోకెన్లు జారీ చేసే కౌంటర్లను ఏర్పాటు చేయడంతోపాటు వాటి స్కానింగ్ కోసం మార్గమధ్యంలోని గాలి గోపురం వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఆధార్ ప్రామాణికంగా టీటీడీ సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రాథమికంగా అనుమతి లభించిందన్నారు. ఇందుకు సంబంధించిన రాష్ట్రం నుంచి నోటిఫికేషన్ త్వరలో వెలువడనుందన్నారు.

పెన్సిల్ ముల్లుపై ఏకదంతుడి రూపం





నైదండ గోపాల్

మాడుగుల రూరల్, సెప్టెంబరు 6: పెన్సిల్ ముల్లుపై వినాయకుడి రూపాన్ని తీర్చిదిద్ది తన విద్వత్తును చాటుకున్నాడు అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం ఎం.కోడూరుకు చెందిన నైదండ గోపాల్. సూక్ష్మ చిత్రకళా నైపుణ్యంతో పండుగలు, జాతీయ దినాలు, ప్రత్యేక రోజుల్లో సందర్భోచితంగా కళాఖండాలు రూపొందిస్తుంటాడు. తాజాగా వినాయకచవితిని పురస్కరించుకుని వినాయకుడి రూపాన్ని పెన్సిల్ ముల్లుపై ఆవిష్కరించాడు. ఇందుకు మూడు గంటలు పట్టినట్టు గోపాల్ తెలిపాడు.

యథావిధిగా మద్యం షాపులు

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం షాపులు యథావిధిగా పనిచేస్తాయని ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో శనివారం నుంచి షాపులు బంద్ చేయాలని షాపుల్లో పనిచేసే ఉద్యోగ సంఘం పిలుపునిచ్చింది. అయితే విజయవాడలో వరదల నేపథ్యంలో ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించకూడదనే ఉద్దేశంతో బంద్ వాయిదా వేసింది. షాపులు యథివిధిగా పనిచేస్తాయని, ఎలాంటి ఇబ్బందుల్లేవని నిశాంత్ పేర్కొన్నారు. నేటి నుంచి షాపులు బంద్ అంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు.

మంత్రి లోకేశ్ చొరవతో ఆక్వా రైతుల సమస్యకు పరిష్కారం

- పసిఫిక్ మహాసముద్రం నుంచి తల్లి రొయ్యలను రప్పించేందుకు చర్యలు
- దక్షిణ కోస్తాలో 20 వేల మందికి మేలు

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత రెండేళ్లుగా సుమారు 20 వేల మంది రొయ్య రైతులు ఎదుర్కొంటున్న జటిలమైన సమస్యను మంత్రి లోకేశ్ పరిష్కరించారు. రాష్ట్రంలో ఆక్వా రైతులు ప్రధానంగా వనామీ, మోనోడాన్ బ్లాక్ టైగర్ రకాల రొయ్యలను సాగు చేస్తున్నారు. తమకు అవసరమైన సీడ్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్థ కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సీఏఏ) గుర్తించిన హేచరీస్ నుంచి కొనుగోలు చేస్తారు. మోనోడాన్ బ్లాక్ టైగర్ రకం రొయ్యలకు అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాల్లో డిమాండ్ ఉంది. పైగా ఈ రకం రొయ్య 10 కౌంట్ వరకు వచ్చే అవకాశం ఉంది. 30 కౌంట్‌కి రూ.410 ధర లభిస్తుండగా... 10 కౌంట్‌కు గరిష్ఠంగా రూ.1,000 వరకు ధర పలుకుతుంది. దక్షిణ కోస్తాలోని ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, తిరుపతి జిల్లాల ఆక్వా రైతులు మోనోడాన్ టైగర్ రకం రొయ్యల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఈ రకం రొయ్యల సీడ్‌ను సరఫరా చేసే వైష్ణవి హేచరీస్ గుజరాత్‌లో బ్రూడ్‌స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్ (బీఎంసీ)ని ఏర్పాటు చేసింది. పసిఫిక్ మహాసముద్రం నుంచి తల్లి రొయ్యలను దిగుమతి చేసుకుని, బీఎంసీలో సీడ్ ఉత్పత్తి చేసి రొయ్య రైతులకు సరఫరా చేస్తుంది. 'పసిఫిక్ మహాసముద్రం నుంచి నేరుగా తల్లి రొయ్యలను రాష్ట్రానికే తెప్పించాలి. స్థానిక హేచరీల్లో సీడ్‌ను ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేయాలి. దీనివల్ల మంచి కౌంట్ లభిస్తుంది' అని రాష్ట్రంలోని రొయ్య రైతులు ఎప్పటి నుంచో కోరుతున్నా వైసీపీ ప్రభుత్వం ఆ విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ప్రకాశం జిల్లా రొయ్య రైతుల సంఘం అధ్యక్షుడు గోపీనాథ్ ఇటీవలే ఈ సమస్యను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ఇటీవల సరఫరా చేసిన సీడ్ సరిగ్గా లేకపోవడంతో నష్టపోయామని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఫిషరీస్ అధికారులను ఆదేశించారు. ఆ శాఖ కమిషనర్ వెంటనే వైష్ణవి హేచరీస్ ప్రతినిధులతో చర్చించారు. రైతుల విజ్ఞప్తిని సంస్థ ప్రతినిధులు అంగీకరించారు. ప్రకాశం జిల్లాలో నష్టపోయిన సుమారు 300 మంది రైతులకు మళ్లీ నాణ్యమైన సీడ్‌ను సరఫరా చేసేందుకూ సంస్థ అంగీకారం తెలిపింది.

అప్పులు చేస్తారు.. అంతం చూస్తారు!

- సైనేడ్‌తో చిటికెలో చంపేస్తారు!
- గుట్టుచప్పుడు కాకుండా నలుగురి దారుణ హత్య
- మరో ముగ్గురినీ అంతం చేయడానికి విఫలయత్నం
- ఇద్దరు తల్లీకూతుళ్లు సహా ముగ్గురు మహిళలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

గుంటూరు, సెప్టెంబరు 6: సైనేడ్‌తో గుట్టుచప్పుడు కాకుండా దారుణ హత్యలకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టయింది. వీరు ఇప్పటికే నలుగురిని ఈ విధంగా హత్య చేయగా మృతుల బంధువులు వాటిని సహజ మరణాలుగా భావించి అంత్యక్రియలు చేసేశారు. చేసిన అప్పులు ఎగ్గొట్టడానికి, మృతుల ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు అపహరించే ఉద్దేశంతో ఈ ఘాతుకాలకు పాల్పడిన ముగ్గురు మహిళలను చేబ్రోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఇద్దరు తల్లీకూతుళ్లు. శుక్రవారం గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఎస్. సతీశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. వడ్లమూడి శివారులో ఈ ఏడాది జూన్ 13న గుర్తుతెలియని మహిళ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మృతురాలిని తెనాలి యడ్ల లింగయ్య కాలనీకి చెందిన నాగూర్‌బీ (45)గా గుర్తించారు. నాగూర్‌బీకి అదేకాలనీకి చెందిన మునగప్ప రజిని రూ.30వేలు అప్పు ఉంది. ఆమెను అడ్డు తొలగించుకుంటే అప్పు తీర్చేపని ఉండదని, పైగా ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు కూడా సొంతం చేసుకోవచ్చని రజిని భావించింది. తమ ప్రాంతానికే చెందిన ముడియాల వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి, ఆమె తల్లి బొంతు రమణమ్మతో కలసి వ్యూహం రచించింది. దీనిలో భాగంగా జూన్ 5న బయటికి వెళ్దామని నాగూర్‌బీని రజిని ఆటోలో తీసుకువచ్చింది. వారి ఆటోను వెంకటేశ్వరి ద్విచక్రవాహనంపై అనుసరించింది. వీరికి వెంకటేశ్వరి తల్లి రమణమ్మ తన బంధువు కృష్ణ అలియాస్ బిల్లా అనే బంగారు షాపులో పనిచేసే యువకుడి ద్వారా సైనైడ్ తెప్పించి ఇచ్చింది. మార్గమధ్యంలో ఆటో డ్రైవర్‌తో బ్రీజర్ బాటిల్ తెప్పించారు. వడ్లమూడి శివారులో నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి అక్కడ బ్రీజర్‌లో సైనైడ్ కలిపి తాగించడంతో నాగూర్‌బీ మృతిచెందింది. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకొని ఇద్దరూ ఇంటికి వచ్చేశారు. ఆ దారిలో ప్రయాణించిన ఆటో వివరాలు సేకరించిన పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోగా అతను రజిని పేరు చెప్పడంతో మిస్టరీ వీడింది. పోలీసు విచారణలో రజిని, వెంకటేశ్వరి, రమణమ్మ నేరాన్ని అంగీకరించారు. మరో ముగ్గురిని కూడా హత్య చేసినట్లు తెలిపారు. ఈ వరుస హత్యల్లో వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి, ఆమె తల్లి రమణమ్మ కీలకమని తేలింది. 2022లో తల్లితో కలసి వెంకటేశ్వరి తన అత్త అయిన సుబ్బులక్ష్మి(65)ని ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఆమె ఇంట్లోనే మద్యంలో సైనేడ్ కలిపి తాగించి హత్య చేసింది. ఆమె నోటి వెంట నురగ రావడంతో బంధువులు గుండెపోటుగా భావించి అంత్యక్రియలు నిర్వహించారు. అత్త పేరుతో ఉన్న ఆస్తితో పాటు డబ్బు, బంగారం కోసమే ఈ హత్యకు పాల్పడ్డారు. అలాగే తాము అప్పుగా తీసుకున్న రూ.2లక్షలు ఎగ్గొట్టడంతో పాటు ఒంటిపై ఉన్న బంగారం, డబ్బు అపహరించడానికి తమకు అప్పుఇచ్చిన తెనాలికి చెందిన నాగమ్మ(65)ను గతేడాది ఆగస్టులో శీతల పానీయంలో సైనేడ్ కలిపి హత్య చేశారు. అదేవిధంగా తెనాలికి చెందిన భూదేవి అనే మహిళ భర్త పీసు అలియాస్ మోషేను మద్యంలో సైనేడ్ కలిపి తాగించి హత్య చేశారు. ఇదేకాకుండా మరో ముగ్గురు మహిళలను కూడా హత్య చేయడానికి వెంకటేశ్వరి, రమణమ్మ ప్రయత్నించి విఫలమయ్యారు. కాగా, వరుస హత్యల కేసుల్లో ప్రధాన నిందితులైన వెంకటేశ్వరి ఆమె తల్లి రమణమ్మ వైసీపీ సానుభూతిపరులు. వెంకటేశ్వరి 2019-23 మధ్య వలంటీర్‌గా చేస్తూనే పలు హత్యలు, హత్యాయత్నాలకు తెగబడింది. కాగా, నిందితులకు సైనైడ్ ఇచ్చిన కృష్ణపై కూడా కేసు నమోదు చేసి, నిందితుడిగా చేర్చనున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జగన్ బుర్రలో 'బురద'!

తెలంగాణలో ఖమ్మం జిల్లాను ముంచింది మున్నేరు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడను ముంచింది బుడమేరు. ఇటు మున్నేరు, అటు బుడమేరు ఆక్రమణలకు గురవడంతో పాటు ప్రణాళిక లేకుండా నిర్మాణాలకు అనుమతించడంతో భారీ వర్షం కురిసినప్పుడు వరద పోటెత్తి దిగువ ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతున్నాయి. ఇటు ప్రజల స్వార్థం, అటు ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల దిగువ ప్రాంతాల ప్రజలు వరద తాకిడికి గురవుతున్నారు. వరదలు సంభవించినప్పుడు యథావిధిగా బురద రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో బురద రాజకీయం పరాకాష్ఠకు చేరుకుంది. అబద్ధాలే పునాదులుగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రస్తుత వరదలపై కూడా అబద్ధాలను ప్రచారం చేస్తూ ఆనందిస్తున్నారు. ఆయనకు చెందిన రోత మీడియా తన కడుపు మంటను దాచుకోకుండా బురద రాజకీయాలకు తన వంతు సహాయం చేస్తోంది.


> తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో ఇప్పుడు అరెస్టుల పర్వం మొదలైంది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఈ దాడి కేసును ఊరగాయ వేసిన పోలీసులు ఇప్పుడు ప్రభుత్వం మారగానే జాడీ నుంచి బయటకు తీసి విచారణను వేగవంతం చేశారు. పోలీసు శాఖ ఇలా ప్రభుత్వాలను బట్టి నడుచుకోవడమే విషాదం. అదే పోలీసులు అప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా వ్యవహరించడం ఏమిటి? నేరం జరిగినప్పుడు పోలీసులు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చాలి కదా? అప్పుడైనా ఇప్పుడైనా పోలీసులు తమ పని తాము చేస్తే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదు కదా. ప్రభుత్వం ఎవరిదైనా తప్పు చేయడానికి ఎవరికైనా భయం ఉండాలి కదా? ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున వైసీపీ కార్యాలయంపై దాడి చేసినా పట్టించుకోరా? పోలీసులు ఉన్నది అధికారంలో ఉన్న వారి సేవలో తరించడానికి కాదు కదా? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను విస్మరిస్తే ఎలా?

అమరావతిలో రాజధాని ఏర్పాటుకావడం మొదటి నుంచీ ఇష్టం లేని జగన్మోహన్ రెడ్డి తన రోత మీడియా ద్వారా రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేయించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఇల్లు ముంపునకు గురికాకుండా కాపాడుకొనేందుకే ముందస్తు హెచ్చరికలు లేకుండా బుడమేరు గేట్లు ఎత్తేశారని జగన్ రెడ్డి తన అజ్ఞానాన్ని ప్రదర్శించారు. అదే సమయంలో సదరు రోత మీడియాలో మాత్రం చంద్రబాబు ఇల్లు మునిగిపోయిందని, రెండవ అంతస్థులోకి నీరు ప్రవేశించిందని అబద్ధాలు ప్రచారం చేశారు. కృష్ణా నది దిగువన కృష్ణలంక వద్ద రిటైనింగ్ వాల్‌ను తాను నిర్మించి ఉండకపోతే మరింత ప్రాణనష్టం జరిగి ఉండేదని కూడా చెప్పుకొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్ధరాత్రి అపరాత్రి అన్న తేడా లేకుండా వరద బాధితులను ఆదుకోవడానికి మోకాళ్ల లోతు బురదను సైతం లెక్కచేయకుండా యువకుడిలా తిరుగుతుండగా, జగన్ రెడ్డి మాత్రం కాసేపు నీళ్లలోకి దిగి ఫొటోలకు పోజులిచ్చి బురద రాజకీయాలకు తెరలేపారు. అబద్ధాలను పదే పదే ప్రచారం చేస్తే ప్రజలు నమ్ముతారని, ఫలితంగానే 2019లో తాను ముఖ్యమంత్రిని కాగలిగానని జగన్‌కు తెలుసు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజధానిగా ఎంపిక చేసిన అమరావతికి ముంపు ప్రమాదం ఉందని ప్రచారం చేసిన జగన్ రెడ్డి.. ఇప్పుడు కూడా తన రోత మీడియా ద్వారా రాజధాని మునిగిపోయిందని చెత్త ప్రచారం మొదలుపెట్టారు. ఒక సామాజిక వర్గంపై కక్ష పెంచుకున్న జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ దుష్టాచారాన్ని వదులుకోవడం లేదు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రాష్ట్రానికి ఎక్కడ పెట్టుబడులు వస్తాయోనన్న దుగ్ధతో జగన్‌కు అండగా ఉండే సైకో గుంపు సోషల్ మీడియా వేదికగా "అమరావతిని మర్చిపోయి తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి" అని ప్రచారం కూడా చేసింది. ఒక రాష్ట్రం పట్ల ఇంతకంటే ద్రోహం ఉంటుందా? జగన్ రెడ్డి అనే వ్యక్తికి ఆంధ్రప్రదేశ్ పట్ల కనీస అభిమానం కూడా ఉండదు. తాను అధికారంలో ఉండటమే ఆయనకు కావాల్సింది. సైకో గుంపునకు, పేటీఎం బ్యాచ్‌కు కూడా జగన్ అధికారంలో ఉంటే చాలు.. రాష్ట్రం ఏమైపోయినా ఫర్వాలేదు. అందుకే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా కాకముందే రాళ్లు వేయడం ప్రారంభించారు. పనిలో పనిగా భవిష్యత్తులో తనకు పోటీ అవుతాడని భావిస్తున్న మంత్రి లోకేశ్‌ను కూడా టార్గెట్ చేసుకున్నారు. విద్యా శాఖలో చీమ చిటుక్కుమన్నా భూతద్దంలో చూపించడం ద్వారా లోకేశ్‌ను ఫెయిల్యూర్‌గా ముద్ర వేసే ప్రయత్నాలను జగన్ అనుచర మూక ప్రారంభించింది. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో ఆడపిల్లలు స్నానం చేసే బాత్‌రూంలలో కెమెరాలు ఏర్పాటు చేశారంటూ అబద్ధాలు ప్రచారం చేశారు. తనకు తప్ప ముఖ్యమంత్రి పదవిలో కొనసాగే అర్హత మరెవరికీ లేదని నమ్ముతున్న జగన్ రెడ్డి, ప్రజలను కూడా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంతకుముందే 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ఇప్పుడు నాలుగవసారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబును ఆ పదవికి అర్హుడా అని ప్రశ్నిస్తున్నారు. అర్హతలను బట్టి అయితే ముఖ్యమంత్రి అయ్యే అర్హత జగన్ రెడ్డికి ఏమాత్రం లేదని మెజారిటీ ప్రజలు తీర్పు ఇచ్చారు. జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి జరుగుతున్నట్టుగానూ, ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నట్టుగానూ కనిపించిన రోత మీడియాకు ఈ మూడు నెలల్లోనే రాష్ట్రం వల్లకాడు అయినట్టుగా కనిపిస్తోంది. జగన్ మనసులో ఏముందో సదరు రోత మీడియా ప్రచారం చేస్తోంది. రోత మీడియా ప్రచారం చేసే కథనాలను వైసీపీ మూక అందిపుచ్చుకుంటోంది. ఇదీ ప్రస్తుతం జరుగుతున్న తంతు. చంద్రబాబుకు పనీపాటా లేదు, అందుకే వరద ప్రాంతాల్లో తిరుగుతున్నారని జగన్ రెడ్డి భావిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు తనలా ఎంచక్కా హెలికాప్టర్‌లో ఒక రౌండ్ తిరిగి సరిపెట్టకుండా బురదలో తిరగడం ఏమిటి? అని జగన్‌కు అనిపిస్తుండవచ్చు. పరిపాలన చేయడం తనకు తప్ప మరెవరికీ చేతకాదని జగన్ నమ్ముతుండవచ్చు గానీ ప్రజలు అలా అనుకోవడం లేదు. అందుకే తాజా ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. నిజానికి చంద్రబాబు సరిగ్గా ప్లానింగ్ చేసి ఉంటే జగన్ రెడ్డికి రెండు మూడు సీట్లకు మించి వచ్చి ఉండేవి కావు. జగన్ రెడ్డి అభిప్రాయంతో, నమ్మకంతో నిమిత్తం లేకుండా ప్రజలు మాత్రం ఆయన ముఖ్యమంత్రిగా పనికిరాడని తేల్చిపారేశారు. ఈ నేపథ్యంలో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన జగన్ రెడ్డి, ఆత్మవంచన చేసుకుంటున్నారు. వరద ప్రాంతంలో కొద్దిసేపు పర్యటించినప్పుడు, ఇప్పుడు ముఖ్యమంత్రిగా నువ్వుంటే బాగుండేదని ప్రజలు నినాదాలు చేసినట్టుగా ప్రచారం చేసుకుంటూ ఆనందం పొందుతున్నారు. వరదలొస్తే రాజధాని అమరావతి మునిగిపోతుందని అధికారంలో ఉన్నప్పుడు తాను చేసిన ప్రచారం నిజమని మళ్లీ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాజధాని మునిగిపోయి ఉంటే హైకోర్టు, సచివాలయం ఎలా పనిచేస్తున్నాయనే ఇంగితం కూడా లేకుండా రోత మీడియా కథనాలను వండి వార్చింది. తాము చెప్పే అబద్ధాలను ఎంతో కొంత మంది నమ్మకపోతారా అన్నది జగన్ అండ్ కో భావన. గతంలో అలా నమ్మడం వల్లనే ప్రజలు ఆయనకు అధికారం కట్టబెట్టారు. అందుకే ఇప్పుడు కూడా రాజధాని విషయంలోనే కాకుండా బుడమేరు విషయంలోనూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల ప్రజలకు బుడమేరు గురించి తెలిసే అవకాశం లేదు. అందుకే జగన్ రెడ్డి అబద్ధాలకు పదును పెట్టారు. చంద్రబాబు ఇల్లు మునగకుండా ఉండేందుకే బుడమేరు గేట్లు ఎత్తారని చెప్పడం తెలియక చేసిన పని కాదు. రోత మీడియాలో చంద్రబాబు ఇల్లు మునిగిపోయిందని రాసినప్పుడు ఇలా ఎలా చెబుతారని ప్రశ్నించే విలేఖరులు కూడా ఇప్పుడు లేరు. మీడియాలో వైరుధ్యాల వల్ల జగన్ అండ్ కో చేస్తున్న అసత్య ప్రచారం ఎంతో కొంత ప్రజల్లోకి వెళుతోంది. రాష్ట్రంలో ఏ అనర్థం జరిగినా అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని ప్రజలంతా నమ్మాలని ఆయన కోరుకుంటున్నారు. అందుకే ఈ బరితెగింపు.

నిరూపిస్తే ఇచ్చేస్తాం!

బుడమేరు కట్టలు తెగడానికి ఇబ్రహీంపట్నం వద్ద 24 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మినీ హైడల్ ప్లాంట్ కారణం అని సరికొత్త ప్రచారానికి తెర లేపారు. నిజానికి ఈ ప్లాంట్ ఏర్పాటు విషయం 1998లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు కూడా తెలియదు. అప్పటి ప్రభుత్వ పాలసీ ప్రకారం ఆ ప్లాంట్‌కు జెన్‌కో అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు అనుమతించారు. ఈ ప్లాంట్ వల్ల వచ్చే ఆదాయంతోనే 'ఆంధ్రజ్యోతి' పత్రిక నడుస్తోందని నమ్మిన ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2009 తర్వాత దీనికి అనుమతులు రద్దు చేశారు. ఆ తర్వాతి ప్రభుత్వాలు పునరుద్ధరించినా జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ప్లాంట్‌కు అనుమతులు రద్దు చేశారు. నిజానికి మా ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే కొద్దిపాటి విద్యుత్ అతి తక్కువ ధరకే ప్రభుత్వానికి సరఫరా చేసే వాళ్లం. నష్టపరిహారం ఇవ్వకుండా ప్లాంట్ తొలగిస్తే ఎలా? అని మాత్రమే మేం హైకోర్టును ఆశ్రయించాం. జరిగింది ఇది కాగా, చంద్రబాబు నాకు ఏదో మేలు చేశారని రోత పత్రికలో ప్రచారం చేస్తున్నారు. విచిత్రమేమిటంటే కృష్ణా నదికి వరద వస్తే ఈ ప్లాంట్ కూడా మునిగిపోతుంది. ఇప్పుడు కూడా మునిగిపోయింది. కృష్ణా నదికి భారీ వరద వచ్చినప్పుడు బుడమేరు నీరు నదిలోకి వెళ్లే అవకాశమే లేదు. ఇంకా చెప్పాలంటే ఇబ్రహీంపట్నం లోతట్టు ప్రాంతాలు కృష్ణా వరదల్లో మునిగిపోకుండా ఉండటానికి ఈ ప్లాంట్ రక్షణగా నిలబడిన సందర్భాలూ ఉన్నాయి. జగన్ రోత మీడియాలో చేస్తున్న ప్రచారం నిజమని రుజువు చేస్తే ఆ ప్లాంట్‌ను మా సొంత ఖర్చుతో తొలగించడానికి సిద్ధంగా ఉన్నాం. కనీస ప్రమాణాలు, నైతిక విలువలు పాటించని జగన్ రోత మీడియాకు బురద చల్లడం తప్ప మరేమీ తెలియదు. కడుపుకు అన్నం తినేవాళ్లు ఎవరూ ఇలాంటి ప్రచారాలు చేయరు. అధికారంలో ఉన్నప్పుడు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్టు బాబూ కొడుకులు ఈ మినీ హైడల్ ప్రాజెక్ట్ ఉసురు తీసే ప్రయత్నం చేశారు. మా ప్లాంట్ వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగిందని రుజువు చేస్తే దాన్ని జగన్ అండ్ కోకు ఇచ్చేస్తాం. అయితే జగన్ మాత్రం తన రోత పత్రికను ఇప్పుడు బూతు పత్రికగా మార్చే ప్రయత్నంలో ఉన్నట్టున్నారు. అందుకే చెత్తతో పత్రికను నింపుతున్నారు. అధికారం కోల్పోయామన్న జగన్ అండ్ కో బాధను ఎవరు తీర్చాలి? ప్రజలే తీర్చాలి! అయితే ఐదేళ్లపాటు చేసిన అరాచకాలను ప్రజలు ఇప్పట్లో మరచిపోయేలా లేరే! అందుకే అబద్ధాలను నమ్ముకొని మరోమారు ప్రజలను వంచించే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ రెడ్డి ఏ ముహూర్తంలో పుట్టారో కానీ ఆయనలో మానవ లక్షణాలు నానాటికీ కనుమరుగవుతున్నాయి.

> ప్రజలంటే చంద్రబాబుకు వెరపు ఉంటుంది. జగన్ మాత్రం ప్రజలను వెర్రిబాగులోళ్లుగా భావిస్తారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు చేశారు. చేసేవాళ్లను ప్రోత్సహించారు. అన్నీ గుర్తుపెట్టుకున్న ప్రజలు తగిన సమయంలో తగిన తీర్పు ఇచ్చారు.



> నిజానికి మా ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే కొద్దిపాటి విద్యుత్ అతి తక్కువ ధరకే ప్రభుత్వానికి సరఫరా చేసే వాళ్లం. నష్టపరిహారం ఇవ్వకుండా ప్లాంట్ తొలగిస్తే ఎలా? అని మాత్రమే మేం హైకోర్టును ఆశ్రయించాం. జరిగింది ఇది కాగా, చంద్రబాబు నాకు ఏదో మేలు చేశారని రోత పత్రికలో ప్రచారం చేస్తున్నారు. విచిత్రమేమిటంటే కృష్ణా నదికి వరద వస్తే ఈ ప్లాంట్ కూడా మునిగిపోతుంది. ఇప్పుడు కూడా మునిగిపోయింది. ఇంకా చెప్పాలంటే ఇబ్రహీంపట్నం లోతట్టు ప్రాంతాలు కృష్ణా వరదల్లో మునిగిపోకుండా ఉండటానికి ఈ ప్లాంట్ రక్షణగా నిలబడిన సందర్భాలు ఉన్నాయి. జగన్ రోత మీడియాలో చేస్తున్న ప్రచారం నిజమని రుజువు చేస్తే ఆ ప్లాంట్‌ను మా సొంత ఖర్చుతో తొలగించడానికి సిద్ధంగా ఉన్నాం. అధికారంలో ఉన్నప్పుడు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్టు బాబూ కొడుకులు ఈ మినీ హైడల్ ప్రాజెక్ట్ ఉసురు తీసే ప్రయత్నం చేశారు. మా ప్లాంట్ వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగిందని రుజువు చేస్తే దాన్ని జగన్ అండ్ కోకు ఇచ్చేస్తాం.

జగన్ అంతే!


చంద్రబాబును జైలుకు పంపడం వల్లే జగన్ రెడ్డి అధికారం కోల్పోయారని రాజమండ్రి మేధావిగా ప్రచారంలో ఉన్న ఉండవల్లి అరుణ్ కుమార్ చెబుతున్నారు గానీ, అందరికంటే ప్రజలే తెలివైనవాళ్లు. జగన్ రెడ్డి చేసిన అరాచకాలు అన్నింటినీ గుర్తుంచుకోవడం వల్లనే ప్రజలు ఆయన పార్టీని చిత్తుగా ఓడించారు. వరదల విషయంలో బురద రాజకీయం చేస్తున్న జగన్ రెడ్డికి వరద బాధితులకు విరాళం ఇవ్వడానికి మాత్రం మనసు రాదు. సొంత సొమ్ము ఇవ్వడానికి మనసు రానప్పుడు తాను ఏర్పాటు చేసిన కంపెనీలు లాభాల్లో ఉన్నాయి కదా? ఆ కంపెనీలైనా విరాళాలు ప్రకటించవచ్చు కదా? అంతటి విశాల హృదయం ఆయనకు ఎక్కడిది? ఇంతవరకూ ఆయన ఒక్కరికైనా రూపాయి సహాయం చేసిన సందర్భాన్ని చూశామా? లేదే! దటీజ్ జగన్! వన్ వే ట్రాఫిక్ మాత్రమే ఆయన విధానం. వారం రోజులుగా వరదల్లో చిక్కుకున్న విజయవాడ ప్రజలు చంద్రబాబుపై తిరగబడకపోవడం పాపం, జగన్ రెడ్డికి నచ్చడం లేదు. మూడో వంతు వరదల్లో చిక్కుకున్నప్పటికీ మృతుల సంఖ్య ఎక్కువగా లేకపోవడం కూడా ఆయనకు రుచించడం లేదు. విశ్రాంతి కూడా తీసుకోకుండా బాధితులను ఆదుకోవడానికి యువకుడిలా శ్రమిస్తున్న చంద్రబాబును పలువురు ప్రశంసిస్తుండగా, జగన్ అండ్ కో మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. విజయవాడ పూర్తిగా మునిగిపోయి వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయి ఉంటే సైకో గుంపు ఆనందించి ఉండేది. రాజధాని మునిగిపోలేదు. చంద్రబాబు ఇల్లు కూడా మునిగిపోలేదు. మరోవైపు ముంపు ప్రాంతాలు కోలుకుంటున్నాయి. ఇవన్నీ జగన్‌కు సహజంగానే రుచించవు. జగన్‌తో పాటు అదే రక్తం పంచుకు పుట్టిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మాత్రం చంద్రబాబు కృషిని ప్రశంసించారు. అయితే అందరికీ సహాయం అందడం లేదని ఆమె అన్నారు. ఇందులో కొంత నిజం ఉంది. అందుకే పీకల్లోతు నీళ్లలో చిక్కుకున్న ప్రజలకు ఆహారం అందించడానికి డ్రోన్లను ఉపయోగించారు. వరదల వల్ల రాజధాని మునగలేదు. చంద్రబాబు ఇంట్లోకి నీరు రాలేదని బాధపడుతూ కూర్చోకుండా సొంత పార్టీ మునిగిపోకుండా కాపాడుకోవడంపై జగన్ రెడ్డి దృష్టి పెట్టడం మంచిది.

అదే జరిగితే శిక్ష ఖాయం!

రాజ్యసభలో తన పార్టీకి ఉన్న బలంపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆధారపడి ఉందని జగన్ రెడ్డి ఇప్పటిదాకా దిలాసాగా ఉన్నారు. ఇప్పుడు రాజ్యసభలో కూడా వైసీపీకి చిల్లు పడింది. భారతీయ జనతా పార్టీ ఒక వైపు నుంచి, తెలుగుదేశం పార్టీ మరోవైపు నుంచి రాజ్యసభ సభ్యులను జగన్‌కు దూరం చేసే పనిలో ఉన్నాయి. ఇప్పటికే బీద మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణ తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. మరి కొందరూ అదే బాటలో ఉన్నారు. విజయసాయి రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, నిరంజన్ రెడ్డి వంటి వాళ్లతో భారతీయ జనతా పార్టీ సంప్రదింపులు జరుపుతోంది. మిగతావారు తెలుగుదేశం పార్టీతో టచ్‌లో ఉన్నారు. రాజ్యసభలో బిల్లులు ఆమోదం పొందడానికి బీజేపీకి నలుగురు సభ్యుల బలం అదనంగా కావాలి. ఈ కారణంగా వైసీపీకి చెందిన నలుగురిని చేర్చుకోవడానికి బీజేపీ స్కెచ్ వేస్తోంది. వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్ మినహా మిగతా వారందరూ బీజేపీ, తెలుగుదేశం పార్టీలలో ఏదో ఒక దానితో చేతులు కలుపుతారని ప్రచారం జరుగుతోంది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం సాఫీగా నడవాలంటే లోక్‌సభలో తెలుగుదేశం పార్టీ మద్దతు అవసరం. ఈ కారణంగా జగన్ రెడ్డికి పరోక్ష సహాయం అందించే పరిస్థితిలో కేంద్రం లేదు. రాజ్యసభలో వైసీపీ బలంపై ఆధారపడకూడదన్న నిర్ణయానికి బీజేపీ రావడానికి కూడా ఇదే కారణం. తెలుగుదేశం, బీజేపీ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ విజయవంతమైతే అవినీతి కేసులలో విచారణ వేగం పుంజుకొని వచ్చే ఎన్నికల నాటికి జగన్, విజయసాయి రెడ్డిలకు శిక్షలు పడే అవకాశం ఉంది. అదే జరిగితే జగన్ రెడ్డి రాజకీయ జీవితం ప్రశ్నార్థకం అవుతుంది. వివేకానంద రెడ్డి హత్య కేసులో జగన్ సతీమణి భారతి ప్రమేయంపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి. ఈ కారణంగా పార్టీ నాయకత్వ బాధ్యతలను ఆమె చేపట్టినప్పటికీ పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. ప్రస్తుతానికి మాత్రం ఇవన్నీ ప్రశ్నలే. మరికొంత కాలం వేచి చూస్తే గానీ జగన్ రాజకీయ భవితవ్యంపై స్పష్టత ఏర్పడదు. ఈ విషయం అలా ఉంచితే, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో ఇప్పుడు అరెస్టుల పర్వం మొదలైంది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఈ దాడి కేసును ఊరగాయ వేసిన పోలీసులు, ఇప్పుడు ప్రభుత్వం మారగానే జాడీ నుంచి బయటకు తీసి విచారణను వేగవంతం చేశారు. పోలీసు శాఖ ఇలా ప్రభుత్వాలను బట్టి నడుచుకోవడమే విషాదం. అదే పోలీసులు అప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా వ్యవహరించడం ఏమిటి? నేరం జరిగినప్పుడు పోలీసులు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చాలి కదా? అప్పుడైనా ఇప్పుడైనా పోలీసులు తమ పని తాము చేస్తే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదు కదా. ప్రభుత్వం ఎవరిదైనా తప్పు చేయడానికి ఎవరికైనా భయం ఉండాలి కదా? ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున వైసీపీ కార్యాలయంపై దాడి చేసినా పట్టించుకోరా? పోలీసులు ఉన్నది అధికారంలో ఉన్న వారి సేవలో తరించడానికి కాదు కదా? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను విస్మరిస్తే ఎలా? దేశంలో వివిధ వ్యవస్థలు అధికారంలో ఉన్న వారికి ఊడిగం చేయడం వల్లనే వాటిపై ప్రజలకు నమ్మకం పోతున్నది. నేరస్తులు ఎదురుదాడి చేస్తూ తప్పించుకుంటున్నారు. జగన్ రెడ్డిపై ఉన్న కేసులే ఇందుకు నిదర్శనం. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించాల్సిందే. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఒక మహిళను లైంగికంగా వేధించిన విషయం తెలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క రోజు కూడా జాప్యం చేయకుండా ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఏం జరిగింది? ఇలాంటి వారికి ప్రమోషన్లు ఇచ్చారు. మంత్రులను చేశారు. చంద్రబాబు, జగన్‌కు మధ్య ఉన్న మౌలిక తేడా ఇదే. ప్రజలంటే చంద్రబాబుకు వెరపు ఉంటుంది. జగన్ మాత్రం ప్రజలను వెర్రిబాగులోళ్లుగా భావిస్తారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు చేశారు. చేసేవాళ్లను ప్రోత్సహించారు. అన్నీ గుర్తుపెట్టుకున్న ప్రజలు తగిన సమయంలో తగిన తీర్పు ఇచ్చారు. అయినా జగన్ రెడ్డిలో మార్పు రాకపోవడం ఆయన ఖర్మ. ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని ఆయన ఎప్పటికి తెలుసుకుంటారో!

> వరదల విషయంలో బురద రాజకీయం చేస్తున్న జగన్ రెడ్డికి వరద బాధితులకు విరాళం ఇవ్వడానికి మాత్రం మనసు రాదు. సొంత సొమ్ము ఇవ్వడానికి మనసు రానప్పుడు తాను ఏర్పాటు చేసిన కంపెనీలు లాభాల్లో ఉన్నాయి కదా? ఆ కంపెనీలైనా విరాళాలు ప్రకటించవచ్చు కదా? అంతటి విశాల హృదయం ఆయనకు ఎక్కడిది? ఇంతవరకూ ఆయన ఒక్కరికైనా రూపాయి సహాయం చేసిన సందర్భాన్ని చూశామా? లేదే! దటీజ్ జగన్! వన్ వే ట్రాఫిక్ మాత్రమే ఆయన విధానం. వారం రోజులుగా వరదల్లో చిక్కుకున్న విజయవాడ ప్రజలు చంద్రబాబుపై తిరగబడకపోవడం...పాపం, జగన్ రెడ్డికి నచ్చడం లేదు. మూడో వంతు వరదల్లో చిక్కుకున్నప్పటికీ మృతుల సంఖ్య ఎక్కువగా లేకపోవడం కూడా ఆయనకు రుచించడం లేదు. విశ్రాంతి కూడా తీసుకోకుండా బాధితులను ఆదుకోవడానికి యువకుడిలా శ్రమిస్తున్న చంద్రబాబును పలువురు ప్రశంసిస్తుండగా, జగన్ అండ్ కో మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు.

గతానికి శిఖరం... భావికి జ్ఞాపకం



> కాళోజీ చూపు వేరు, దృష్టి వేరు.. చింతన వేరు.. జీవితం వేరు. ప్రశ్నించడం, ధిక్కరించడం, అధిక్షేపించడం, అవసరమైనపుడు విప్లవించడం, ప్రతిఘటించడం... ఇవన్నీ ఆయన జీవితంలో నిత్యకృత్యాలై సాగిన జీవక్రియలు. ఇవే ఆయన జీవన శైలి. ఇవన్నింటినీ మించి 'ఆర్ద్రత' నిండిన హృదయంతో వెన్నవలె కన్నీరై కరిగిపోవడం ఆయన స్వచ్ఛమైన మానవతకు నిదర్శనం. 'అతిథివోలె వుండి వుండి/ అవని విడిచి వెళ్ళుతాను' అని ప్రశాంతంగా నిష్క్రమించిన ప్రజాకవి కాళోజీ ఈ దేశ సంపద.

నవంబర్ 23, 1975 న ఎమర్జెన్సీలో కాళోజీ 'సిరాచుక్క' అన్న మకుటంతో ఒక చిన్న శక్తివంతమైన కవిత రాశాడు. దాంట్లో 'A single drop of Ink/ that make the millions to think' అని BYRON రాసిన కవిత్వ పాదాలను ఉటంకిస్తూ 'ఒకే ఒక్క సిరాచుక్క/ లక్ష మెదళ్ళకు కదలిక/ అన్నాడు బైరన్/ నిజమేనా అది?/ మరి నేను ఒలకబోసిన / సిరా సీసాలకొద్ది గాదు/ పీపాలకొద్ది / ఏ ఒక్క మెదడు కదిలినట్టు లేదు/ మొదట నా మెదడులో ఉంటేగా కదలిక/ మరోడ్ని కదిలించ' ఇది కాళోజీలో ఉన్న ఆత్మానుశోధనకు సంబంధించీ, తను ప్రజలకు ఏదైనా సామాజిక సంబంధి ఐన ఒక కీలక అంశాన్ని ప్రస్తుతిస్తున్నపుడు ముందు దాన్ని తనకు తాను అన్వయించుకుని, అనుశీలించుకుని నిజాయితీగా ఆత్మపరీక్ష చేసుకుంటాడు. ఈ తత్వం ఆయనలోని స్వచ్ఛతనూ, నిర్మలతనూ, కొన్ని సందర్భాల్లో ఆయన పొందే అంతర్ ఘర్షణనూ, నిస్సహాయతనూ, వేదనను కూడా ప్రకటించిన సందర్భాలను మనకు ప్రదర్శిస్తుంది. ఉదాహరణకు 'ఎందుకో నా హృదిని' కవితలో ఆయనంటాడు.. 'ఎందుకో నా హృదిని / ఇన్ని ఆవేదనలు?/ అవనిపై జరిగేటి అవకతవకల జూచి/ ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?/ పరుల కష్టముజూచి పగిలిపోవును గుండె/ మాయ మోసము జూచి, మండిపోవును ఒళ్ళు/ ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?/ తప్పు దిద్దగలేను దారి చూపగలేను/ తప్పుజేసిన వాని దండింపగాలేను/ కష్టపడువారలను కాపాడగాలేను/ ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు/ అవకతవకల నేను సవరింపలేనపుడు/ పరులకష్టాలతో పనిఏమి మాకనెడు/ అన్యులను జూచైన హాయిగమనలేను/ ఎందుకో నా హృదిని- ఇన్ని ఆవేదనలు?'. ఇక్కడ కవి అంతర్ముఖుడై తన నిస్సహాయతను గుర్తిస్తూనే అంతిమంగా ప్రజలపట్ల తనకు ఉండవలసిన ధర్మపక్షాన్ని వహించవలసిన బాధ్యతను స్వీకరిస్తున్న కార్యశీలతను వ్యక్తపరుస్తున్నాడు. అదే విధంగా ఒకసారి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఒక దఫా శాసనమండలి సభ్యుడుగా కూడా పని చేసినా ఎన్నడూ ఏ రాజకీయ పార్టీలలోనూ లేడు, రాజకీయ నిర్మాణంలో కూడా లేడు. మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేయడం తాను రాజకీయాల్లో చేసిన మొదటి, ఆఖరి తప్పని తన జీవిత చరిత్రలో చెప్పుకున్నాడు కూడా. తదాదిగా తనను తాను అతిస్పష్టంగా నిర్వచించుకున్న కాళోజీ పూర్తిగా అనితరసాధ్యమైన మార్గంలో చివరిశ్వాస వరకు ప్రజలపక్షం వహిస్తూనే తాను ఎవరినీ అనుకరించకుండా తనదైన సరళగంభీర శైలిలో, తనను ఎవరూ అనుకరించలేని ఎవరికీ సాధ్యంకాని తనదే ఐన తెలంగాణ స్వచ్ఛ నుడికారంతో, పలుకుబడితో తన విశిష్టమైన సాహిత్య దృక్పథాన్ని తను ఎంతో గాఢ తాత్వికతతో అనువదించిన ఖలీల్ జిబ్రాన్ మూల వస్తుతత్వాన్ని ఇట్లా చెప్పాడు కాళోజీ. 'నేను జీవనాన్ని, జీవనదాన్ని, నేను ప్రస్తుతాన్ని, నిన్నటి స్వప్నాన్ని, రేపటి జ్ఞాపకాన్ని, గతానికి శిఖరాన్ని, భావికి ఆధారాన్ని,- నేను గతిని, ప్రస్తుతాన్ని, ఉన్నదాన్ని, బ్రతికున్నదాన్ని, గతాన్ని స్వగతంగా గలదాన్ని, భావిని స్వభావంగా గలదాన్ని' ఇది కాళోజీ మూల తత్వం.

1940 లలో ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సంస్థానంలో 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ', 'ఈ నిజాం రాజు జన్మజన్మల బూజు' అంటూ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న దాశరథి ఉద్యమ సహచరుడుగా కాళోజీకి సన్నిహితుడయ్యాడు. నిజాం రాచరిక పాలనకు, రజాకార్ల పైశాచిక కృత్యాలకు స్పందించి కాళోజీ రాస్తున్న గేయాలను ప్రచురించి ప్రజలకు పంచాలనే ప్రయత్నంలో భాగంగా కాళోజీ కవితలకు ప్రజాబాహుళ్యంలో అప్పటికే ప్రజాదరణ పొందిన కవితలను కూర్చి దేశోద్ధారక గ్రంథమాల తరపున 1953లో ఆలంపురం సభలో శ్రీశ్రీ చేత ఆవిష్కరింపజేశారు. అదే కాళోజీ మొట్టమొదటి కవితా సంపుటి 'నా గొడవ'. కావ్యావిష్కరణ చేస్తూ శ్రీశ్రీ 'యుద్ధంలో ఫ్రాన్స్ కవులంతా చెల్లాచెదురుగా పారిపోతే లూయీ అరగాన్ ఒక్కడే దేశంలో నిలబడి మహాప్రజా విశ్వాసాన్ని వెల్లడించే గీతాలు రాశాడు. కాళోజీ లూయీ అరగాన్ వంటివాడు, తెలంగాణ మూగజీవుల హృదయాల్ని ప్రతిబింబింపజేశాడు' అని ప్రశంసించాడు.

ఇదే పరంపరలో కాళోజీ 'నేనూ - నా గొడవ' శీర్షికన నా గొడవ సంపూర్ణ కవితల సంపుటి వెలువడినప్పుడు 2-9-2001 న ఒక ప్రవేశిక రాస్తూ అన్నాడు 'జరిగినదంతా చూస్తూ ఎరగనట్లు పడిఉండగ సాక్షీభూతుణ్ణిగాను. సాక్షాత్తూ మానవుణ్ణి' అని నా గొడవలో చెప్పుకున్నా. అగో ఆ మానవుణ్ణి కాబట్టే చుట్టుపట్ల జరిగే ప్రతి విషయానికి స్పందించడం, ఆలోచన- అసమ్మతి, నిరసన- ధిక్కారం, ప్రతిఘటన, ప్రతి ఘటనా కార్యక్రమం. నేననుకున్న అవకతవకలను సవరించే ప్రయత్నం. నా వలెనే అవకతవకలను సవరించే వారితో సహకరించే ప్రయత్నం. ఎవరితోనూ సంపూర్ణంగా ఏకీభవించకపోవడం- మరెవరూ నాతో ఏకీభవించకపోవడం- నాకనిపిస్తుంది- ఒకరితో ఏకీభవించే ధోరణికన్నా ఒకరిని మనతో ఏకీభవింపజేయాలన్నదే పరస్పర సహకారానికి గొప్ప లోటేమోనని. ఇంతకూ మనస్సేమో క్షణమో తీరున మారి రకరకాలుగా ఆడిస్తున్నది. దాన్ని అచలం చేసే నా ప్రయత్నం ఎప్పుడూ ఫలించలేదు. ఈ 'నా గొడవ' మొదటి సంపుటి వెలువరిస్తున్న నాటికి ఒక విలక్షణమైన, అతి స్పష్టమైన ఆలోచనా ధోరణి ఉంది కాళోజీకి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు సమైక్య రాష్ట్రానికి మద్దతు తెల్పిన కాళోజీ తర్వాత తర్వాత వలసపాలకుల చేత జరుగుతున్న దోపిడీని ఎప్పటికప్పుడు ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి అర్థం చేసుకున్నాడు. 'ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావ' కాంక్షను రగిల్చే రాజకీయ బాధ్యతను భుజానికెత్తుకున్న ఆద్యులలో ప్రప్రథమ వ్యక్తి కాళోజీ. 1969లో తెలంగాణ తొలి ఉద్యమ నిర్మాణంలో కాళోజీ పాత్ర గణనీయమైంది. అప్పుడు ఆవిర్భవించిన తెలంగాణ ప్రజా సమితి వరంగల్లు మహానగరంలో 1-5-1969న నిర్వహించిన ప్రజాసభలో కాళోజీ మహాగ్రహంతో చదివిన కవిత 'ప్రాంతం వాడే దోపిడీ చేస్తే...' ఆ కవితలో అంటాడు. 'దోపిడి చేసే ప్రాంతేతరులను/ దూరం దాకా తన్ని తరుముతం/ ప్రాంతం వాడే దోపిడి చేస్తే/ ప్రాణంతోనే పాతర వేస్తం..' అని. అది నిప్పులను నింగినిండా విరజిమ్మిన ఉద్యమ కవిత. తెలంగాణ సాధనలో ఈ కవిత వహించిన పాత్ర మహోన్నతమైంది. ఒక్క ఆలోచన, ఒక్క విలువైన మార్గదర్శక సూత్రం మనిషి జీవితాన్నే మార్చగలదు అంటానికి కాళోజీ నాకు దానం చేసిన ఒకే ఒక అమృతవాక్యం నిజంగానే నా జీవితాన్ని నిర్మించింది. అది-

'తొలగి తోవ ఎవడిచ్చు- త్రోసుకొని పోవలయు
బ్రతుకు పోరాటము- పడకు ఆరాటము' (బ్రతుకు- 1951)

'థింక్ డిఫరెంట్లీ' అని అంటాడు ప్రపంచ ప్రసిద్ధి చెందిన అమెరికన్ వ్యక్తిత్వ వికాస గురువు స్టీఫెన్ ఆర్ కోవె. కోవె లాంటి ఆధునిక వ్యక్తిత్వ నిర్మాణ నిపుణులు, తాత్విక చింతనాపరులకంటే ముందే.. ఎప్పుడో అత్యంతాధునిక ఆలోచనలతో భిన్నంగా కవిత్వం రాసి, భిన్నంగా పోరాడి, భిన్నంగా జీవించి.. చివరికి భిన్నంగా మరణించినవాడు కాళోజీ (మరణానంతరం తన భౌతికకాయాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అధ్యయనార్థం ఇవ్వడం 2002లో ఎంతో భిన్నమైన నిర్ణయమే). కాళోజీ చూపు వేరు, దృష్టి వేరు.. చింతన వేరు.. జీవితం వేరు. ప్రశ్నించడం, ధిక్కరించడం, అధిక్షేపించడం, అవసరమైనపుడు విప్లవించడం, ప్రతిఘటించడం... ఇవన్నీ ఆయన జీవితంలో నిత్యకృత్యాలై సాగిన జీవక్రియలు. ఇవే ఆయన జీవన శైలి. వీటన్నింటినీ మించి 'ఆర్ద్రత' నిండిన హృదయంతో వెన్నవలె కన్నీరై కరిగిపోవడం ఆయన స్వచ్ఛమైన మానవతకు నిదర్శనం. కదిలిస్తే కన్నీరై కాళోజీ ప్రవహించిన సందర్భాలు కోకొల్లలు. అధిక వయసుతో, నేపథ్యాలతో, ఇతరేతర పరిగణనలతో సంబంధం లేకుండా 'మనుషులందరితో' నీళ్ళలో నీళ్ళవలె కలిసిపోయి జీవించడం ఒక్క కాళోజీకి మాత్రమే సాధ్యమైంది.

తన 'స్వగతం' కవితలో నమోదు చేసుకున్నట్టే,

'అతిథివోలె వుండి వుండి/ అవని విడిచి వెళ్ళుతాను/ పల్లె పట్టణంబులనక
పల్లెలై తిరిగినాను / మురికిపేట నడుమనున్న / ఇరుకులలో యిరికినాను
కూటిపేద తన కబళము/ నోటికీయ గుడిచినాను
....
అతిథివోలె వుండి వుండి / అవని విడిచి వెళ్ళుతాను-'

అని ప్రశాంతంగా నిష్క్రమించిన ప్రజాకవి కాళోజీ ఈ దేశ సంపద. ఆయన శాశ్వతుడు.

• రామా చంద్రమౌళి
కాళోజీ అవార్డ్ గ్రహీత

(సెప్టెంబర్ 9: కాళోజీ 110వ జయంతి)



వరద ప్రాంతాల్లో ఫైర్ ఇంజిన్ పైపులతో బురదను శుభ్రం చేస్తున్న మంత్రి పార్థసారథి

పారిశుధ్య పనులు వేగవంతం



వరదలో ట్రాక్టర్లపై నుంచి బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

బురదను తొలగించి ఇళ్లను కడిగించే పనిలో సుమారు 100కు పైగా ఫైరింజన్లు నిమగ్నమయ్యాయి. విజయవాడ వన్‌టౌన్, అజిత్‌సింగ్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఇవి పనిచేస్తున్నాయి. 100కుపైగా పెద్ద ఫైరింజన్లు, 10 చిన్న ఫైర్ ఇంజన్ల ద్వారా 110 పోర్టబుల్ పంపులను ఉపయోగించి ఇళ్లను శుభ్రపరుస్తున్నారు. ప్రతి డివిజన్‌కు ఒక ఫైరింజన్‌ను కేటాయించారు. ఒక్కో ఇంటిని శుభ్రం చేసేందుకు 20 నిమిషాల వరకు పడుతోంది. ప్రతి అగ్నిమాపక వాహనానికి 12 మందితో కూడిన బృందం ఉంటుంది. ఇందులో ఫైర్ ఇంజన్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, వైద్యులు ఉంటారు.



కబేలా రోడ్డులో వరద నీటిలో బ్లీచింగ్



ఇంకా వరద గుప్పెట్లోనే పాయకాపురం

కళ తప్పిన చవితి

ఏటా 100 వరకు పందిళ్లు • ఈసారి వరదనీటిలో వీధులు

ఒకప్పుడు వినాయకచవితి ఉత్సవాలకు పేరొందిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఈ సారి కళ తప్పింది. ఏటా 100 చవితి పందిళ్లు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం విజయవాడ పశ్చిమలో దూండీ విగ్రహాన్ని 72 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేస్తున్నారు. పందిళ్ల నిర్వాహకుల ఆశలపై బుడమేరు నీళ్లు చల్లడంతో వేలాది రూపాయలతో విగ్రహాలను ఆర్డర్ చేసినవారు రద్దు చేసుకున్నారు. 65వ డివిజన్‌లో టీడీపీ నేత కె.రవికుమార్ భారీ విగ్రహం కోసం అడ్వాన్సుగా రూ.20 వేలు చెల్లించారు. ఈలోగా వరద ముంచేయడంతో ఆర్డర్ రద్దు చేసుకుని అడ్వాన్సు వదులుకున్నారు. సింగనగర్‌లోని చాలా డివిజన్లలో ఇదే పరిస్థితి.

- విజయవాడ - ఆంధ్రజ్యోతి



వరదలోనే ఏర్పాటైన భారీ వినాయక విగ్రహం



డాబా కొట్లు సెంటర్‌లో ఆహార బాక్సుల పంపిణీ



అమ్మ కళ్యాణ మండపంలో వివిధ రకాల ఆహార పదార్థాలను కలిపి ప్యాకెట్లుగా సిద్ధం చేయిస్తున్న నగరపాలక సంస్థ



కొండపల్లి నుంచి కవులూరు వెళ్లే రహదారికి దగ్గర్లో బుడమేరు కాలువకు పడిన గండ్లను పూడ్చుతున్న అధికారులు

ఇంటింటికీ నిత్యావసరాలు..

శనివారం వినాయకచవితి పండుగ ఉండటంతో వరద బాధిత ఇళ్లలో ఆకలి ఉండకూడదన్న ఉద్దేశంతో శుక్రవారమే నిత్యావసరాల కిట్లను పెద్దఎత్తున పంపిణీ చేశారు. వీటిలో 25 కేజీల బియ్యం, 2 కేజీల ఉల్లిపాయలు, 2 కేజీల బంగాళాదుంపలు, ఒక కేజీ పంచదార, లీటరు పామాయిల్, చింతపండు ఉన్నాయి.



ఎంకే బేగ్ స్కూల్ రోడ్డులో వరద సాయం

వరద విఘ్నాల్లోనే..

నగరంలో వెంటాడుతున్న వరద కష్టాలు

జిల్లాలో మెరక ప్రాంతాలు చవితి పందిళ్లతో, వినాయక విగ్రహాలతో పండుగ చేసుకుంటుంటే నగరంలోని దాదాపు సగ భాగం ఇంకా వరద విఘ్నాల్లో చిక్కుకొని విలవిల్లాడుతోంది. అజిత్‌సింగ్ నగర్, కండ్రిగ, విద్యాధరపురం, లేబర్ కాలనీ తదితర ప్రాంతాల్లో వరద ముప్పు వెంటాడుతూనే ఉంది. గురువారం ఉదయం నాటికి తగ్గుముఖం పట్టిన వరద అనంతరం మళ్లీ పెరుగుతూ వచ్చింది. శుక్రవారం ఉదయం నాటికి కొన్ని ప్రాంతాల్లో 2 అడుగులు మేర వరద నీరు పెరిగింది. దీంతో అప్పటికే ఇళ్లను శుభ్రం చేసుకున్న వారు మళ్లీ వరదనీరు వచ్చి చేరడంతో దిక్కుతోచని స్థితిలో ఇళ్లకు తాళం వేసి బంధువుల ఇళ్లకు వెళ్లిపోతున్నారు. కొందరు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఇచ్చే ఫుడ్ ప్యాకెట్లతో కడుపు నింపుకుంటూ తమ ఇళ్లలోనే ఉన్నారు.

- విజయవాడ - ఆంధ్రజ్యోతి

- సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం
- తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్న బుడమేరు
- ఇళ్లను శుభ్రపరిచే పనిలో 100 ఫైరింజన్లు
- వరదలో డ్రోన్లతో బ్లీచింగ్ జల్లుతున్న సిబ్బంది
- ఇంటింటికీ చేరుతున్న నిత్యావసరాల కిట్లు



నిత్యావసర సరుకుల పంపిణీకి బీఆర్‌టీఎస్ రోడ్డులో సిద్ధమైన లారీలు, పీడీఎస్ వాహనాలు



చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ రోడ్డులో లారీల్లో పంపిణీకి సిద్ధమైన ఆహారం తదితరాలు



ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న యూపీహెచ్‌సీ వైద్యులు



సింగ్‌నగర్‌లో ఆహారం కోసం వరద బాధితుల క్యూ

డ్రోన్ల ద్వారా యాంటీ ల్యార్వా ఆపరేషన్

సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రోజుల తరబడి వరద నీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉందన్న ఉద్దేశంతో యాంటీ లార్వా ఆపరేషన్‌కు వీఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. పారిశుధ్య సిబ్బందితో మారుమూల ముంపు ప్రాంతాల్లోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో దీని కోసం డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. శుక్రవారం సింగ్‌నగర్, కండ్రిక, రాజీవ్‌నగర్, వాంబే కాలనీ, తదితర ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు.

వరదలో చిక్కుకున్నా విధులకు రమ్మంటున్నారు

వరదలో చిక్కుకుపోయిన శానిటేషన్ సిబ్బంది వరదలతో అన్నివిధాలా నష్టపోయిన తమను విధులకు హాజరుకావాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉంటున్న శానిటేషన్ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాబాకొట్ల సెంటర్‌లో డివైడర్‌పై కూర్చుని ఉన్న శానిటేషన్ ఉద్యోగులు మాట్లాడుతూ తాము, తమ కుటుంబసభ్యుల్లో కొందరు శానిటేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నామని ఈ వరదలతో ఇళ్లు పూర్తిగా మునిగి కట్టుబట్టలతో మిగిలామని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో తమను విధులకు హాజరుకావాలని వత్తిడి చేస్తున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొండా ఉమ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడతానని చెప్పారని తెలిపారు. తాము పూర్తిగా కోలుకునేంత వరకు వెసులుబాటు ఇవ్వావలని వారు కోరుతున్నారు.



ఇంకా వరదలోనే వాంబేకాలనీ..





వైఎస్సార్ కాలనీలో ఇలా..

చివరి ఇంటి దాకా సాయం అందడం లేదు



వరదతో ఇబ్బందులతో పడుతున్న మమ్మల్ని ప్రభుత్వం అన్నివిధాలా అదుకుంటూ అవసరమైనవన్నీ అందజేస్తోంది. మొదటి రెండు రోజులు ఇంటి వద్దకు రాకపోయిన తరువాత నుంచి ఆహారం, తాగునీరు, నిత్యవసర వస్తువులు వద్దకు వస్తున్నాయి. అధికారుల చివరి ఇంటి వరకు వెళ్లే విధంగా చర్యలు తసుకోవాలి.

- గోవిందయ్య, ఇందిరాగనర్ కాలనీ

తగ్గని వరద

- ప్రకృతి వైపరీత్యాల బారినపడిన జిల్లాగా ప్రకటించేందుకు ప్రతిపాదన : కలెక్టర్
- గన్నవరం మండలం కేసరపల్లిలో కేంద్రమంత్రుల పరిశీలన
- బుడమేరు ఉధృతిపై కలెక్టర్ బాలాజీ సమీక్ష

బాపులపాడు, పెడన మండలాల్లో మరింతగా పెరిగిన వరద నీరు



సింగ్‌నగర్‌లో వరదలో తడిసిపోయిన బియ్యం బస్తాలు

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : బుడమేరు ఉధృతి కృష్ణాజిల్లాను ఇంకా వీడలేదు. బుడమేరు పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లోని పంటపొలాల్లోకి శుక్రవారం వరదనీరు మరింతగా చేరడంతో పొలాల్లో, గ్రామాల్లో వరద నీటిమట్టం పెరిగింది. దీంతో ఐదురోజులుగా నీటమునిగిన పంటపొలాల్లోని వరిపైరు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. పొలాల్లో వరదనీరు పూర్తిస్థాయిలో తగ్గిన తరువాతనే పంటనష్టం అంచనాలను రూపొందించడానికి అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.


పరామర్శలు, పరిశీలనలు సమీక్షలు

గన్నవరం మండలం కేసరపల్లిలో వరదముప్పు కారణంగా నీటమునిగిన పంటపొలాలను కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఎమ్మెల్యే సుజనాచౌదరి, వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, కలెక్టర్ డీకే బాలాజీలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పంటలు కోల్పోయిన రైతులను ప్రధామంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు ఆదుకుంటారని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. ఏపీలో నెలకొన్న పరిస్థితులను ప్రధానమంత్రికి నివేదిక రూపంలో అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎంపీ పురంధరేశ్వరి, మంత్రి అచ్చెన్నాయుడు

- గుడివాడ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నీటిపారుదల, రెవెన్యూ విభాగం అధికారులతో కలెక్టర్ డీకె బాలాజీ శుక్రవారం సమీక్ష నిర్వహించారు.
- నందివాడ మండలం బుడమేరులో శుక్రవారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. పుట్టగుంట నుంచి ఒడ్డుకువస్తున్న బోటు... వంతెన రెయిలింగ్‌కు తగిలి ఇరుక్కుపోయింది. తక్షణమే స్పందించిన గజఈతగాళ్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం బోటును ఒడ్డుకుచేర్చారు.
- నందివాడ మండలంలోని 23 పంచాయతీల చుట్టూ వరదనీరు చుట్టుముట్టింది. కొల్లేరు ఎగదన్నడంతో వరదనీరు త్వరితగతిన దిగువకు పోవడం లేదు. పంటపొలాలు నీటిలోనే ఉండిపోయాయి. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మండలంలోని చినలింగాల, పెదలింగాల, చేదుర్తిపాడు, ఒద్దులమెరక పుట్టగుంట జనార్ధనపురం, నందివాడ గ్రామాల్లో పర్యటించారు.



బాపులపాడు మండలం ఓగిరాలలో నీటిలోనే మునిగి ఉన్న వరి పొలాలు..

- బాపులపాడు మండలం రామన్నగూడెం రంగయ్యప్పారావుపేట ఓగిరాల గ్రామాల్లో వరద ఉధృతి శుక్రవారం నాటికి మరింతగా పెరిగింది. గురువారం కన్నా రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. గ్రామాల్లో జనాన్ని పునరావాస కేంద్రాలకు తరలించారు.

పంటరుణాలను రీషెడ్యూల్ చేయండి : కలెక్టర్

భారీవర్షాలు, వరదల కారణంగా వరి,ఇతర పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకున్న రుణాలను రీషెడ్యూలు చేయాలని కలెక్టర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం బ్యాంక్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జిల్లాలో 15 మండలాల పరిధిలోని 62 గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయని, 20 గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశించిందని, 2.37 లక్షల మంది వరద ప్రభావం బారిన పడ్డారని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 37,724 హెక్టార్లలో వరి, 4,039 హెక్టార్లలో ఉద్యాన పంటలు, 55 హెక్టార్లలో మల్బరీ సాగుకు చెందిన పొలాలు నీటమునిగాయని తెలిపారు. ప్రకృతివైపరీత్యాల బారినపడిన జిల్లాగా కృష్ణాజిల్లాను ప్రకటించేందుకు రాష్ట్ర కమిటీ సిఫార్సు చేసిందని అన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

● మంత్రి కొలుసు పార్థసారథి





వరద ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి కొలుసు పార్థసారథి, కేసరపల్లిలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కృష్ణలంక, సెప్టెంబరు 6: విజయవాడలోని 32, 52 డివిజన్లలో శుక్రవారం మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించి బాధితులకు ఆహారం, పాలు పంపిణీ చేశారు. ఫైరింజన్ నీటితో పరిసరాలను శుభ్రం చేశారు. శానిటేషన్ నిరంతరం జరగాలని, కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. బాధితులకు అండగా ఉండాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని, మందులు, మెడికల్ కిట్లతో వైద్యబృందాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అమరావతి కాలనీ, సుందరమ్మ దిబ్బ, ఊర్మిలా నగర్ ప్రాంతాల్లో పర్యటించి ఆహారం, బిస్కెట్స్ మంచినీరు పంపిణీ చేశారు.

గుణదల: వరద నగర వాసులకు ఒక శాపమైతే చంద్రబాబు ఒక వరమని చెప్పక తప్పదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు అన్నారు. 4వ డివిజన్లోని వెంకటేశ్వరనగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో ఆయన ఫైరింజన్ల సాయంతో అపార్ట్‌మెంట్ సెల్లార్లలోని వరద నీటిని దగ్గరుండి తోడించారు. శుక్రవారం ఫైర్ డీజీపీ మాదిరెడ్డి ప్రతాప్ ముందుగా సెల్లార్లలో నీటిని, బురదను తొలగించడం ఒకేసారి జరిగేలా రూపకల్పన చేశారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పటమట ఫైర్ అధికారి నరేష్, ముమ్మనేని ప్రసాద్, కొల్లి వెంకట రమణ, ఘట్టమనేని నరసింహారావు, లయోల కళాశాల ప్రిన్సిపల్ కిషోర్, పిఆర్. జాన్ పాల్గొన్నారు.

వన్‌టౌన్: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన 58వ డివిజన్ పరిధి కృష్ణా హోటల్ సెంటర్, 59వ డివిజన్ పరిధి లూనా సెంటర్, డాబాకొట్లు సెంటర్ ప్రాంతాల్లో స్వయంగా ట్రాక్టర్‌పై పర్యటించి బాధితులను పరామర్శించారు. బాధితులకు పాలప్యాకెట్లు, మంచినీటి బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్, ఆహార ప్యాకెట్లు అందచేశారు. నేతలు ఎస్.కె.జాన్‌వలీ, బంగారునాయుడు, ఎస్.కె.పర్వీన్, ఎస్.కె.గౌసియా, ఎస్‌డి గౌసియా, డోలా జనార్ధన్ పాల్గొన్నారు.

కంకిపాడు: వరద కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని గుడవల్లిలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఇప్పటికే వరద తగ్గుమోహం పట్టిందని, తగ్గిన వెంటనే పంట నష్టం అంచనా వేయాలని అధికారులను కోరామన్నారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజ, టీడీపీ మండలాధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, బొర్రా వెంకట్, టీడీపీ, జనసేన సమన్వయ కర్త ముప్పా రాజా పాల్గొన్నారు.

జి.కొండూరు: జగన్ పత్రిక, చానెల్ వల్ల ప్రజలకు, రాష్ట్రానికి తీరని నష్టం జరుగుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ విమర్శించారు. బుడమేరు గండ్ల మరమ్మతు పనుల్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో పనిచేశానని 2019లో ఇదే ప్రాంతానికి వరదలు వచ్చాయని కొటికలపూడిలో తాతయ్య అనే వృద్ధుడు చనిపోతే 20 సార్లు కలెక్టర్‌కు ప్రతిపాదన చేసినా నేటికి పరిహారం రాలేదన్నారు. ఇప్పటి వరదల్లో కిలేశపురంలో చనిపోయిన లైన్‌మేన్ కోటేశ్వరరావుకు 48 గంటలు గడవ ముందే పరిహారం అందించామన్నారు. మృతిచెందిన మరో ఐదుగురికి నష్టపరిహారం చెక్కులు సిద్ధం చేశామన్నారు. ఈ పేపరు, చానెల్ చూసి మోసపోవద్దన్నారు.

ధర్నాచౌక్: విజయవాడలో ముంచెత్తిన వరదలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమే కారణమని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆరోపించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితిని జాతీయ విపత్తుగా ప్రకటించాల కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఏఐటీసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రవీంద్రనాథ్, జి.ఓబులేసు, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరసింగరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించాలని పిలుపునిచ్చారు. వివిధ రైతు సంఘాల నేతలు వైకేశవరావు, ఎం.కృష్ణయ్య, సింహాద్రీ ఝాన్సీ, చుండూరు రంగారావు, డాక్టర్ కొల్లా రాజమోహన్, డి.హరినాథ్, మరీదు ప్రసాద్, కాసాని గణేష్‌బాబు పాల్గొన్నారు.

గన్నవరం: ప్రస్తుత పరిస్థితిని జాతీయ విపత్తుగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు సంతోష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసరపల్లిలో ముంపునకు గురైన పంట పొలాలను శుక్రవారం సీపీఐ బృందం పరిశీలించింది. రాష్ట్రానికి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రావటం సంతోషమన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు.

సీపీఐ నేతలు అక్కినేని వనజ కేవీవీ ప్రసాద్, ఈశ్వరయ్య, జమలయ్య, ముక్కామల ఉమామహేశ్వరరావు, వెలగపూడి ఆజాద్, టి.తాతయ్య, దోనేపూడి శంకర్, పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి పాల్గొన్నారు.



ఉద్యోగులను అభినందిస్తున్న ఆర్టీసీ చైర్మన్ ద్వారకా తిరుమలరావు

ఆర్టీసీకి మరో అవార్డు

బస్‌స్టేషన్, సెప్టెంబర్ 6: ప్రవాస్ 4.0 రెడ్ బస్ పీపుల్స్ ఛాయిస్ - 2024 అవార్డును 2024 సంవత్సరానికిగాను రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా అధికారులు ఆర్టీసీ చైర్మన్ ద్వారకా తిరుమలరావును ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి (అడ్మిన్), చంద్రశేఖర్ (ఆపరేషన్స్), వి. సుధాకర్ (చీఫ్ ఇంజనీర్ ఐటీ) చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, ఐటీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించండి

భవానీపురం, సెప్టెంబరు 6: విద్యాధరపురం లేబర్ కాలనీ స్టేడియం గ్రౌండ్స్‌లో డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో పర్యావరణహితం కోరుతూ 72 అడుగుల మట్టితో తయారు చేయించిన విజయ గణపతి విగ్రహం ముస్తాబు పూరయ్యే దశకు చేరింది. శనివారం సాయంత్రం విగ్రహ తయారీ పూర్తిచేసి, సందర్శనకు అనుమతిస్తామని నిర్వాహకులు రాకేష్ తెలిపారు.

మట్టి వినాయకుడినే పూజించండి: ఎమ్మెల్యే బొండా

సత్యనారాయణపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలతో పూజలు జరుపుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు, వీర్ల పవన్‌కుమార్, జమ్మి కిరణ్, డి.సాయి. మనీష్, చందు, గుర్రం సుబ్బారావు పాల్గొన్నారు. 27వ డివిజన్ బావాజీపేటలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ జరిగింది. జయరాజ్, కొండపల్లి రూప్‌కుమార్, బెవర వెంకట్రావు, బండారు కొండ, రఘు పాల్గొన్నారు.

కృష్ణలంక: కృష్ణలంక మెట్లబజారులోని శ్రీ వాసవి సేవా సంఘం ఆవరణలో శుక్రవారం ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల గురునాథం, పి.అశోక్‌కుమార్, పాదర్తి విజయ్ గణేష్ పాల్గొన్నారు.

విజయవాడ కల్చరల్: ప్రకృతి పరిరక్షణకు కృషి చేస్తున్న బాల సుబ్రహ్మణ్య సాయిరామ్, వినాయక చవితి సందర్భంగా ప్రజలకు మట్టి వినాయకుడి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. మొగల్రాజపురంలోని మొఘల్ ఫంక్షన్ హాల్ ఎదురురోడ్డులోని రేణుక ఎన్‌క్లేవ్ వద్ద 500 మందికి మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా అందచేశారు. రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ అంజనేయులు, మహిళా వ్యాపారవేత్త అనంతవల్లి, నాగసుప్రజ, సత్యసుప్రజ పాల్గొన్నారు

విజయవాడ: పర్యావరణానికి మేలు చేసే మట్టిగణపతి విగ్రహాలను జనసేన పార్టీ పంపిణీ చేసింది. పార్టీ వీరమహిళ కృష్ణా,పెన్నా రీజనల్ కో-ఆర్డినేటర్ రావి సౌజన్య ఎన్టీఆర్ సర్కిల్‌లో శుక్రవారం సాయంత్రం మహిళలకు ఈ విగ్రహాలను పంపణీ చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతిరెడ్డి అనిత, 9వ డివిజన్ అధ్యక్షురాలు సుజాత, 11వ డివిజన్ అధ్యక్షుడు ఇనుగంటి హరీష్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ 5.87 కోట్ల వరద సాయం

సీఎంకు అందజేసిన సీజీఎం రాజేష్ కుమార్ బృందం

లబ్బీపేట, సెప్టెంబరు 6: వరదలతో సర్వం కోల్పోయిన ప్రజలను ఆదుకునేందుకు స్టేట్ బ్యాంక్ రూ.5కోట 87 లక్షల 10




ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న స్టేట్ బ్యాంక్ ప్రతినిధులు

24 చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పటేల్, జీఎం శైలేష్ కుమార్ ఈ మొత్తాన్ని సీఎంకు అందజేశారు. వరద బాధితుల సహాయ చర్యల్లో భాగంగా అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారుల సహకారంతో 44.5 లక్షల విలువైన ఆహారం, వాటర్ బాటిళ్లు అందజేశామన్నారు. బ్యాంక్ అధికారులు మనీశ్ కుమార్ సింగ్, రాహుల్ సాంకృత్య, తుల శ్రీనివాస్, విశ్వనాథ్, వీఎస్ ఆర్ శేఖర్, ఎం.సునీల్ పాల్గొన్నారు.









శ్రీభవిష్య రూ.3 లక్షల విరాళం

పెనమలూరు: టీచర్స్‌డే సందర్భంగా శ్రీభవిష్య జూనియర్ కళాశాల యాజమాన్యం, సిబ్బంది కలిసి వరద బాధితులకు తమ వంతు సాయంగా ఒక రోజు జీతం రూ.3లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు రూ.3లక్షల చెక్కును గురువారం అందజేశారు. అనుమోలు ప్రభాకరరావు పాల్గొన్నారు. స్థానిక పోరంకికి చెందిన తోటకూర రాజానంద్ రూ.2లక్షల చెక్కును సీఎం సహాయనిధికి విరాళంగా అందజేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు సదరు సహాయ చెక్కును అందించారు.

సర్వోదయ ట్రస్టు విరాళం

విజయవాడ లీగల్: స్వాతంత్ర్య సమరయోధుల పక్షాన సర్వోదయ ట్రస్ట్ ప్రతినిధులు నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు రూ.1.5 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ జీవీ మోహన్‌ప్రసాద్, ట్రస్టీ మట్టా జయకర్ అందజేశారు.

మృతుల కుటుంబాలకు సీఎం సాయం

గుణదల: బుడమేరు ముంపు వస్తుందని భావించిన కొల్లిపర వెంకటేశ్వరరావు (పిచ్చియ్య), కుమారుడు సాయి సందీప్ తమ గేదెలను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నంలో ఆదర్శకాలనీ వద్ద వరదనీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఆదేరోజు సోమవారం సాయంత్రానికి వారి మృతదేహాలను గుణదల సీఐ గుర్తించి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. వీరికి ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ చెక్కులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు గుణదల విజయ్‌నగర్ కాలనీలోని బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. కార్పొరేటర్ సాంబశివరావు పాల్గొన్నారు.

కృష్ణలంక: వరద ముంపు ప్రభావంలో గేదెల కోసం వెళ్లి వరదల్లో చిక్కుకొని మరణించిన కృష్ణలంక 22వ డివిజన్ సతీష్ కుమా ర్ రోడ్డుకు చెందిన పోలిశెట్టి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు రాష్ట్రప్రభుత్వం అందించిన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బాధితుల ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు.

వన్‌టౌన్: వరదల్లో మరణించిన 62వ డివిజన్ ఉడా కాలనీకి చెందిన మల్లిపాముల వర్ధన్, సింగ్‌నగర్‌కు చెందిన గుంజ రమణ, 63వ డివిజన్ రాజీవ్ నగర్‌కు చెందిన కర్రి భారతి, ఎం.సన్యాసి అప్పల నాయుడు కుటుంబాలకు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) శుక్రవారం బొండా కార్యాలయంలో రూ.5లక్షల చెక్కులను అందజేశారు. తహసీల్దార్ చింత శిరీషా దేవి, టీడీపీ నేతలు గంటా కృష్ణామోహన్, లబ్బా వైకుంఠం, కనకారావు, దాసరి దుర్గారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఆర్థికసాయం అందిస్తాం





సరుకులు పంపిణీ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, మంత్రులు నాదెండ్ల, అచ్చెన్న హోమియో మందులు అందజేస్తున్న వైద్యురాలు

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, సెప్టెంబర్ 6: వరద బాధితులను అన్ని విధాల ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని, వరద బాధితుల ప్రతి ఇంటికి ఆర్థిక సహాయంతో పాటు చిరు వ్యాపారులకు లబ్ధి చేకూర్చుతామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఈ మేరకు బ్యాంకర్లతో మాట్లాడినట్టు వి వరించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యం లో వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులను తరలింపు వాహనాలకు బీఆర్‌టీఎస్ రో డ్డులోని సంగీత కళాశాల జంక్షన్ వద్ద శుక్రవారం మంత్రులు నాదెండ్ల మనోహర్ కందుల దుర్గేష్, అచ్చెన్నాయుడుతో కలిసి ప్రారంభించారు.బాధితులకు నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను అందచేస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబుతో పాటు అధికారులందరూ ఆ రు రోజులు గా 20 గంటలపా టు పనిచేస్తున్నారని, అందుకే బాధితులకు సహాయక చర్య లు త్వరగా అందుతున్నాయన్నారు. బురదను తొలగించేందుకు 300 ఫైరింజన్లు పనిచేస్తున్నాయన్నారు.

శుక్రవారం వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు జేవీఆర్ హెల్పింగ్ ఫౌండేషన్ కన్వీనర్, జేవీ రెడ్డి, వేముల చారిటీస్ చైర్మన్ వేముల హజరత్తయ్య గుప్తా దుప్పట్లు, బిస్కెట్లు అందచేశారు. పి.తిరుమలరావు, జేవిఎస్ ఎకేరెడ్డి, జి.హరి, ఈ.వి.రెడ్డి, పాల్గొన్నారు.

8వ ఆంధ్ర ఎయిర్ వింగ్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థులు బాధితులకు దుప్పట్లు, అల్పాహారం, భోజనం, బిస్కె ట్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కమాండింగ్ ఆఫీసర్ అజిత్‌సింగ్ రాఠీ, జూనియర్ వారెంట్ ఆఫీసర్ సురాజ్ పాల్గొన్నారు.

విజయవాడ స్పోర్ట్స్: తాడిగడపలోని ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ ఆ ధ్వర్యంలో అకాడమీ డైరెక్టర్ నాగిశెట్టి సుబ్రహ్మమణ్యేశ్వరరావు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రుల ఆర్థిక సాయంతో పెద్దపులిపాక, యనమలకుదురు, రామలింగేశ్వరనగర్, కృష్ణలంకలకు భోజనం, తాగునీరు, బియ్యం, దుప్పట్లు, బట్ట లు, ఒడోమాస్ బాక్సులను వితరణ చేశారు.

వన్‌టౌన్: హిందూస్థాన్ కోకాకోలా బేవరేజెస్ కట్టుబడి ఉందని సంస్థ చీఫ్ పబ్లిక్ వ్యవహారాలు, కమ్యూనికేషన్స్, సస్టైనబులిటీ ఆఫీసర్ హిమాన్షు ప్రియదర్శి వరద బాధితులకు వెయ్యి మిల్లీ లీటర్ల పరిమాణం కలిగిన 60 వేల కిన్లీ వాటర్ బాటిళ్లను అందజేసేందుకు సంబంధిత లేఖను శుక్రవారం ఆయన మంత్రి లోకేష్‌కు అందించారు. ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ వి.వెంకట రమణ, అదనపు డైరెక్టర్ టి.ఉదయకుమార్, కో-ఆర్డినేటర్ టి.అన్నమ్మ పాల్గొన్నారు.

విద్యాధరపురం: భవానీపురం, 45వ డివిజన్ ఏకలవ్యనగర్‌లో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, యువనేత భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి శుక్రవారం పర్యటించి వరద బాధితులకు భూమా శోభానాగిరెడ్డి ట్రస్ట్ తరఫున నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

తిరువూరు: స్థానిక విలేకరులు శుక్రవారం ప్రత్యేక వ్యానులో ఆహారం పంపించారు. ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు ప్రత్యేక వాహనంలో ఆహారం, వాటర్ తీసుకెళ్లారు.

ఏపీ మీడియా ప్రొఫెషనల్ అసోషియేషన్ ఆ ధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం 50 కేజీ ల బియ్యన్ని ఎంపీడీవో పివిఎస్ నాగేశ్వరరావుకు శుక్రవారం అందజేశారు. సీజర్ వ్యాధులు ప్రబకుండా 8వ వార్డులో శుక్రవారం హోమియో మందులు పంపిణీ చేశారు,

గన్నవరం: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ శాఖ చైర్మన్ ఎ.నాగమల్లేశ్వరరావు ఉంగుటూరు మండలం బుడమేరు వర ద ముంపులో చిక్కుకున్న ప్రజలకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ శాఖ ఆధ్వర్యంలో ఆహారాన్ని పంపిణీ చేశారు. సభ్యులు తుమ్మల వెంకటేశ్వరరావు (చిన్న) ఎంఎస్ఆర్ కృష్ణా (త ణుకు), ఎస్.కోటేశ్వరరావు, తుమ్మల జగదీష్, బి .రాఘవరావు, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మాజీ సర్పంచ్ గూడపాటి తులసీమోహన్, ఎంపీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మణరావు పాల్గొన్నారు.

కంకిపాడు: ఈడుపుగల్లు గ్రామంలోని సీతారామాగార్డెన్స్ అధినేత నందమూరి విష్ణువర్ధనరావు ఆధ్వర్యంలో సుమారు రూ.6 లక్షల విలువైన నిత్యావసరాలతో కూడిన లారీని శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు.

విజయవాడ కల్చరల్: సంస్కార భారతి సంస్థల సంయుక్త అధ్వర్యంలో వరద ప్రాంతాల్లో నష్టపోయిన పే ద కళాకారులకు ఆర్థిక సహకారం అందించింది. 30 మం ది కళాకారులకు రూ.3వేల చొప్పున నగదు పంపిణీ చేశా రు. రామలింగేశ్వరపేట ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యాలయం హైందవిలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి దుర్భా శ్రీనివాస్ పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణ, సంస్కార భారతి సహ ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్, కటారి వినయ్ కుమార్, వజ్జల శశాంక గణేష్, పీఎల్‌కే సత్య శ్రీ ఉమామహేశ్వరరావు, క ప్పగంతు రామకృష్ణ, అఫ్జల్ భాషా, శేఖర్, శారద సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, సత్య నారాయణరెడ్డి, కళాహూర్దారావు, పాల్గొన్నారు.

ఎటువంటి రహస్య కెమెరాలు లేవు

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ వెల్లడి

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 05 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలోని వాష్ రూమ్స్‌లో హిడెన్ కెమారాలు ఉన్నాయనీ, మూడు వందల వీడియోలు ఉన్నాయని వచ్చిన అభియోగాల దృష్ట్యా ముగ్గురు ఐజిల బృందం చేసిన ఫిజికల్ ఇన్వెస్టిగేషన్‌లో అక్కడ ఎటువంటిస్పై కెమారాలు, వీడియోలు ఆధారాలు లభించలేదని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ గురువారం రాత్రి గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌ల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇన్వెస్టిగేషన్ లో అప్‌డేట్స్‌ను ప్రజలకు తెలపాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రెస్ మీట్ ఏర్పాటు చేశామని వదంతులను నమ్మొద్దని విద్యార్థులు తల్లితండ్రులు ధైర్యంగా ఉండాలని అశోక్ కుమార్ చెప్పారు. హాస్టల్‌లోని మూడవ ఫ్లోర్‌లోని వాష్ రూమ్స్‌లో కెమెరాలు పెట్టారని అభియోగం వచ్చిన వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. అన్ని బాత్‌రూమ్స్‌లో అణువణవు గాలించామనీ ఎక్కడా ఎటువంటి కెమెరాలు అభించలేదన్నారు. విద్యార్థులను, హాస్టల్‌లో పనిచేసే అన్ని స్థాయిల సిబ్బంది విచారించమన్నారు. కాగా తమ కెమెరాలు కానీ, ఆరోపిస్తున్న వీడియోలు కానీ ప్రత్యక్ష్యంగా చూసినట్టు ఏ ఒక్కరూ చెప్పలేదని డిఐజి చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు సంబంధించిన 14 సెల్‌ఫోన్‌లు, 6 లాప్‌టాప్స్ ఒక టాబ్‌ను సీజ్ చేశామని ఆయన చెప్పారు. ఇప్పటివరకూ తాము చేసిన ఇన్వెస్టిగేషన్‌లో ఎటువంటి స్పై కెమారాలు, వీడియోలు లభించలేదని, ఇంకా టెక్నికల్ టీమ్ ఇన్వెస్టిగేషన్ జరుగుతోందని వారి విచారణ అనంతరం పూర్తిస్థాయి వివరాలు వెల్లడి చేస్తామని చెప్పారు.

యాజమాన్యానికి పలుసూచనలు చేశాం

విద్యార్థుల భవిషత్ దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం త్వరలో క్లాసులు పునః ప్రారంభిచాలని ప్రయత్నాలు చేస్తున్నారు.























అండగా ఉంటాం

బుడమేరు ముంపు ప్రాంత ప్రజలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము భరోసా


వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ / గుడివాడ, సెప్టెంబరు 6 : నందివాడ మండలంలో గత ఐదు రోజులుగా బుడమేరు ఉధృతంగా ప్రవహించి నీటిముంపులో గ్రామాలు ఉన్న విషయాన్ని అమెరికాలో ఉన్న వెనిగండ్ల రాము తెలుసుకుని శుక్రవారం ఉదయం హడావిడిగా గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి డైరెక్ట్‌గా చిన్నలింగాల, పెద్దలింగాల, పుట్టగుంట, చేదుర్తిపాడు, ఒద్దులమెరక, జనార్ధనపురం, నందివాడ, తుమ్మలపల్లి గ్రామాలను పరిశీలించి వరద బాధితులను పరామర్శించారు. మీకు అండగా నేనున్నానని, ప్రభుత్వంనుంచి తగిన సహాయం అందేవిధంగా చర్యలు చేపడతానని తెలిపారు. వరద బాధితులకు జొన్నపాడు, తుమ్మలపల్లి, నందివాడ పలు గ్రామాల్లో ఎమ్మెల్యే రాము ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బుడమేరు వరదపై కలెక్టర్ సమీక్ష


లంకలకలవగుంటలో బంటుమిల్లి కెనాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గుడివాడ, సెప్టెంబరు 6 : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బుడమేరు మ్యాప్‌ను పరిశీలించి బుడమేరు వరద ప్రవాహం, తీసుకోవాలిసిన జాగ్రత్తలపై కలెక్టర్ బాలాజీ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పద్మావతి, ఇరిగేషన్ డీఈఈ సూర్యభరత్, నందివాడ ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లిక తదితరులు పాల్గొన్నారు.

పెడన రూరల్ : అధిక వర్షాలతో కాల్వలు పొంగి పొర్లుతున్నాయి సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలసి లంకలకలవగుంట వద్ద బంటుమిల్లి కెనాల్ గట్లను పరిశీలించారు. జడ్పీటీసీ అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, కట్టా సతీష్, ఆర్డీవో వాణి, ఇరిగేషన్ డీఈ భరత్ పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకుంటాం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా


దెబ్బతిన్న రేగేడు కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు : అధిక వర్షాలకు పంట నష్టపోయిన అన్నదాతలను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండల పరిధిలోని రాపర్ల క్లస్టర్‌లోని ఉండ్రపూడి, పోలవరం, జమీదగ్గుమిల్లి గ్రామాల్లో శుక్రవారం పంట దెబ్బతిన్న పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మండపాక శంకర్‌బాబు, తోట పోలాక్షి రాంబాబు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మట్టా వెంకటేశ్వరరావు, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, సందీప్ పాల్గొన్నారు. **వేల్పూరు(పమిడిముక్కల) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేల్పూరు- కనుమూరు రోడ్డులో కోతకుగురై దెబ్బతిన్న రేగేడు కాల్వ వంతెనను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శుక్రవారం పరిశీలించారు. టీడీపీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు తాడిశెట్టి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల దాతృత్వం

సీఎం సహాయనిధికి రూ. 50వేలు విరాళం


విరాళం డీడీని చూపిస్తున్న సూరపనేని పరంధామయ్య

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 6 : గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన సూరపనేని పరంధామయ్య విశ్రాంత ఉపాధ్యాయులు (87) ఆయన సతీమణి సూరపనేని నిర్మల (83) .వరదల్లో నష్టపోయిన ప్రజలతో పాటు సీఎం చంద్రబాబు పడుతున్న కష్టం టీవీల్లో చూసి చలించిపోయింది. భర్తను సీఎం సహాయ నిధికి రూ. 50 వేలు ఇవ్వమని కోరింది. భార్య అడిగిందే తడవుగా రూ. 50 వేలు డీడీ తీసి సీఎం సహాయ నిధికి పంపిచారు. అన్న క్యాంటీన్ నిర్వహణకు కూడా రూ. 50 వేలు ఇవ్వాలని భార్యభర్తలు సంకల్పించారు.

పెనుగంచిప్రోలు : రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీరామసత్యనారాయణ శుక్రవారం తిరుపతమ్మను దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణకు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి తిరుపతమ్మ దేవస్థానం ఉద్యోగుల ఒక రోజు వేతనం సుమారు రూ.77 వేలు డీడీని లీలాకుమార్ అందజేశారు.



ముంపు ప్రాంతాల పరిశీలన


కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య


జగ్గయ్యపేట రూరల్ : పాలేరు వరద ముంపునకు గురైన ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని బూద వాడలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టా వెంకట నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి, యానాల గోపీ చంద్, గడ్డం హుసేన్, శీలం లక్ష్మయ్య, తిరుపారావు, రవి, మోహన్ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు : భారీ వర్షాల వల్ల ముచ్చింతాల - పెనుగంచిప్రోలు రహదారి కొట్టుకు పోయిం ది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపో కలు నిలిచి పోయాయి. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) తాత్కాలిక మరమ్మతు పనులు ప్రారంభించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రైతులు ఆందోళన చెందొద్దు : మండలి

మోపిదేవి : వరదల కారణంగా దెబ్బతిన్న వాణిజ్య పంటలకు ఈ-క్రాఫ్ చేయక పోయినా ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం అందిం చేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని బొబ్బర్లంకలో పర్యటించారు. ఆయన వెంట అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



● త్రుటిలో తప్పిన ప్రమాదం



బుడమేరులో శుక్రవారం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. పుట్టగుంట నుంచి ఒడ్డుకు వస్తున్న బోటు వంతెన రెయిలింగ్స్‌లో బోటు అడుగు భాగం ఇరుక్కుపోయింది. తక్షణమే స్పందించిన గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందం సురక్షితంగా బోటును ఒడుకు చేరారు. - నందివాడ









వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి : ఆర్డీవో

నందిగామ, సెప్టెంబరు 6 : వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్డీవో రవీంద్రరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పందిళ్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.











ఉత్తర కోస్తాకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం నాటికి ఉత్తర, దానికి ఆనుకుని మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతోంది. ఇది ఈ నెల 9వ తేదీకల్లా ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్‌కు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుందని, తర్వాత మూడు రోజుల్లో ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ వైపు వెళుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావం వల్ల నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారడంతో శుక్రవారం ఉత్తర కోస్తాలో అనేక చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు పడ్డాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అనేక చోట్ల వర్షాలు... శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

వరదలతో 33 మంది మృతి

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా 33 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 25 మంది మృత్యువాత పడగా, గుంటూరు జిల్లాలో ఏడుగురు, పల్నాడు జిల్లాలో ఒకరు మరణించారు. ఎన్టీఆర్ జిల్లాలో గల్లంతైన ఇద్దరి ఆచూకీ తెలియరాలేదు. ఇదిలావుంటే, వరదలు, వర్షాల కారణంగా ప్రభుత్వ ఆస్తులకు భారీ నష్టం వాటిల్లింది. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం శుక్రవారం ఆయా వివరాలు వెల్లడించింది.

- రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీ రోడ్లు 3,813, మున్సిపల్ రోడ్లు 558.47, పంచాయతీ రోడ్లు 361 కిలో మీటర్లు చొప్పున దెబ్బతిన్నాయి. గ్రామీణ రోడ్లకు 44 చోట్ల గండ్లు పడ్డాయి. 17 కమ్యూనిటీ భవనాలు దెబ్బతిన్నాయి. తాగునీటి పథకాలు 40దెబ్బతిన్నాయి.
- 7 విద్యుత్ సబ్‌స్టేషన్లు, 33 కేవీ ఫీడర్లు 2, ఎల్‌టీ లైన్లు 673, డీటీఆర్‌లు 2,674, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 1,037, 11 కేవీ లైన్లు 44.5 కిలోమీటర్లు, ఎల్‌టీ లైన్లు 39.07 కిలో మీటర్లు చొప్పున దెబ్బతిన్నాయి.

శ్రీశైలానికి మళ్లీ పెరిగిన వరద

శ్రీశైలం, సెప్టెంబరు 6: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం జలాశయం ఆరు క్రస్టుగేట్లు ఎత్తి 1,67,076 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,49,437 క్యూసెక్కుల వరద వచ్చింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటినిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,515 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. వీటి ద్వారా, డ్యాం ఆరు క్రస్టుగేట్లు ఎత్తి మొత్తం 2.56 లక్షలను నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. సాగర్ గరిష్ఠ నీటి నిల్వ 312.05 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 310.55 టీఎంసీలు ఉంది. కాగా, వివిధ వాగులు,వంకల నుంచి ప్రకాశం బ్యారేజీకి 1.50 లక్షల క్యూసెక్కులు వస్తోంది.



వరద బాధితులకు నిత్యావసర వస్తువులు తీసుకెళ్లేందుకు బీఆర్టీఎస్ రోడ్డులో సిద్ధంగా ఉన్న వాహనాలు



మధురానగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



సింగ్‌నగర్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్

వరద బాధితులకు సరుకుల పంపిణీ షురూ

రేషన్, ఆధార్ లేకున్నా ఓకే.. ప్రతి కుటుంబానికీ ఉచితంగా బియ్యం సహా 6 రకాలు అందజేత

అమరావతి/విజయవాడ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వరద బాధితులకు నిత్యావసర సరుకుల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం శుక్రవారం ప్రారంభించింది. వరదలతో అతలాకుతలమైన ముంపు ప్రాంతాల ప్రజలకు ఆరు రోజులుగా సర్కారు నిరంతర సేవలు అందిస్తోంది. ఇక, ఇప్పుడు వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో మొత్తం 16 డివిజన్లలోని ముంపు ప్రాంతాల్లో ఉన్న 70 వేలకుపైగా కుటుంబాలకు 6 రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను ఉచితంగా అందిస్తోంది. పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 400 లారీల్లో ఈ సరుకులు శుక్రవారం ఉదయానికే విజయవాడకు చేరుకున్నాయి. వీటిని డ్వాక్రా సంఘాల మహిళలు గొల్లపూడి మార్కెట్ యార్డులో ప్యాకింగ్ చేసి కిట్లుగా రూపొందించారు. సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారులు ఈ కిట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి బాధిత కుటుంబానికి ఈ సరుకులు అందించాలని చంద్రబాబు ఆదేశించారు. దీంతో బాధితులకు చేరవేసేందుకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలతో పాటు పొరుగున ఉన్న జిల్లాల నుంచి కూడా 1,100 ఎండీయూ వాహనాలను విజయవాడకు తరలించారు. లారీల్లో తీసుకువచ్చిన బియ్యం బస్తాలు, సరుకులతో కూడిన కిట్లను వీటిలో నింపారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉన్న ఎండీయూ వాహనాలను శుక్రవారం మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేశ్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు ప్రారంభించారు. అనంతరం వాహనాలు వరద ముంపు ప్రాంతాలకు తరలి వెళ్లాయి.

వేలిముద్ర తీసుకుని

ప్రతినెలా రేషన్ కార్డుదారులకు సరకులు పంపిణీ చేస్తున్న తరహాలోనే ఇప్పుడు కూడా ఈ-పోస్ యంత్రాలలో వేలిముద్రలు వేయించుకుని ప్రభుత్వం ఉచితం సరుకుల కిట్లను పంపిణీ చేస్తోంది. రేషన్‌కార్డులు లేని బాధితులకు ఆధార్ కార్డులపై వీటిని అందజేస్తారు. రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు కూడా లేకపోయినా.. బాధితుల వివరాలు నమోదు చేసుకుని అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా, శనివారం పండుగ అయినప్పటికీ సరుకుల పంపిణీ కొనసాగనుంది.

ప్రతి కుటుంబానికీ అందిస్తాం: నాదెండ్ల

ఉచిత నిత్యావసర సరుకులు పంపిణీని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. "వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల్లో ధైర్యం, భరోసా నింపేందుకు ఉచితంగా నిత్యావసర సరుకులు అందచేసే కార్యక్రమం చేపట్టాం" అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకు పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి బాధిత కుటుంబానికీ ఈ సరుకులు అందేలా అధికారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కిట్‌లో ఉండేవి ఇవే!	
బియ్యం	25 కిలోలు
చక్కెర	కిలో
కందిపప్పు	కిలో
పామాయిల్	లీటరు
ఉల్లిపాయలు	2 కిలోలు
బంగాళా దుంపలు	2 కిలోలు



ఆంధ్రప్రదేశ్‌లోని వరద బాధితుల సహాయార్థం జాస్తి వెంకట్, సుధ కుటుంబం ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 కోట్ల భారీ విరాళం ప్రకటించింది. ఆ చెక్కును శుక్రవారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న దృశ్యం

వరద బాధితులకు జనసేన చేయూత

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరద బాధితులకు చేయూత నిచ్చేందుకు జనసేన ఎన్ఆర్ఐ, అమెరికా విభాగం ముందుకొచ్చింది. బాధితుల కోసం సిద్ధంచేసిన నిత్యావసర సరుకుల వాహనాలను ఎమ్మెల్సీ హరిప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. పెద్దపులిపాకలో 1,020 కుటుంబాలకు రూ.20 లక్షలు విలువైన నిత్యావసర కిట్లను అందించనున్నారు. ఒక కిట్‌లో 8 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, లీటర్ వంటనూనె, కిలో ఉప్పు, కారం, చింతపండు ఉన్నాయి. జనసేన ఎన్ఆర్ఐ విభాగాన్ని ఎమ్మెల్సీ అభినందించారు. వీరితో పాటు వరద బాధితుల సహాయార్థం పార్టీ కార్యక్రమాల కమిటీ కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు 400 చీరలు, 400 దుప్పట్లు 2 వేల బిస్కెట్ ప్యాకెట్లు సిద్ధం చేశారు.

దాతలూ... స్పందించండి

» లోక్‌సత్తా అధినేత జేపీ

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావానికి గురైన బాధితులకు సాయం అందించేందుకు లోక్‌సత్తా పార్టీ ముందుకొచ్చింది. వరద బాధితుల సాయం కోసం పార్టీ తరఫున ప్రత్యేక ఖాతాను ఏర్పాటు చేసినట్టు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ తెలిపారు. ఆర్థిక సాయం అందజేయాల్సిన బ్యాంకు వివరాలను ప్రకటించారు. విరాళాన్ని ఖాతా నంబరు: 62109369738б, ఐఎఫ్ఎస్సీ కోడ్.. ఎస్‌బీఐ ఎన్0020072, ఎస్‌బీఐ, పంజాగుట్ట, హైదరాబాద్ చిరునామాకు పంపాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



సింగ్‌నగర్‌లో సాయం కోసం క్యూ కట్టిన బాధితులు



వైఎస్సార్ కాలనీలో వరద బాధితులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



వైఎస్సార్ కాలనీలో వరద బాధితులకు మంచినీరు సరఫరా చేస్తున్న ట్యాంకర్లు







వరద బాధితులకు పంపిణీ చేస్తున్న వస్తువులు పాలు, నీరు, బిస్కెట్లు, యాపిల్స్.. ఇవి ప్రతి బాధితుడికి అందేలా ప్యాకింగ్ చేసి, రవాణా చేస్తున్న హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు, ప్యాకింగ్‌ను పర్యవేక్షిస్తున్న మంత్రి నారాయణ

ఆపన్నుల కోసం... పరిమళించిన మానవత్వం

» విరాళాన్ని ప్రకటించిన 'విద్యుత్తు' ఇంజనీర్లు, సిబ్బంది

» 12 కోట్లు ప్రకటించిన పోలీసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బెజవాడ దుఃఖదాయిని బుడమేరు విధ్వంసంతో తీవ్రంగా నష్టపోయి, విలవిలలాడుతున్న ప్రజల సహాయార్థం రాష్ట్రం నలుమూలల నుంచి దాతలు స్పందిస్తున్నారు. మేము సైతం అంటూ ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ప్రకటిస్తున్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును... కలసి విరాళాలను చెక్కు, నగదు రూపంలో అందించారు. ఒకరోజు మూల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ తీర్మానించింది. శుక్రవారం అసోసియేషన్ సెక్రటరీ జనరల్ కె.నాగప్రసాద్ ఈమేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలుగునాడు విద్యుత్ సంఘం కూడా ఒక రోజు మూల వేతనాన్ని ఇస్తామంటూ ముందుకు వచ్చింది. విద్యుత్తు సంస్థల తరఫున ఉద్యోగుల ఒకరోజు మూల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని, ఆమేరకు సీఎంఆర్ఎఫ్‌కు నిధులను జమ చేయడానికి జెన్కో ఎండీ, డిస్కమ్‌ల సీఎండీలు చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్ కో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.విజయానంద్ ఆదేశించారు.

ఖాకీల విరాళం 12 కోట్లు

సీఎం చంద్రబాబు స్ఫూర్తితో వరద బాధితుల సహాయక కార్యక్రమాల్లో పోలీసులు పాల్గొంటున్నారని ఆంధ్రప్రదేశ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనకుల శ్రీనివాసరావు, ఎండీ.మస్తాన్‌ఖాన్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య తెలిపారు. తమ ఒక రోజు మూలవేతనం రూ.12కోట్లును డీజీపీ ద్వారా సీఎంఆర్ఎఫ్ అందజేసినట్లు తెలిపారు.

కాటూరి.. రూ.10 కోట్లు, జాస్తి 5 కోట్లు

కాటూరి సుబ్బారావు రూ.10 కోట్లు, జాస్తి సుధ-వెంకట్ ఫ్యామిలీ రూ.5 కోట్లు, శ్రీచైతన్య, కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ ఛైర్మన్ కేవీరావు రూ.5 కోట్లు, ఏఎం గ్రీన్ కో సంస్థ రూ.5 కోట్లు, శ్రీకళ్యాణ చక్రవర్తి మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ రూ.2 కోట్లు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు రూ.1 కోటి, రవికుమార్‌రెడ్డి, సుజలాన్, యాక్సిస్ ఎనర్జీ తరఫున బపేశ్వరరావు రూ.1 కోటి, సీఎం రాజేశ్, సీఎం రిత్విక్ రూ.1 కోటి, ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.51 లక్షలు, మోహిత్ మినరల్స్ సంస్థ రూ.51 లక్షలు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబు రూ.50 లక్షలు, విజయవాడ క్లబ్ తరఫున సెక్రటరీ పీ చంద్రశేఖరరావు, శైలేజ్, రాజా రూ.50 లక్షలు, కళ్యాణ్ ఆక్వా అండ్ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ఇండియా లిమిటెడ్ అధినేత ఓపర్తి రాజేంద్రబాబు రూ.10 లక్షలు, కోటపాటి జనార్ధన్‌రావు రూ.10 లక్షలు, పీఐవీహెచ్ ల్యాబ్స్ రూ.7,03,999, నెల్లూరు టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.5 లక్షలు, కోటంరెడ్డి సంధ్య రూ.5 లక్షలు, సిశ్వాన్ ఇన్‌ఫ్రా రూ.5 లక్షలు, మధూర్ భార్గవ్ నాయుడు రూ.5 లక్షలు, ఆల్ఫా ఎడ్యుకేషన్ సొసైటీ రూ.5 లక్షలు, భార్గవ్‌రామ్ నాయుడు రూ.5 లక్షలు, కమలకుమారి రూ.5 లక్షలు సీఎం చంద్రబాబుకు అందజేశారు.

ఎస్‌బీఐ సాయం 5.87 కోట్లు

ఎస్‌బీఐ 5.87కోట్ల సాయం ప్రకటించింది. చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ పటేల్, జీఎం శైలేష్ కుమార్ ఈ మొత్తం సీఎంకు అందించారు.

ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలూ...

ఏపీ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం కోటిన్నర విరాళాన్ని ప్రభుత్వానికి అందజేసింది. ఆ సంఘం నేతలు వాసిరెడ్డి విద్యాసాగర్, పెద్దిరెడ్డి మధుసూదన్‌రావు, గ్రంధి సత్యనారాయణ, కోయె సుబ్బారావు, ఆర్.వెంకట్రావు తదితరులు లోకేశ్‌కు చెక్ అందజేశారు.

పంచాయతీరాజ్ చాంబర్ 7.70 కోట్లు

ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ తరుపున రూ.7.70కోట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ముంపు ప్రాంతాలకు పీఆర్ బృందాలు

అమరావతి, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు, పారిశుధ్య నిర్వహణ పనులపై పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రభావంలోని గ్రామాలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ఇంజనీరింగ్ విభాగం బృందాలుగా వెళ్లి పనులను పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. ఆ వెంటనే ఆయన ఆదేశాలు అమల్లోకి తెస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలవారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. పారిశుధ్య నిర్వహణ చేయడంతోపాటు ఎక్కడా నీరు నిలిచిపోకుండా చూడాలని సమీక్ష సందర్భంగా పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించడంతోపాటు డ్రైనేజీలు శుభ్రం చేసి నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ ప్రమాణాలను పాటించాలని కోరారు. వరద బాధితుల సహాయక చర్యల్లో ప్రజారోగ్య విభాగంతో సమన్వయం చేసుకోవాలని పవన్‌కల్యాణ్ కోరారు. ఇప్పటివరకు చేపట్టిన పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

వరద బాధితులకు 'రైల్ నీర్' అందించండి

» రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు షర్మిల లేఖ

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు రైల్ నీర్ బాటిళ్లను అందించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. 'విశాఖ రైల్ నీర్ ప్లాంట్ నుంచి మంచినీటి బాటిళ్లను వరద ప్రభావిత ప్రాంతంలోని ఇళ్లకు అందించండి. విజయవాడ డివిజన్ నుంచి ఏటా రూ.6,000 కోట్ల ఆదాయం వస్తోంది. ఆ ప్రాంత ప్రజలు బాధల్లో ఉన్నప్పుడు ఆదుకోవడం బాధ్యత' అని షర్మిల విజ్ఞప్తి చేశారు.

ఆవు, గేదె చనిపోతే రూ. 37,500

భారీవర్షాలు, వరదలు పశుసంపదపై తీవ్ర ప్రభావం చూపాయి. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడుజిల్లాల్లోని 113 మండలాల్లో 468 పశువులు, మేకలు, గొర్రెలు, 60వేలకుపైగాకోళ్లు మృత్యువాత పడ్డాయి. కొన్ని వరదలో కొట్టుకుపోయాయి. పశువుల పోషకులకు రూ.కోటీ 70 లక్షల నష్టం వాటిల్లింది. వర్షాలు, వరదల నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి, తక్షణ చర్యలు చేపట్టింది. మరణించిన ఆవు, గేదెకు రూ.37,500 చొప్పున నష్ట పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు.




తాము దాచుకున్న రూ.5 లక్షలను వరద బాధితుల కోసం చెక్కు రూపంలో బీజేపీ నేత పాతూరి నాగభూషణం ద్వారా సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న అనురాధ, శిరీష



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న వీఐటీ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు జి.విశ్వనాథన్ తదితరులు

బాధితులకు వీఐటీ విరాళం

తుళ్లూరు, సెప్టెంబరు 6: వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి 1,57,50,000 విరాళాన్ని వీఐటీ విశ్వవిద్యాలయం అందజేసింది. శుక్రవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలసి వీఐటీ వ్యవస్థాపకులు జీ.విశ్వనాధన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాధన్ అందజేశారు. ఇందులో వీఐటీ విశ్వవిద్యాలయం ద్వారా రూ.1,50,00,000 వీఐటీ అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు కలసి రూ.7,50,000 అందించారు.



సీఎం చంద్రబాబుకు రూ.10 కోట్ల చెక్కును అందజేస్తున్న కాటూరి సుబ్బారావు

ఇంకా ముంపులోనే...



వరద నీటిలో మునిగిన వైఎస్సార్ కాలనీలోని బాధితులను జేసీబీలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

ఎప్పటికి రోడ్డెక్కేనో..



సింగ్‌నగర్‌లో వరద నీటిలో నానుతున్న వాహనాలు

మూగ జీవులకు రక్షణ..



పరిసరాలన్నీ వరద ముంపులో ఉండటంతో మూగ జీవాలను చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ వద్ద కట్టేసిన దృశ్యం

ముంపు నుంచి రోడ్డుపైకి..



వరద ముంపుతో ఇబ్రహీంపట్నం జాతీయ రహదారి పక్కన టెంట్లలో తలదాచుకుంటున్న బాధితులు

ఇంకెప్పటికి కోలుకుంటామో...





"మా ఆయన (మాల్యాద్రి) ముఠా పనికి వెళతాడు. రూపాయి రూపాయి కూడబెట్టి కొడుకును చదివించుకున్నాం. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా వాడు పనిచేస్తున్నాడు. ఇంట్లోకి కావల్సిన వస్తువులను సమకూర్చుకున్నాం. మా వాడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాం. అందుకోసం అప్పు చేసి రూ.మూడు లక్షలతో ఇంటిని బాగు చేసుకున్నాం. కొత్తగా పెయింట్లు వేయించాం. బుడమేరు వరద వచ్చి మా ఆశలన్నింటినీ ముంచేసింది. వస్తువులు తీసుకునేలోపలే అవన్నీ మునిగాయి. కష్టపడి కూడబెట్టుకున్నవన్నీ కళ్లముందే నీటిపాలవుతుంటే రెండురోజులు అన్నం కూడా తినబుద్ధి కాలేదు. ఏళ్ల తరబడి పేర్చుకున్న గూడు చెరిగిపోయింది. మళ్లీ మొదటికి వచ్చేశాం. ఇప్పుడు కష్టపడదామన్నా ఒంట్లో ఓపిక లేదు"

- మోరబోయిన జయమ్మ, గృహిణి, ఊర్మిళానగర్, విజయవాడ

తెల్లారి ఆర్డర్ డెలివరీ.. ఇంతలోనే 15 లక్షల స్టాకు నీటిపాలు



"నేనొక చిరు వ్యాపారిని. హోటల్ పొయ్యిల నిర్మాణానికి వినియోగించే సిమెంట్ (రీ ఫ్యాక్టరీ మెటీరియల్) దుకాణం నడుపుతున్నాను. ఆగస్టు చివరి వారంలో కాస్త పెద్ద ఆర్డర్ వచ్చింది. బంధుమిత్రుల దగ్గర చేబదుళ్లు తీసుకుని, ఇంట్లో ఉన్న నగా నట్రా కుదువపెట్టి మొత్తం రూ. 15 లక్షల విలువైన సిమెంట్ బస్తాలను తెప్పించాను. చిన్న రేకుల షెడ్డును అద్దెకు తీసుకుని అందులో స్టాకును నిల్వ చేశాను. తెల్లారి స్టాకు మొత్తం డెలివరీ చేయాలి. ఇంతలోనే ముప్పు ముంచుకొచ్చింది. రేకుల షెడ్డు బుడమేరు వరద ప్రవాహంలో మునిగిపోయింది. అందులో నిల్వ చేసిన రూ.15 లక్షల విలువైన సిమెంట్ బస్తాలు పాడైపోయాయి"

- బీవీ శ్రీనివాసనాయుడు, చిరు వ్యాపారి, కేఎల్ రావు నగర్

కోలుకోలేని వరదదెబ్బ!

రెక్కల కష్టమంతా నీటిపాలు.. చిరు వ్యాపారులు, కూలీలు, మధ్యస్థ కుటుంబాలకు తీరని నష్టం

- బురద, వరదనీటిలో ఇంటి సామగ్రి, పరికరాలు
- మళ్లీ పెరుగుతున్న బుడమేరు వరద
- వారంగా మోకాలిలోతు నీటిలోనే...

(ఆంధ్రజ్యోతి - అమరావతి, విజయవాడ, చిట్టినగర్)

సంవత్సరాల తరబడి రెక్కల కష్టం కళ్ల ముందే బుడమేరు లాక్కెళ్లిపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయత వారిది! తామైనా ప్రాణాలతో బయటపడతామో లేదోనని బిక్కుబిక్కుమంటూ వారంరోజులుగా గడుపుతున్నారు. కాస్త వరద తగ్గి తెరిపినపడ్డామని అనుకునే లోపే, తిరిగి వరదనీరు వచ్చి చేరుతుండటంతో కష్టాలు తీరే తీరమే వారికి కనిపించడం లేదు. ప్రభుత్వం సత్వరం రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్న సహాయక చర్యలు మాత్రమే వారికి ఊరట! నిజానికి, నాలుగు రోజుల క్రితమే భారీ వర్షాలు తగ్గిపోయాయి. పైనుంచి వచ్చే వరద ఉధృతి క్రితంలా లేదు. అయినప్పటికీ విజయవాడ నగరంలోని ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనడం లేదు. బాధితుల కష్టాలు కడతేరడం లేదు. బుడమేరు వరద ఉధృతి కారణంగా ముంపును ఎదుర్కొంటున్న విజయవాడ సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల్లోని ప్రాంతాలు ఇప్పటికీ వరద నీరుతో నానుతూనే ఉన్నాయి. బుడమేరుకు పడిన గండ్లు పూడ్చే పనులు ఆలస్యమవుతుండటంతో విజయవాడ నగరం మీదకు ఇంకా వరద నీరు వస్తూనే ఉంది. ముంపు ప్రాంతాలైన వైఎస్ఆర్, జక్కంపూడి కాలనీలు, వాంబే కాలనీ, కేఎల్ రావు నగర్, సుందరయ్యనగర్, రాజీవ్‌నగర్, సింగ్‌నగర్, రామలింగేశ్వరనగర్, రాజరాజేశ్వరిపేట, ఆంధ్రప్రభ కాలనీ, ఉడా కాలనీ, ఇందిరానాయక్ నగర్, అంబాపురం, పాయకాపురం, కండ్రిక, పాతపాడు తదితర ప్రాంతాల్లోని కాలనీలు చాలావరకు ఇప్పటికీ వరద ముంపులోనే ఉన్నాయి. ప్రభుత్వం సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయడంతో చాలామంది బాధితులు పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. మరి కొందరు బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. కొన్ని ప్రాంతాల్లో అపార్టుమెంట్లలోని పై అంతస్తుల్లో కొన్ని కుటుంబాలు ఉన్నాయి. ముంపు ప్రాంతాల్లోని చాలా కాలనీలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించలేదు. చిమ్మచీకట్లలో బాధితులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మళ్లీ వరద నీరు పెరుగుతుందన్న వార్తలతో వారంతా తీవ్ర భయాందోళనలతో ఉన్నారు.

కడిగిన ఇళ్లలో మళ్లీ కన్నీళ్లు

- తిరిగి వచ్చి చేరుతున్న వరద.. ఖాళీ చేస్తున్న బాధితులు

ఇళ్లలోకి వచ్చిన నీరు గుమ్మాలకు చేరుకుంది. గుమ్మాల వద్ద ఉన్న నీరు మెట్ల దగ్గరకు దిగింది. రెండు రోజుల క్రితం ఉన్న పరిస్థితి ఇది. మెట్ల వద్ద ఉన్న నీరు రోడ్డు మీదకు వెళ్తుందని బాధితులు భావించారు. ఇది రివర్స్ అయింది. తగ్గినట్టే తగ్గిన వరద నీరు మళ్లీ పెరిగింది. బురద బాధ నుంచి తేరుకుంటున్న తరుణంలో వరద నీరు బాధితులను మరోసారి అందులోకి తోసేసింది. విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్, వాంబేకాలనీ, పైపుల రోడ్డు, డాబా కొట్లు సెంటర్‌లో వరదనీరు గురువారం క్రమంగా తగ్గింది. ఇళ్లలో ఉన్న నీరు బయటకు వచ్చేసింది. దీంతో బాధితులు గదులు, గోడలకు పట్టిన బురదను వరద నీటితోనే శుభ్రం చేసుకున్నారు. ఫైరింజన్ సిబ్బంది ఈ పనిలో వారికి సహకరించారు. ఇక బుడమేరు వరద నీరు ఇక తగ్గిపోతుందని బాధితులు భావించారు. ఇంతలోనే.. గురువారం సాయంత్రం నుంచి వరదనీటిలో పెరుగుదల కనిపించింది. తర్వాత కాసేపటికి శుభ్రం చేసుకున్న ఇళ్లలోకి మళ్లీ వరదనీరు చేరింది. బాధితులను పెరిగిన నీరు మళ్లీ కన్నీళ్లు పెట్టించింది.

మోయలేని వరద 'బండ'



"మేం మొదటి అంతస్తులో ఉంటున్నాం. ఇంట్లో గ్యాస్ బండ అయిపోయింది. గ్యాస్ బండ తెచ్చుకుందామని మోకాలి లోతు నీటిలో ఉదయం బయటకు వచ్చాను. మా కాలనీ నుంచి 3-4 కిలోమీటర్ల దూరంలో ఉండే పాల ఫ్యాక్టరీ (చిట్టినగర్) వరకు మధ్యాహ్నానికైనా చేరలేకపోయాను. గ్యాస్ బండను తీసుకుని.. దానిని మోయలేక ఇలా వరద నీటిలో దొర్లించుకుంటూ వెళ్తున్నాను. మా కాలనీలో అపార్ట్‌మెంట్ల గ్రౌండ్ ఫ్లోర్ వరకు నీళ్లున్నాయి. ప్రభుత్వం నుంచి ఆహారం, పాలు, మంచినీళ్లు అందుతున్నాయి. మా కాలనీలో శుక్రవారం ఉదయం నుంచి మళ్లీ వరద పెరుగుతోంది"

- సలోమి, గృహిణి, జక్కంపూడి కాలనీ

గొడ్డూగోదా వదిలేసి వచ్చాం



"మాకు పాడి ఉంది. 10 పశువులను పెట్టుకుని జీవనం సాగిస్తున్నాం. బుడమేరు కట్టపై వాటిని కట్టేశాం. ఎప్పటి లాగానే ఆదివారం (సెప్టెంబరు 1)ఉదయం పాలు తీశాను. వాటికి మేత పెట్టేందుకు వెళ్లినప్పుడు, వరద రావడం గమనించాను. అయితే, ఎప్పటి లాగానే చిన్న వరద అనుకున్నాను. కానీ నిమిషాల వ్యవధిలో వరద ఉధృతి పెరిగిపోయింది. ఇంట్లో మగాళ్లు కూడా ఆ సమయంలో లేరు. దీంతో నేను, మా కోడలు హడావిడిగా బంధువుల ఇంటికి వచ్చేశాం. పశువులను కట్టేసి ఉన్న తాళ్లను కూడా తీసే సమయం కూడా లేదు. కొద్దిసేపు మేం అక్కడే ఉంటే మేమూ ఆ వరదలో చిక్కుకుని కొట్టుకుపోయే వాళ్లం. చిన్న పడవ తీసుకుని మా ఇంటికి వెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. పశువులు ఉన్నాయో.. చనిపోయాయో తెలియడం లేదు.

- మహాలక్ష్మి, ఇందిరానగర్ కాలనీ

బుడమేరు ముంపునకు వైఎస్ కుటుంబానిదే బాధ్యత

- 1956లో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రణాళికలు
- అడ్డుకున్న రాజారెడ్డి బంధువు 'బొల్లారెడ్డి': ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు, సెప్టెంబరు 6: బుడమేరు వరదతో విజయవాడలోని పలు ప్రాంతాలు ముంపునకు గురవడానికి, వైఎస్ కుటుంబం తప్పిదమే కారణమని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం ఆయన విజయవాడ రూరల్ ప్రాంతాల్లో ముంపు ప్రాంతాల్లో జరుగుతున్న సహాయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు తాగు, సాగు నీరు అందించేందుకు 1956 ఏప్రిల్ 11న అప్పటి ఎంపీ అల్లూరి సత్యనారాయణరాజు బుడమేరు డైవర్షన్ చానల్‌కు శంకుస్థాపన చేశారు. గణపవరం కొండల వద్ద నుంచి అనంతారం కొండల మధ్య వరకూ రిజర్వాయర్ నిర్మించి, ప్రకాశం బ్యారేజి కంటే పది రెట్లు నీరు నిల్వ ఉండేలా రూపొందించారు. అప్పట్లో వైఎస్ రాజారెడ్డి బంధువైన గణపవరం ప్రాంత జమిందారు బొల్లారెడ్డి కోటిరెడ్డి, ఆయన కుమారుడు వెంకటేశ్వరరెడ్డి.. నీలం సంజీవరెడ్డితో ఉన్న సంబంధాలను అడ్డుపెట్టుకొని, బుడమేరు రిజర్వాయర్ నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారు. నేడు బుడమేరు ముంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవడానికి వైఎస్ కుటుంబం పాత్ర ఉంది. నాడు బుడమేరు రిజర్వాయర్ నిర్మాణాన్ని అడ్డుకున్న వైఎస్ కుటుంబానికి చెందిన జగన్.. ముంపు ప్రాంతాల్లో ప్రజల్ని ఆదుకునేందుకు చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తుంటే, కువిమర్శలు చేస్తున్నాడు' అన్నారు.

విజయవాడ ముంపు పాపం వైసీపీదే

- ఐదేళ్లలో బుడమేరు కట్టలపై గడ్డి పరక తీయలేదు: పురందేశ్వరి

జి.కొండూరు, సెప్టెంబరు 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రికార్డు సమయంలో సహాయ చర్యలు చేపడుతున్నాయి. వరద బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటున్నాం' అని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బీడీసీ ఎడమ గట్టుకు పడిన గండ్లుకు చేస్తున్న మరమ్మతు పనుల్ని ఆమె శుక్రవారం మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలసి పరిశీలించారు. ఆమె మాటాడుతూ.. 'సీఎం చంద్రబాబు ఫోన్ చేయగానే ప్రధాని మోదీ తక్షణం స్పందించి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను, బుడమేరు గండ్లను పూడ్చేందుకు ఆర్మీ వాళ్లను పంపారు. టీడీపీ హయాంలో చంద్రబాబు రూ.300 కోట్లు బుడమేరు ఆధునీకరణకు కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ఐదేళ్లలో బుడమేరు కట్టలపై గట్టి పరక కూడా తీయలేదు. తట్ట మట్టి కూడా వేయలేదు. అందుకే విజయవాడకు ఈ పరిస్థితి వచ్చింది. తమ హయాంలో బుడమేరుకు ఏం చేశారో వైసీపీ నేతలు చెప్పాలి. ప్రజలు బాధల్లోను, రాష్ట్రం కష్టకాలంలో ఉంటే రాజకీయాలు చేయడం తగదు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను ప్రధాని మోదీ పంపారు. వరద నష్టం అంచనా వేసి ఆయన కేంద్రానికి అందిస్తారు. బాధితులకు తక్షణ, దీర్ఘకాలిక సహాయం ఏవిధంగా అందించాలనేదానిపై దృష్టి పెడతాం' అని పురందేశ్వరి తెలిపారు.





బుడమేరు ముంపునకు గురైన పంట పొలాలను హెలికాప్టర్‌లో పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



కొత్త విజయవాడ చూపిస్తా!

హుద్‌హుద్‌లో విశాఖను తీర్చిదిద్దినట్టే... వరద తాకని నగరంగా మారుస్తా..

- నష్టపోయిన వారిని నిలబెట్టడం పెద్ద సవాల్
- కేంద్రం ఉదారంగా ఆదుకుంటుందని ఆశిస్తున్నా
- కేంద్ర సాయంపై వస్తున్న వార్తలు వదంతులే
- మేం ఇంకా నివేదికే పంపలేదు: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వరద ముంపు ఉండని కొత్త విజయవాడను చూపిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. 'హుద్‌హుద్ తుఫాన్‌లో చిన్నాభిన్నమైన విశాఖను తర్వాత ఒక అందమైన నగరంగా తీర్చిదిద్దాం. అలాగే విజయవాడ రూపురేఖలు మారుస్తాం" అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడ కలెక్టరేట్‌లో మాట్లాడారు. "మానవ తప్పిదాలతో విజయవాడ మునిగింది. బుడమేరు ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి, గట్లను గత ప్రభుత్వం పటిష్ఠం చేసి ఉంటే ఇవాళ ఈ వరద ఉండదు. లక్షల మందికి ఇంత శోకం ఉండదు. బుడమేరు గట్టుకు పడిన గండ్లలో ఇంకా ఒకటి పూడ్చాల్సి ఉంది. ఆర్మీ నిపుణులను కూడా తీసుకువచ్చాం. వరద నడుస్తుండగా గండిని పూడ్చడం క్లిష్టంగా ఉందని వాళ్లు కూడా చెబుతున్నారు. అయినా పెద్ద పోరాటం చేస్తున్నాం. రేపటికి గండి పూడ్చే అవకాశం ఉంది. ఈ వాగుకు నిన్న తొమ్మిది వేల క్యూసెక్కుల వరద రావడంతో అందులో కొంత విజయవాడలోకి మళ్లీ ప్రవహించి కొన్నిచోట్ల ముంపు పెరిగింది. ఈ రోజు రాత్రికి వాన పడకపోతే రేపటికి గండి పూడుస్తాం. కాబట్టి ఇబ్బంది ఉండదని అనుకొంటున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

ఇవ్వగలిగినంత చేయూత అందిస్తా...

వరదల్లో నష్టపోయిన వారిని నిలబెట్టాలన్నది తన తపనని, దానిపైనే దృష్టి పెట్టి పనిచేస్తున్నానని చంద్రబాబు తెలిపారు. "వ్యాపారాలు చేసుకొనేవారు బాగా దెబ్బతిన్నారు. ఇళ్లలో సామాన్లు నాశనం అయ్యాయి. వాహనాలు దెబ్బతిని నష్టపోయారు. ఇవన్నీ నేను నా కళ్లతో చూశాను. వీరిని ఎలా ఆదుకోవాలన్నది సమస్య. బీమా కంపెనీలు కొర్రీలు వేయకుండా త్వరగా పరిహారం ఇచ్చేలా చూస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఏవైనా సర్టిఫికెట్లు కావాలంటే ఇస్తామని చెప్పాం. వ్యాపారాలు, వాహనాలు, ఇళ్ల రుణాలు రీ షెడ్యూల్ చేసి వారికి కొంత వ్యవధి దొరికేలా చూడాలని అనుకొంటున్నాం. కొత్త రుణాలు ఇప్పించడంపై బ్యాంకులతో మాట్లాడుతున్నాం. మేం సొంతంగా ఇవ్వడానికి రాష్ట్రం ఇప్పటికే బాగా లోటులో ఉంది. ఈ పరిస్థితులన్నీ కేంద్రానికి వివరించాం. వాళ్లు కూడా ఉదారంగా స్పందిస్తారని ఆశిస్తున్నాం. అవసరం అయితే ఢిల్లీ వెళ్ళే విషయం ఆలోచిస్తానని చెప్పారు. కాగా, వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లలో పరికరాలు, సామాన్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తున్నామని వెల్లడించారు. బయటి ప్రాంతాల నుంచి మెకానిక్‌లను తెప్పించి, ప్రభుత్వం నుంచి కొంత ఖర్చు కూడా పెట్టి వాటిని మరమ్మతులు చేయించే ఆలోచన చేస్తున్నామన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో బాధితులకు సాయం అందించే పని వేగంగా సాగుతోందని ఆయన చెప్పారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

సరుకులతోపాటు యాపిల్స్, నూడుల్స్..

చిన్నాపెద్దా తేడా లేకుండా ముంపు ప్రాంతంలో ఉన్న ప్రతి కుటుంబానికి సరుకులు ఇస్తున్నారు. దీనితోపాటు డ్రై ప్యాకేజి కింద ఆరు నూడుల్స్ ప్యాకెట్లు, ఆరు యాపిల్స్, ఆరు లీటర్ల మంచినీళ్లు, రెండు లీటర్ల పాల ప్యాకెట్లు, ఆరు బిస్కట్ ప్యాకెట్లు కూడా ఇస్తున్నారు. శనివారం వరకూ ప్రభుత్వ సిబ్బంది.... సుమారు నలభై వేల కుటుంబాలకు వీటిని పంపిణీ చేస్తారు. ఆదివారం నుంచి రేషన్ షాపుల్లో పెట్టి అక్కడ నుంచి అందరూ తీసుకువెళ్లే ఏర్పాటు చేస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి వీటిని తీసుకోవచ్చు. ఆకు కూరలు రెండు రూపాయలు, కొన్ని రకాల కూరగాయలు కిలో ఐదు, మరి కొన్ని కిలో రూ.10 రేటు పెట్టి ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వం తరపున విక్రయిస్తున్నారు. శుక్రవారం నలభై వేల కిలోల కూరగాయలు తెప్పించారు. శనివారం నుంచి ఇంకా ఎక్కువ తెప్పిస్తున్నారు. శుక్రవారం ఒక్క రోజే పదకొండున్నర లక్షల మంచినీళ్ల బాటిళ్లు, నాలుగున్నర లక్షల పాల ప్యాకెట్లు, ఆరు లక్షల బిస్కట్ ప్యాకెట్లు, డెబ్బై ఐదు వేల కొవ్వొత్తులు, ఏభై వేల అగ్గిపెట్టెలు సరఫరా చేశారు. కాగా, ముంపు ప్రాంతాల్లో ఏడువేల మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఇప్పటికి 12 వేల టన్నుల చెత్తను తీశారు. 110 ఫైర్ ఇంజన్లు రోడ్లు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లు శుభ్రం చేస్తున్నాయి. నీళ్లు ఉన్న ప్రాంతాల్లోని 23 వేల కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో కరెంటు సరఫరా పునరుద్ధరించారు. 15 డ్రోన్లు ఆహారం పంపిణీ చేస్తున్నాయి. విజయవాడ ముంపు ప్రాంతంలో ఉచిత బస్సులు పెట్టామని తెలిపారు.

కేంద్ర సాయంపై వదంతులు..

రెండు తెలుగు రాష్ట్రాలకు కేంద్రం రూ. 3300 కోట్లు సాయంగా ప్రకటించిందని వచ్చిన వార్తలు ఒట్టి వదంతేనని చంద్రబాబు స్పష్టం చేశారు. వరద నష్టంపై తాము ఇంకా నివేదిక కూడా పంపకుండానే కేంద్రం ఎలా సాయం ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. నివేదికను శనివారం కేంద్రానికి పంపుతున్నట్లు ఆయన తెలిపారు. కాగా, బుడమేరు కట్ట తెగిన ప్రాంతంలో హెలికాప్టర్‌లో సీఎం శుక్రవారం ఉదయం ఏరియల్ విజిట్ చేశారు. బుడమేరు ఏఏ ప్రాంతాలగుండా ప్రవహించి కొల్లేరు సరస్సులో కలుస్తున్నదీ, అక్కడి గ్రామాల పరిస్థితి ఏమిటనేదీ ఆయన పరిశీలించారు.

పండగరోజూ కలెక్టరేట్‌లోనే బాబు

శనివారం వినాయక చవితి పండగ రోజు కూడా విజయవాడ కలెక్టరేట్‌లోనే ఉండిపోవాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. "శనివారం వినాయక చవితిని కలెక్టరేట్‌లోనే చేసుకొంటున్నాను. ఇంటికి వెళ్లడం లేదని తెలిపారు. విజయవాడ నగరం గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో వరద ముంపునకు గురి కావడంతో ఆయన కలెక్టరేట్‌లోనే గత వారం రోజులుగా ఉంటున్నారు. బాత్రూం సదుపాయం ఉన్న బస్సును కలెక్టరేట్ ఆవరణలో పెట్టి ఆయన అందులోనే పడుకొంటున్నారు. పండగ రోజు కూడా అక్కడే ఉండిపోవాలని ఆయన నిశ్చయించారు. వరద సహాయక కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో తాను పక్కకు వెళ్తే మళ్లీ అవి గాడితప్పే ప్రమాదం ఉందన్నారు. బాధితులకు లేని పండగ మనకెందుకని ఆయన వ్యాఖ్యానించినట్లు ఒక మంత్రి చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలోనే ఒక చోట వినాయకుడి విగ్రహం పెట్టి శనివారం అక్కడే పూజ చేయాలని నిర్ణయించారు. పూజ ఏర్పాట్లు చూడటానికి కనకదుర్గ ఆలయానికి చెందిన అర్చకులు కలెక్టరేట్‌కు శుక్రవారం వచ్చారు.

మోదీ, బాబు అండగా ఉంటారు

- రైతులు ఎవరూ అధైర్య పడొద్దు .. అన్నివిధాలుగా సాయం చేస్తాం
- వైసీపీ సర్కారు 'ఫసల్ బీమా'కు ప్రీమియం కట్టకపోవడంతో రైతులకు నష్టం
- రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించా: శివరాజ్ సింగ్

తెనాలి/అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి),గన్నవరం: రైతులు ఎవరూ అధైర్య పడొద్దని, ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు అండగా ఉంటారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భరోసా ఇచ్చారు. ఇదే విషయాన్ని తెలియజేయాలని కేంద్రం తనను పంపిందన్నారు. ఏ ఒక్కరూ కన్నీరు కార్చొద్దని, ఆందోళన చెందాల్సిన పనిలేదని, రైతుల జీవితాల్లో మళ్లీ వెలుగులు తెస్తామని చెప్పారు. శుక్రవారం కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో దెబ్బతిన్న పంటలను చౌహాన్ పరిశీలించారు. అనంతరం ఎస్ఎల్‌వీ లైలా గ్రీన్ మెడోస్ దగ్గర రైతులతో మాట్లాడారు. రైతు పలగాని శ్రీనివాసరావు మంత్రి ముందు తన గోడును వెళ్లబోసుకున్నారు. తాను 30 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశానని, బుడమేరు వరదతో మునిగి పోయి కుళ్లిపోయిందని తెలిపారు. కేంద్ర మంత్రికి వరి దుబ్బులను చూపించారు. భూ యజమానికి రూ.15 వేలు కౌలు ముందుగానే చెల్లించామని చెప్పారు. మరో రైతు చదలవాడ కృష్ణారావు మాట్లాడుతూ.. తాను పది ఎకరాలు కౌలు తీసుకుని వరి సాగు చేస్తున్నానని, పంట మొత్తం వరదలకు పూర్తిగా మునిగి నష్టపోయాయని కన్నీటి పర్యంతమయ్యారు. తనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, రోడ్డున పడ్డానని, ఆదుకోవాలని వేడుకున్నారు. కేంద్ర మంత్రి చౌహాన్ మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. నీళ్లు నిలవడం వల్ల పంట దెబ్బతిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రైతులకు అన్నీ సమకూరుస్తామని చెప్పారు. తాత్కాలిక ఉపశమనం కల్పించేందుకు స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ (ఎస్డీఆర్ఎఫ్) రూ.3400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉన్నాయని చెప్పారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు కూడా ఉన్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పీఎం ఫసల్ బీమా యోజన పథకానికి ప్రీమియం కట్టకపోవటంతో రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. వరద నష్టం వివరాలను ప్రధానికి తెలుపుతానన్నారు. సీఎం చంద్రబాబు సున్నితంగా ఆలోచిస్తారని, మాట్లాడుతున్నప్పుడు ఆయన కళ్లల్లో కన్నీరు వచ్చిందన్నారు.

'బుడమేరు'కు నిధులివ్వండి: సాగునీటి వినియోగదారుల సమాఖ్య వినతి

బుడమేరు కాలువ పనులకు నిధులు ఇవ్వాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య కోరింది. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి నష్టం జరగకుండా బుడమేరు కాలువ పనులు చేపట్టాల్సి ఉందని, ఇందుకు కేంద్రం నిధులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

కేంద్రం నుంచి అదనపు సాయం: కేంద్ర మంత్రి పెమ్మసాని

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక సాయం అందించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరినట్టు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని, నష్టం వివరాలను ప్రధాని దృష్టికి తీసుకువెళ్లి అదనపు సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. గుంటూరుజిల్లా తెనాలి మండలం వరద ప్రాంతాల్లో ఆయన పర్యటించారు.



కృష్ణా జిల్లా గన్నవరం మండలంలో పంట నష్టం వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్

ఆదిమూలంపై అత్యాచారం కేసు

- బాధిత మహిళ ఫిర్యాదుతో తిరుపతి పోలీసుల కేసు నమోదు
- వైద్య పరీక్షలకు బాధితురాలి నిరాకరణ
- చెన్నైలోని ఆసుపత్రిలో ఎమ్మెల్యే కోనేటి
- విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు



తిరుపతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. ఆదిమూలం తనను బెదిరించి బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డారంటూ తెలుగు మహిళా నాయకురాలు గురువారం రాత్రి తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు క్రైమ్ నంబరు 430/24తో ఐపీసీ 376, 506(భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 64, 351-2) కింద కేసు నమోదు చేశారు. సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలానికి చెందిన బాధితురాలు గురువారం హైదరాబాద్‌లో మీడియా ఎదుట ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని టీడీపీ నుంచీ సస్పెండ్ చేశారు. ఆ క్రమంలో గురువారం రాత్రి బాధితురాలు తన భర్తతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూలై 6, 17న తిరుపతిలోని భీమాస్ ప్యారడైజ్ హోటల్‌కు పిలిచి బలవంతంగా తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తరచూ ఎమ్మెల్యే ఫోన్లు చేస్తుండడంతో తన భర్త తనను నిలదీశారని, దీంతో భర్తకు జరిగిన విషయం చెప్పినట్టు తెలిపారు. ఆగస్టు 10వ తేదీన అదే హోటల్‌కు రమ్మని ఎమ్మెల్యే ఫోన్ చేయడంతో.. తన భర్త సూచనల మేరకు పెన్ కెమెరాలో తనను బలాత్కరించడాన్ని వీడియో రికార్డు చేశానని పేర్కొన్నారు. కాగా, బాధితురాలి ఫిర్యాదుతో సీఐ మహేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం బాధిత మహిళను వైద్య పరీక్షల నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అయితే వైద్య పరీక్షలు అవసరం లేదంటూ మొండికేయడంతో పోలీసు అధికారులు, వైద్యులు ఆమె నుంచీ లిఖితపూర్వకంగా రాయించుకుని వెనక్కి పంపేశారు.

కాల్ డేటా సేకరణ

ఎమ్మెల్యే ఆదిమూలం గుండె పోటుతో చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరినట్టు తెలిసింది. తెలుగు మహిళ నాయకురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎమ్మెల్యేపై కేసు నమోదైన నేపథ్యంలో ఆయన ఎక్కడున్నారో తెలుసుకునేందుకు తిరుపతి ఈస్ట్ పోలీసులు ఆరా తీయగా ఈ విషయం తెలిసింది. మరోవైపు.. ఆదిమూలం వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. దీంతో బాధిత మహిళ నుంచి ఫిర్యాదు అందగానే తిరుపతి జిల్లా పోలీసు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఎమ్మెల్యే మొబైల్ నంబరు, బాధిత మహిళకు చెందిన రెండు నంబర్లు, ఆమె భర్త మొబైల్ నంబర్ల కాల్ డేటా సేకరిస్తున్నారు. బాధిత మహిళ హోటల్‌కు వెళ్లిన తేదీలతో పాటు ఆయా తేదీలకు పది రోజులు అటూ ఇటూగా కూడా కాల్ డేటా సేకరిస్తున్నారు. ప్రధానంగా ఫోన్లు ఎవరు ఎవరికి చేశారు? ఎన్ని సార్లు చేశారు? అన్న వివరాలపై దృష్టి సారించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను నిర్ధారించుకోవడంతో పాటు ఫిర్యాదు వెనుక కుట్ర జరిగిందా? అన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతున్నట్టు సమాచారం. అధికార పార్టీ మహిళా నేత ఫిర్యాదు కావడంతో కేసును అత్యంత ప్రాధాన్యంగా భావించి ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి, క్రైమ్ విభాగాలతో కూడా సమన్వయం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుంటే, బాధిత మహిళ గది నుంచి రిసెప్షన్ వద్దకు రెండు సార్లు వచ్చి వెళ్లిన దృశ్యాలు హోటల్ సీసీ టీవీ కెమెరాలో రికార్డయినట్టు తెలిసింది. ఆ దృశ్యాలు స్పష్టంగా ఉన్నాయని సమాచారం. దీంతో సంబంధిత హార్డ్ డిస్కును స్వాధీనం చేసుకున్న పోలీసులు దాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపనున్నట్టు తెలిసింది.



బుడమేరు మూడో గండి పూడ్చివేత పనులు జోరుగా సాగుతున్న దృశ్యం

బుడమేరులో
రంగంలోకి సైన్యం

- 120 మంది మద్రాస్ బెటాలియన్ జవాన్ల రాక
- యుద్ధ ప్రాతిపదికన మూడో గండి పూడ్చే పనులు
- నేటి ఉదయానికి పూర్తయ్యే అవకాశం
- 3 రోజులుగా మంత్రి నిమ్మల అక్కడే

అమరావతి-ఆంధ్రజ్యోతి/జి.కొండూరు, సెప్టెంబరు 6: వరద కారణంగా బుడమేరు వరద మళ్లింపు కాలువ (బీడీసీ) ఎడమ కట్టకు పడిన గండ్ల పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. మొత్తం 3 ప్రధాన గండ్లలో ఇప్పటికే 2 గండ్లు పూడ్చగా అతి పెద్దదైన మూడో గండి పూడ్చివేత శనివారం ఉదయానికి పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ పల్లపు ప్రాంతాలను అతలాకుతలం చేసిన బుడమేరు వరద నుంచి బాధితులను కాపాడేందుకు, సహాయ చర్యలు ముమ్మరంగా చేసేందుకు బుడమేరు వరద గండ్ల ద్వారా విజయవాడ వైపు రాకుండా చేయాల్సి ఉంది. దీనిపై సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి సైన్యాన్ని రంగంలోకి దించారు. మద్రాసు 6వ బెటాలియన్ నుంచి 120 మంది జవాన్లు వచ్చారు. తాత్కాలికంగా ఇనుప రాడ్లతో వంతెనలా కట్టారు. అందులో భారీ రాళ్లు వేసి పూడుస్తున్నారు. గేబియాస్ బుట్టల (ఇనుప చువ్వలతో బుట్టల్లా చేసిన దానిలో పెద్ద పెద్ద రాళ్లతోనూ ..ఇసుకతోనూ నింపుతారు) ద్వారా వారు గండ్లు పూడుస్తున్నారు. ఈ బుట్టలను పటిష్ఠం చేసేందుకు 4 మీటర్ల వరకూ రక్షణ కట్టకడతామని ఆర్మీ, జల వనరుల శాఖ వర్గాలు వెల్లడించాయి. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి 4వ కిమీ వద్ద 60 మీటర్లు, 4.1 కిమీ వద్ద 50 మీటర్ల మేర పడిన గండ్లలో 4.1, 4 కిమీ వద్ద ఏర్పడిన గండ్లను శుక్రవారం మధ్యాహ్నానికి పూడ్చివేశారు. 3.9వ కిమీ వద్ద పడిన 100 మీటర్ల గండిని ఆర్మీ జవాన్లు సాయంత్రానికి 20 శాతం వరకు పూడ్చారు. గురువారం ఉదయం కేవలం 4,500 క్యూసెక్కుల ఉన్న నీరు.. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గురువారం సాయంత్రానికి 9 వేలకు చేరుకుంది. వరద పెరిగినా, వర్షం ఆటంకం కలిగించినా, కట్టలు జారుతున్నా పనులు మాత్రం ఆపకుండా ముందుకు కొనసాగిస్తున్నారు. శుక్రవారం పగలు కాస్త పొడి వాతావరణం ఉండడంతో పనులు వేగంగా సాగాయి. రాత్రి బుడమేరుకు 2,500 క్యూసెక్కుల వరదే వస్తోంది. కానీ వర్షం కురుస్తోంది. శనివారం ఉదయానికి గండిని పూర్తిగా పూడ్చివేయగలమని అధికారులు అంటున్నారు. కాగా.. జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు మూడ్రోజులుగా బుడమేరు కాలువ వద్దే ఉన్నారు. ఎండనకా వాననకా అక్కడే ఉండి గండ్ల పూడ్చివేతను పర్యవేక్షిస్తున్నారు. మొదటి రెండు గండ్ల పూడ్చివేత ఆయన ఆధ్వర్యంలోనే జరిగింది.

కొల్లేరుకు పెరుగుతున్న వరద

- గ్రామాలను చుట్టుముడుతున్న నీరు.. ప్రజల్లో భయం
- ఉప్పుటేరును సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

కైకలూరు, సెప్టెంబరు 6: కొల్లేరు సరస్సులో ముంపు రోజురోజుకూ పెరుగుతూ గ్రామాలను చుట్టుముడుతోంది. ఎగువ నుండి భారీగా వరద సరస్సులోకి చేరడంతో అనేక గ్రామాలకు వెళ్లే రహదారులు మునిగాయి. కొల్లేరు మరింత ఉగ్రరూపం దాలిస్తే సరస్సులోని 94 గ్రామాలు మునిగే ప్రమాదం ఉంది. ప్రధానంగా కైకలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరం వద్ద ఉప్పుటేరులో రోడ్డు వంతెనల వద్ద దట్టమైన కిక్కిసక్కర్ర అలుముకుంది. అలాగే రైల్వే బ్రిడ్జి, జాతీయ రహదారి విస్తరణలో ఉప్పుటేరుపై నూతనంగా నిర్మాణం చేసిన వంతెన సగంలో నిలిపివేశారు. దీంతో ఉప్పుటేరులో 100 మీటర్ల వరకు దారి పూడుకుపోయింది. ఉప్పుటేరు అనేకచోట్ల ఆక్రమణలకు గురికావడం సరస్సు నుంచి వచ్చిన నీరు వచ్చినట్లుగా సముద్రంలోకి వెళ్లకుండా అవరోధాన్ని సృష్టిస్తోంది. 2020 కంటే అత్యధికంగా కొల్లేరులోకి వరద నీరు వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అభ్యర్థనతో ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ నేతలతో కలిసి ఉప్పుటేరు ప్రాంతాన్ని పరిశీలించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్నవాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని అధికారులను ఆదేశించారు.

వరద బాధితులకు అండగా కేరళ

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు కేరళ ప్రభుత్వం అండగా ఉంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, కేరళ ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఇతర నేతలతో కలిసి విజయవాడలోని ముంపు ప్రాంతాలతోపాటు ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం విజయవాడలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు.

గవర్నర్ వినాయక చవితి శుభాకాంక్షలు

అమరావతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది.

చంద్రబాబు శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర, దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. "వాడవాడలా చవితి పందిళ్లతో కళకళలాడాల్సిన సమయంలో వచ్చిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు విజయవాడ ప్రజలను తీవ్ర కష్టాల పాల్జేశాయి. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి విపత్తులు రాకుండా చూడాలని ఆ వక్రతుండ మహాగణపతిని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

పవన్ శుభాకాంక్షలు

'తెలుగు రాష్ట్రాల అభివృద్ధి, ప్రజల సౌభాగ్యం అవిఘ్నంగా కొనసాగాలని విఘ్నాలకు అధిపతి అయిన గణనాథుడిని మనసారా వేడుకుంటున్నా. సకల జనులకు వినాయకచవితి శుభాకాంక్షలు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన చేశారు. ఇప్పటి పరిస్థితుల్లో వినాయక చవితిని భక్తిప్రపత్తులతో ఆనందదాయకంగా చేసుకునే వాతావరణం రాష్ట్రంలో లేదని పవన్ కల్యాణ్ అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● శనివారం 7 సెప్టెంబరు 2024

diksuchi@andhrajyothy.com

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ సహా అహ్మదాబాద్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో బీ డిజైన్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. దీని వ్యవధి నాలుగేళ్లు. అహ్మదాబాద్, బెంగళూరు, గాంధీనగర్ క్యాంపస్‌లలో ఎం డిజైన్ ప్రోగ్రామ్ ఉంది. దీని వ్యవధి రెండున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల భాషలో నిర్వహిస్తారు. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్ దశలు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. ప్రతి కేటగిరీలో సీట్ల సంఖ్యకు మూడు రెట్లమంది ని మెయిన్స్‌కు అనుమతిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ స్కోర్ ఆధారంగా తదుపరి అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.



ఎన్ఐడీలో డిజైన్ ప్రోగ్రామ్‌లు

బీ డిజైన్

విభాగాలు: యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.

సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 125 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థుల కోసం అహ్మదాబాద్ క్యాంపస్‌లో 19 సీట్లు, మధ్యప్రదేశ్ క్యాంపస్‌లో 11 సీట్లు, హరియాణా క్యాంపస్‌లో 11 సీట్లు అదనంగా ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2004 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. సీబీఎస్ఈ/ఐబీ/ఐసీఎస్ఈ/ఇతర గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2024-25 విద్యా సంవత్సరం నాటికి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, హ్యూమానిటీస్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 15 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల 'జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు' ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నుంచి కనీసం అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ పాసైనవారు; బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే మూడేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఎగ్జామ్(లండన్/శ్రీలంక) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్-పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. మెయిన్స్ ఎగ్జామ్‌ను స్టూడియో సెటప్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఇందులో మల్టిపుల్ టెస్ట్‌లు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 40 శాతం, మెయిన్స్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు.

- ★ **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 3
- ★ **ఎడిట్ విండో ఓపెన్:** డిసెంబరు 4 నుంచి 9 వరకు
- ★ **ప్రిలిమ్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 24 నుంచి
- ★ **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- ★ **ప్రిలిమ్స్ తేదీ:** 2025 జనవరి 5న
- ★ **ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 1న; ఎం డిజైన్‌కు 2025 ఫిబ్రవరి 17న
- ★ **మెయిన్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 14 నుంచి; ఎం డిజైన్‌కు 2025 ఫిబ్రవరి 24 నుంచి
- ★ **మెయిన్స్ తేదీలు:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 26 నుంచి మే 4 వరకు; ఎం డిజైన్‌కు 2025 మార్చి 3 నుంచి ఏప్రిల్ 6 వరకు
- ★ **మెయిన్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 మే 16న; ఎం డిజైన్‌కు 2025 మే 6
- ★ **సీట్ అలాట్‌మెంట్, డాక్యుమెంట్స్ అప్‌లోడింగ్:** బీ డిజైన్‌కు 2025 మే 27 నుంచి 30 వరకు; ఎం డిజైన్‌కు 2025 మే 6 నుంచి 7 వరకు
- ★ **వెబ్‌సైట్:** admissions.nid.edu

ఎం డిజైన్

విభాగాలు-సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు; సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్‌లో 12 సీట్లు ఉన్నాయి. గాంధీనగర్ క్యాంపస్‌లో ఫొటోగ్రఫీ డిజైన్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఆటోమొబైల్ డిజైన్, న్యూ మీడియా డిజైన్, స్ట్రాటజిక్ డిజైన్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ డిజైన్, లైఫ్ స్టయిల్ యాసెసరీ డిజైన్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు; టాయ్ అండ్ గేమ్ డిజైన్‌లో 12 సీట్లు ఉన్నాయి. బెంగళూరు క్యాంపస్‌లో యూనివర్సల్ డిజైన్, డిజిటల్ గేమ్ డిజైన్, ఇన్ఫర్మేషన్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, డిజైన్ ఫర్ రిటైల్ ఎక్స్‌పీరియెన్స్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 1993 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. ఇంటర్ తరవాత మూడేళ్లు/నాలుగేళ్ల వ్యవధిగల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; డిజైన్, ఫైన్ ఆర్ట్స్, అప్లయిడ్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ విభాగాల్లో నాలుగేళ్ల డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 జూన్ 28 నాటికి డిగ్రీ/డిప్లొమా చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్-పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ఆంగ్ల మాధ్యమంలో ప్రశ్నలు అడుగుతారు. మెయిన్స్ ఎగ్జామ్‌లో స్టూడియో టెస్ట్, ఇంటర్వ్యూలు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 30 శాతం, స్టూడియో టెస్ట్ స్కోర్‌కు 40 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.



ఐఐటీ మద్రాస్‌లో

బీఎస్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ఇప్పటికే వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఉద్యోగార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్టులుగా రాణించవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి. ఇందులో నాలుగు దశలు ఉన్నాయి. అవి ఫౌండేషన్ లెవెల్, డిప్లొమా లెవెల్, బీఎస్సీ డిగ్రీ లెవెల్, బీఎస్ లెవెల్.
- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు అసైన్‌మెంట్స్ స్కోర్, క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ఫౌండేషన్ లెవెల్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ ఇస్తారు. దీనిని పూర్తిచేసిన తరవాత డిప్లొమా లెవెల్ ప్రోగ్రామ్‌లో ఆ తరవాత బీఎస్సీలో, తరవాత బీఎస్‌లో అడ్మిషన్ లభిస్తుంది.
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024కు అర్హత పొందినవారికి ఫౌండేషన్ లెవెల్ ప్రోగ్రామ్‌లో నేరుగా అడ్మిషన్ ఇస్తారు.
- ప్రోగ్రామ్ నుంచి ఏ దశలోనైనా అభ్యర్థులు నిష్క్రమించే వీలుంది. పూర్తిచేసిన కోర్సులకు సంబంధించి సంస్థ సర్టిఫికెట్ ప్రదానం చేస్తుంది.
- ఫౌండేషన్ లెవెల్లో ఎనిమిది కోర్సులు ఉంటాయి. 32 క్రెడిట్లు నిర్దేశించారు.
- డిప్లొమా లెవల్లో ఆరు థియరీ కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. 27 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ లెవెల్లో ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒకదాన్ని లేదా రెంటినీ ఎంచుకోవచ్చు.
- బీఎస్సీ, బీఎస్ లెవెల్లో ఒక్కోదానికి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.
- లెవెల్ వారీగా నిర్దేశించిన ఒక్కో అంతర్గత కోర్సు పన్నెండు వారాలు ఉంటుంది. ప్రతి వారం వీడియో క్లాసులు, అసైన్‌మెంట్స్ ఉంటాయి. మంత్లీ క్విజ్‌లు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఉత్తీర్ణులు; కనీసం అయిదు సబ్జెక్టులతో ఎన్ఐఓఎస్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

క్వాలిఫయర్ ఎగ్జామ్

- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు మొదట నెల రోజులు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లీష్, మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్, కంప్యూటేషనల్ థింకింగ్ అంశాలపై తరగతులు ఉంటాయి. ఒక్కో అంశంపై వారానికి 2 నుంచి 3 గంటల వీడియో కంటెంట్ పంపుతారు. అభ్యర్థులకు ఇచ్చిన అసైన్‌మెంట్లను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పంపాలి. వీటికి మార్కులు ఉంటాయి. మొదటి మూడు అసైన్‌మెంట్లలో కనీసం రెంటిలో 40 శాతం స్కోర్ సాధించిన వారిని క్వాలిఫయర్ ఎగ్జామ్‌కు అనుమతిస్తారు. రిజర్వ్‌డు వర్గాలకు 30 శాతం వస్తే చాలు.
- పరీక్ష సమయం 3 గంటలు ఉంటుంది. అంటే ఒక్కో సబ్జెక్టుకు 45 నిమిషాలు ఇస్తారు. ఒక్కో దానిలో కనీసం 40 శాతం చొప్పున మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఈ ఎగ్జామ్ రిజల్ట్ వ్యాలిడిటీ ఏడాది లేదా మూడు టర్మ్‌ల వరకు ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; జనరల్ కేటగిరీ దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **క్వాలిఫయిర్ ఫేజ్ ప్రారంభం:** సెప్టెంబరు 20 నుంచి
- **క్వాలిఫయిర్ ఎగ్జామ్ తేదీ:** అక్టోబరు 27
- **ఫలితాలు విడుదల:** నవంబరు 1
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** నవంబరు 6 నుంచి 7 వరకు
- **వెబ్‌సైట్:** study.iitm.ac.in

కేంద్ర సాయుధ బలగాల్లో కానిస్టేబుల్/రైఫిల్‌మన్ పోస్టులు

ఖాళీలు 39,481

వివిధ కేంద్ర సాయుధ బలగాల్లో కానిస్టేబుల్/రైఫిల్ మన్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన నోటిఫికేషన్‌ను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ), సశస్త్ర సీమ బల్(ఎస్ఎస్‌బీ), సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఏఆర్)లో మొత్తం 39,481 ఖాళీలు భర్తీ చేస్తారు.

కేటగిరీ వారీ ఖాళీల వివరాలు

- **కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ)/రైఫిల్ మన్(జనరల్ డ్యూటీ), సిపాయి:** 39,481 పోస్టులు
- **పురుషులు:** ఎస్సీ-5254; ఎస్టీ-4021; ఓబీసీ-7747; ఈడబ్ల్యూఎస్-3496; యూఆర్-15094
- **మహిళలు:** ఎస్సీ-564; ఎస్టీ-433; ఓబీసీ-829; ఈబ్ల్యూఎస్-355; యూఆర్-1688

విభాగాల వారీ ఖాళీలు

1. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్): **15654 పోస్టులు**
2. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్): **7145**
3. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్): **11541**
4. సశస్త్ర సీమ బల్(ఎస్ఎస్‌బీ): **819**
5. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ): **3017**
6. అస్సాం రైఫిల్స్(ఏఆర్): **1248**
7. సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్): **35**
8. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ): **22**

అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్సిటీ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. పురుష అభ్యర్థుల ఎత్తు 170 సెం.మీ.లకు, మహిళా అభ్యర్థులకు 157 సెం.మీ.లకు తగ్గకూడదు.

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థులు2002 జనవరి 2 కంటే ముందు, 2007 జనవరి 1 తర్వాత జన్మించి ఉండకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

జీతభత్యాలు: పే లెవెల్-1 కింద ఎన్‌సీబీలో సిపాయి ఉద్యోగాలకు రూ.18,000 - రూ.56,900 చొప్పున చెల్లిస్తారు. ఇతర పోస్టులకు పే లెవెల్-3 కింద రూ.21,700 నుంచి రూ.69,100 వరకు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీబీఈ పరీక్ష విధానం: ప్రశ్న పత్రంలో మొత్తం 80 ప్రశ్నలు ఉంటాయి. 160 మార్కులు కేటాయించారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(20 ప్రశ్నలు-40 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్(20 ప్రశ్నలు- 40 మార్కులు), ఎలిమెంటరీ మేథ్స్(20 ప్రశ్నలు - 40 మార్కులు), ఇంగ్లీష్/హిందీ(20 ప్రశ్నలు - 40 మార్కులు) నుంచి ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది.

దరఖాస్తు రుసుము: రూ.100. మహిళలు/ఎస్సీ/ఎస్టీ/మాజీ సైనిక అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 14

వెబ్‌సైట్: https://ssc.gov.in/

జాబ్ కార్నర్

ఎన్‌టీహెచ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

కోల్‌కతాలోని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఫుడ్ అండ్ పీడీకు చెందిన నేషనల్ టెస్ట్ హౌజ్(ఎన్‌టీహెచ్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 6

విభాగాలు: టెక్నికల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ ఫుడ్ అనలిస్ట్, టెక్నికల్, మేనేజ్‌మెంట్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, పీజీ, డాక్టరేట్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు సీనియర్ యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు రూ.70,000; జూనియర్ యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు రూ.40,000.

పని ప్రదేశాలు: ఘజియాబాద్, జైపూర్

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: https://www.nth.gov.in/



లిటిల్స్

తెలివి తక్కువ తోడేలు



ఒక పావురం మరియు కోడిపుంజు అనుకోకుండా అడవిలో కలుసుకుని,మంచి స్నేహితులయ్యాయి.రోజూ అవి కాసేపు కలుసుకుని, కబుర్లు చెప్పుకునేవి. ఒక రోజు ఆ రెండూ అలాగే కలుసుకుని పావురం చెట్టుమీద వాలి, కోడిపుంజు నేలమీద గింజలు వెతుక్కుంటూ ఉండగా, బాగా ఆకలి మీద ఉన్న ఓ తోడేలు అటుగా వచ్చి, మేత కోసం తిరుగుతున్న కోడిపుంజును చూసింది.

చూడగానే మనసులో ఇలా అనుకుంది, 'ఈ కోడిపుంజు చక్కగా కొవ్వు పట్టి ఉన్నది. దీన్ని కానీఇంటికి పట్టుకెళ్లగలిగితే నాకు ఇవాళ విందు భోజనమే' అనుకుని, అదను చూసి, చాటునుండి కోడిపుంజు మీద దాడి చేసింది. దాన్ని అలాగే పట్టుకుని తన దగ్గరున్న సంచీలో వేసుకుంది. కోడిపుంజు చాలా భయపడిపోయి, సంచీలోనుంచే గట్టిగా అరవసాగింది. చెట్టుట్ల పైన కొమ్మమీద కూర్చుని ఇదంతా గమనించిన పావురం తన మిత్రుడికి ఏదైనా సాయం చేయాలి అనుకుంది. అనుకున్నదే తడవుగా వెళ్లి, తోడేలు వెళ్లే దారిలో చచ్చిపోయినట్టు కదలకుండా పడుకుంది. అది చూసిన తోడేలు' అదృష్టమంటే ఇవాళ నాదే, ఒకేసారి పావురం, కోడిపుంజు ఇవాళ రెండు పూటలా విందు నాకుఅనుకుంటూ పావురాన్ని సంచీలో వేయడానికి సంచీ తెరిచి పక్కన పెట్టింది, ఇదే అదనుగా సంచీలోఉన్న కోడిపుంజుమెల్లగా బయటపడి, తన స్థానంలో ఆ సంచీలో ఒక రాయిని పెట్టింది ఈ లోగా తోడేలు దగ్గరికి రావడం గమనించిన పావురం చటుక్కున లేచి, ఎగిరిపోయింది. 'అమ్మ పావురమా పిడికెడు ఉన్నావు నువ్వు నన్ను ఇంత మోసం చేస్తావా?'అనుకున్నది తోడేలు. అలా సంచీని మోసుకుంటూ ఆనందంగా ఇంటికి వెళ్ళి, సంచీ తెరిచి చూసి, అందులో కోడిపుంజు కాక పెద్ద రాయి ఉండటంతో అయోమయంగా కోడిపుంజు రాయిగా ఎలా మారిందా అని ఆలోచిస్తూ, ఆ పూట విందు కాదు కదా అసలు భోజనమే పోగొట్టుకున్నందుకు ఏడ్చింది తోడేలు. ఆ రోజు సాయంత్రం మరలా పావురం కోడిపుంజు రెండూ కలిసి తోడేలు తెలివి తక్కువ తనాన్ని తలచుకుని నవ్వుకున్నాయి. సమయస్ఫూర్తితో ,ఉపాయంతో అపాయాల నుండి తప్పించుకోవచ్చు. మనమేకాక మన మిత్రులను కూడా కాపాడుకోవచ్చు.

7 తేడాలను కనిపెట్టండి





సరైన నీడను గుర్తించండి





డైలీ సుడోకు - 404

	4		7	3			9	
	2		8		9			3
					2			
9						7		8
	7						3	
6		1						5
			6					
5			3		8		1	
	8			2	4		6	

సుడోకు - 403 సమాధానం

4	2	5	8	6	3	7	9	1
6	8	9	1	7	4	2	5	3
1	7	3	5	9	2	8	4	6
2	1	8	3	5	6	9	7	4
5	9	4	7	8	1	6	3	2
3	6	7	2	4	9	5	1	8
8	4	6	9	3	7	1	2	5
9	3	2	6	1	5	4	8	7
7	5	1	4	2	8	3	6	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.